అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
శనివారం 28-12-2024
సంపుటి: 10 సంచిక: 359 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 12 పేజీలు | వెల: 6.50



పెరుగుతున్న కాంట్రాక్ట్ కార్మికులు

2014 నుంచి ప్రభుత్వ రంగంలో ఉద్యోగాల పరిస్థితి దారుణంగా ఉంది. ఇది ప్రయివేటు రంగంలో ఉపాధి అవకాశాలపై ప్రతికూల ప్రభావం చూపింది. వ్యవస్థీకృత ఉత్పత్తి రంగంలో కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య పెరుగుతోంది. 2013లో 104.4 లక్షలుగా ఉన్న కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య 2023 నాటికి 136.1 లక్షలకు చేరింది. అయినప్పటికీ వారి ఉపాధి పరిస్థితులలో ఎలాంటి మెరుగుదల కన్పించడం లేదు. ఉత్పత్తి రంగంలో 2013లో కాంట్రాక్ట్ కార్మికుల వాటా 6.6 శాతం ఉంటే 2013 నాటికి 33.6 శాతానికి, 2022 నాటికి 40.2 శాతానికి పెరిగింది.

చితికిపోతున్న సంఘటిత రంగం



2014 - 24 కాలంలో పెరిగిన ప్రయివేటీకరణ - కాంట్రాక్టీకరణ

నరేంద్ర మోడీ పాలనలో సంఘటిత రంగంలోనూ పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. 2014-2024 మధ్యకాలంలో...అంటే తొలి పది సంవత్సరాల మోడీ హయాంలో సంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులవి కాంట్రాక్ట్ బతుకులయ్యాయి. ప్రయివేటీకరణ ప్రక్రియ వేగం పుంజుకుంది. వేతనాలు పెరగడం మాట అటుంచి తగ్గిపోయాయి. యూపీఏ ప్రభుత్వ చివరి సంవత్సరం (2014)లో భారతీయుల్లో అత్యంత సంపన్నులైన ఒక శాతం మంది చేతిలో 21.4 ఆదాయం ఉంటే 2022లో అది 22.6 శాతానికి పెరిగింది. నరేంద్ర మోడీ నేతృత్వంలోని పది సంవత్సరాల ఎన్డీఏ పాలనలో వారి సంపద వాటా 30.4 శాతం నుంచి 40.1 శాతానికి పెరిగింది.

న్యూఢిల్లీ : 2014లో దేశ జనాభాలో అత్యంత సంపన్నులైన పది శాతం మంది చేతిలో 56.1 శాతం సంపద ఉంటే 2022లో అది 57.7 శాతానికి పెరిగింది. అదే కాలంలో వారి సంపద వాటా 62.6 శాతం నుంచి 65 శాతానికి పెరిగింది. మోడీ హయాంలో మిగిలిన జనాభాలో ఆదాయం, సంపద...ఈ రెండింటి వాటా పడిపోయింది. ఒక్క మాటలో చెప్పాలంటే దేశంలోని బిలియనీర్లు, మల్టీ బిలియనీర్ల చేతిలోనే దేశ సంపద, ఆదాయం పోగుపడింది. ఇప్పుడు 2014 నుంచి సంఘటిత రంగంలోని కార్మికులు...ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగుల ఆర్థిక స్థితిగతులను పరిశీలిస్తే...

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు


సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు సంబంధించిన ఒప్పందాలపై భారత ప్రభుత్వం 2015 నుండీ సంతకాలు చేస్తూనే ఉంది. దేశంలోనూ, ఇతర దేశాల మధ్య ఆదాయ-సంపద అసమానతలను తగ్గించడం, ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం ఈ ఒప్పందాలను ఉద్దేశించారు. 2030 నాటికి పేదరికాన్ని తగ్గించడం, ఆకలిని పారద్రోలడం తాజా ఒప్పందాల లక్ష్యం. అయితే వీటిని సాధించాలంటే వేతనాలు, పని పరిస్థితులు, సామాజిక భద్రతకు సంబంధించి కార్మికుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచాల్సిన అవసరం ఉంది.

నయా ఉదారవాద విధానాల ఫలితం

సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, ప్రతి బ్యాంక్ ఖాతాకు రూ.15 లక్షలు బదిలీ చేస్తామని 2014 ఎన్నికలకు ముందు బీజేపీ హామీ ఇచ్చింది. మోడీ పాలనలో తొలి పది సంవత్సరాల కాలంలో ప్రజల ఆదాయాలు చాలా వరకూ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అనే విధంగా స్థిరంగా ఉన్నాయి. తొలి నాలుగు సంవత్సరాలలో స్వయం ఉపాధి పొందిన వారి నెలసరి ఆదాయం రూ.12,318 నుండి రూ.12,089కి తగ్గింది. దినసరి వేతన కార్మికుల నెలసరి ఆదాయం మాత్రం రూ.6,959 నుండి రూ.7,856కు స్వల్పంగా పెరిగింది. రెగ్యులర్ ఉద్యోగి నెలసరి వేతనం 2017-18లో రూ.19,450 ఉంటే 2021-22లో రూ.19,456 ఉంది. అంటే మూడు సంవత్సరాలలో పెరిగిన సగటు జీతం కేవలం ఆరు రూపాయలు మాత్రమే. పాతిక సంవత్సరాల లోపు వయసున్న విద్యావంతుల్లో నిరుద్యోగ రేట్లు ఆందోళనకరమైన స్థాయిలో ఉన్నాయని స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా నివేదిక (ఎస్‌డబ్ల్యూఆర్) తెలిపింది. 2021-22లో నిరుద్యోగ రేటు పట్టభద్రుల్లో 42.3 శాతం,

హయ్యర్ సెకండరీ చదివిన వారిలో 21.4 శాతం, సెకండరీ విద్యను అభ్యసించిన వారిలో 18.1 శాతం, ప్రాథమిక, మాధ్యమిక స్థాయి వరకూ చదివిన వారిలో 15 శాతం, అక్షరాస్యులే అయినా ప్రాథమిక విద్యను కూడా పూర్తి చేయని వారిలో 10.6 శాతం, నిరక్షరాస్యుల్లో 13.5 శాతంగా ఉంది. ప్రభుత్వం అనుసరించిన నయా ...13లో

తరుగుతున్న జీతాలు



నేడు మన్మోహన్ సింగ్‌కు
తుది వీడ్కోలు
అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు






ఏడు రోజులు సంతాప దినాలు
తీర్మానం ఆమోదించిన కేంద్ర మంత్రి వర్గం
రాష్ట్రపతి, ప్రధాని సహా పలువురి నివాళి
అంతర్జాతీయ నేతల సంతాపం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్‌కు నేడు తుది వీడ్కోలు పలకనున్నారు. నిగంబోధ్ ఘాట్‌లో అధికారిక లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి. ఉదయం 9.30 గంటలకు ఏఐసీసీ కార్యాలయం నుంచి రాజ్‌ఘాట్‌కు అంతిమ యాత్ర ప్రారంభమవుతుంది. ఉదయం 11.45 గంటలకు అంత్యక్రియలు జరుగుతాయి. అయితే అదే సమయంలో మన్మోహన్ సింగ్‌కు ప్రత్యేక స్మారక చిహ్నం ఏర్పాటు చేసేందుకు మాజీ ప్రధానుల స్మారక చిహ్నాలు ఉన్న రాజ్‌ఘాట్ సమీపంలోని యుమునా నది ఒడ్డున ప్రత్యేక స్థలం కేటాయించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. శక్తిస్థల్ ప్రాంతంలో ...6లో



మన్మోహన్ గొప్ప ఆర్థికవేత్త
సీఎం రేవంత్ రెడ్డి 6లో



మరో రోజు ఆగండి
కేటీఆర్‌ను అరెస్ట్ చేయకుండా
హైకోర్టు ఉత్తర్వులు 5లో
ఫార్ములా ఈ-రేస్ వ్యవహారంలో
క్వాష్ పిటిషన్‌పై విచారణ



జియో మరో షాక్
ఇక రీచార్జి డేటా గడువు ఒక్కరోజే
వినియోగదారుల నిలువుదోపిడీయే
వివరాలు 13లో

టెట్ అభ్యర్థులు
మెహందీ వేసుకురావొద్దు
పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందే గేట్లు మూసివేత
హాల్‌టికెట్‌తోపాటు గుర్తింపు కార్డు తప్పనిసరి
ముఖ్యమైన మార్గదర్శకాలు విడుదల
జనవరి 2 నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో రాతపరీక్షలు
వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్ల డౌన్‌లోడ్‌కు అవకాశం




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు దరఖాస్తు చేసిన అభ్యర్థులు హాల్‌టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశమున్నది. రాష్ట్రవ్యాప్తంగా టెట్ పేపర్-1కు 94,335 మంది, పేపర్-2కు 1,81,438 మంది కలిపి మొత్తం 2,75,773 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. హాల్‌టికెట్ల కోసం https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది. హాల్‌టికెట్లలో అభ్యర్థులు పాటించాల్సిన ముఖ్యమైన మార్గదర్శకాలను ...13లో



పాలమూరు ప్రాజెక్టులో కదలిక

'సుప్రీం' నోటీసులతో అధికారులు అప్రమత్తం
ఎట్టకేలకు నాగం పిటిషన్‌కు స్పందన
అంచనాలపై అంతర్మథనం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

పాలమూరు-రంగారెడ్డి సాగునీటి ఎత్తిపోతల పథకంపై సర్కారులో కదలిక వచ్చింది. ప్రాజెక్టు ఓరిజినల్ ఫైళ్లను తమకు సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో శుక్రవారం జలసౌధలో ఉన్నతాధికారులు భేటీ అయినట్టు సమాచారం. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, వికారాబాద్, నల్లగొండ జిల్లాలకు సాగు, తాగునీటిని అందించడం ప్రాజెక్టు లక్ష్యం. అలాగే గ్రేటర్ హైదరాబాద్ తాగునీటి అవసరాలకు సైతం దీని నుంచి నీళ్ల సరఫరా చేసేందుకు ప్రాజెక్టు డీపీఆర్ రూపొందించారు. ఇదిలావుండగా మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లోని పరిశ్రమలకు పాలమూరు నుంచి నీటిని సరఫరా చేయాలని నిర్ణయించారు. అలాగే విద్యుత్ ఉత్పత్తికి కూడా ఈ నీళ్లను వినియోగించాలనేది సర్కారు ఉద్దేశం. దాదాపు రూ.35 వేల కోట్ల బడ్జెట్ అంచనాతో డీపీఆర్ తయారైంది. అనంతరం దానిని రూ. 58 వేల కోట్లకు పెంచారు. గత ప్రభుత్వ క్యాబినెట్ సైతం దీనికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దాదాపు 12.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లందించడమే పథకం ప్రాథమిక లక్ష్యం. ఇప్పటికే నిర్మాణం ప్రారంభమైన సంగతి తెలిసిందే. గ్రావీటి ద్వారా నీటిని ఆయా జిల్లాల ఆయకట్టుకు అందించడం ముఖ్య ఉద్దేశం కూడా. 2023 సెప్టెంబరు 16న ఎల్లూరు-నార్లపూర్ పంపింగ్ స్టేషన్ ప్రారంభమైంది. కాగా 2017లో మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ఈ ప్రాజెక్టు అంచనాలను అక్రమంగా పెంచారంటూ హైకోర్టుకు వెళ్లారు. సీబీఐతో విచారణ జరిపించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. అక్కడ భిన్నమైన తీర్పు రావడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అంచనాల్లోనే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. యంత్ర పరికరాల విలువను పెంచారని ఆయన విమర్శిస్తున్నారు. సుప్రీంకోర్టు ఈనెల 18న నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో ఉన్నతాధికారుల్లో చర్చ ప్రారంభమైంది. ఆయా కంపెనీలు పనులు చేశాయి. మెఘా ఇంజినీరింగ్ కంపెనీకి చేసిన పనుల కంటే అధికంగా బిల్లులు చెల్లించారనే ...13లో

ముస్తాబైన నల్లగొండ
నేటి నుంచి టీఎస్‌యూటీఎఫ్ 6వ రాష్ట్ర మహాసభ

ఉదయం బహిరంగ సభ
మధ్యాహ్నం నుంచి విద్యాసదస్సులు
29, 30న ప్రతినిధుల సభ
8 స్టాళ్ల ద్వారా వైజ్ఞానిక ప్రదర్శనలు
ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర 6వ విద్య వైజ్ఞానిక రాష్ట్ర మహాసభ కోసం నల్లగొండ పట్టణం ముస్తాబైంది. పట్టణంలోని లక్ష్మీ గార్డెన్స్‌లో షేక్‌మహబూబ్‌అలీ ప్రాంగణంలో ఎన్.బలరాం వేదికగా ఈ నెల 28, 29, 30 తేదీల్లో మహాసభ జరగనుంది. నల్లగొండ ప్రధాన కూడలిలో యూటీఎఫ్ తోరణాలు మహాసభకు విచ్చేసే ఉపాధ్యాయులకు స్వాగతం పలుకుతున్నాయి. ప్రభుత్వ విద్యారంగం బలోపేతం లక్ష్యంగా, ఉపాధ్యాయుల, బోధనేతర సిబ్బంది సమస్యల పరిష్కారం దిశగా, ప్రభుత్వ రంగంలో ఉపాధ్యాయుల పాత్ర ప్రభావితం చేసే విధంగా తదితర అంశాలపై ఈ మహాసభలో చర్చించబోతున్నారు. రెండు మాసాలుగా మహాసభ ఆహ్వాన సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి పాఠశాలనూ సందర్శించి ఉపాధ్యాయ వర్గాలను చైతన్యపరచడం కోసం కరపత్రికలు అందజేశారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి విద్య వైజ్ఞానిక మహాసభను జయప్రదం చేసే విధంగా ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. మహాసభ కోసం ఆహ్వానసంఘం చైర్మెన్, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వాహకులు తీవ్రంగా శ్రమించారు. శుక్రవారం మహాసభ ప్రాంగణం వద్ద ఏర్పాట్లను నర్సిరెడ్డి పరిశీలించారు. ఆయన వెంట యూటీఎఫ్ జిల్లా నాయకులు ఉన్నారు.



లక్ష్మీ గార్డెన్‌లో బహిరంగ సభ

మొదటి రోజు ఈ నెల 28న నల్లగొండలోని లక్ష్మిగార్డెన్ ఆవరణలో 7000 మంది ఉపాధ్యాయులతో భారీ బహిరంగ సభ జరగనుంది. సభకు ముందు పట్టణంలో ఉపాధ్యాయుల మహాప్రదర్శన ఉంటుంది. ఉదయం పది గంటలకు పతాకావిష్కరణ, పదిన్నర గంటలకు వైజ్ఞానిక ప్రదర్శనలు ప్రారంభమవుతాయి. పదకొండు గంటలకు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె.జంగయ్య ఆధ్వర్యంలో సభ ప్రారంభం కానుంది. ప్రారంభ సభకు రాష్ట్ర శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రోడ్డు భవనాలు, సినిమా ఫోటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి హాజరుకానున్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు విద్యాసదస్సులు ప్రారంభమవుతాయి. 'భారత ఆర్థిక వ్యవస్థలో మధ్యతరగతి ప్రజలకు ఏం జరుగుతుంది' అనే అంశంపై ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, రాజ్యాంగ విలువలపై సీనియర్ పాత్రికేయులు, ఆంధ్రజ్యోతి మాజీ సంపాదకులు డాక్టర్ శ్రీనివాస్, 'జాతీయ విద్యా విధానం- ప్రభుత్వ విద్యపై ప్రభావం' అంశంపై ఎస్ఎఫ్ఐ జాయింట్ సెక్రెటరీ కుమారి ...13లో

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి
సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో నిరసన
జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు, దిష్టిబొమ్మల దహనం



నవతెలంగాణ - ముషీరాబాద్

అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పలు జిల్లాల్లో అమిత్‌షా దిష్టిబొమ్మలు దహనం చేశారు. గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత ...13లో

పెండింగ్ బిల్లులివ్వండి
రాష్ట్ర ప్రభుత్వానికి మాజీ సర్పంచుల వేడుకోలు




హైదరాబాద్ బాపూఘాట్ వద్ద నిరసన

వివరాలు 13లో

కరిగిపోతున్న విదేశీ మారకం నిల్వలు

వారంలోనే తగ్గిన 8.4 బిలియన్ డాలర్లు
ఏడు నెలల కనిష్టానికి పతనం



ముంబయి : భారత విదేశీ మారకం నిల్వలు కర్పూరంలా కరిగిపోతోన్నాయి. వరుసగా మూడో వారంలోనూ క్షీణించాయి. ప్రస్తుత ఏడాది డిసెంబర్ 20తో ముగిసిన వారంలో మారకం నిల్వలు 8.4 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.71వేల కోట్లు విలువ) తరిగిపోయి 644.391 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. దీంతో ...13లో

పతనం దిశలోనే రూపాయి



13లో

డాలర్ @ 85.50

ప్రపంచ మార్కెట్‌లో రూపాయి మారకం విలువ ఇప్పటికే భారీగా పడిపోగా.. మరింత అగాథంలోకి జారుకుని నూతన కనిష్టాన్ని చవి చూసింది.



ఆల్బర్ట్ ష్వైజర్ ఆత్మకథ పుస్తకావిష్కరణలో వక్తలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆల్బర్ట్ ష్వైజర్ చెప్పినట్టు ప్రతి ఒక్కరూ మనిషిని మనిషిగా గౌరవించడాన్ని అలవర్చుకోవాలని పలువురు వక్తలు చెప్పారు. శుక్రవారం హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ప్రాంగణంలో కవి, కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యులు ప్రసేన్ అధ్యక్షతన ఆల్బర్ ష్వైజర్ ఆత్మకథ పుస్తకాన్ని కవి, విద్యావేత్త రవిమారుత్ ఆవిష్కరించారు. వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్, కవులు, రచయితలు కె.శైలజ, ఆనందాచారి, ఎస్.రఘు, కోట్ల వెంకటేశ్వరరెడ్డి, సీతారాం, తదితరులు మాట్లాడుతూ.. జర్మనీలో పుట్టిపెరిగి ఆఫ్రికా పేదల జీవన విధానాన్ని చూసి ష్వైజర్ చలించిపోయారనీ, వైద్యవృత్తిని నేర్చుకుని వెళ్లి మరీ అక్కడి ప్రజలకు సేవలు అందించారని కొనియాడారు. ఆఫ్రికా ప్రజల మీద వలసవాదుల ఆధిపత్యాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తుచేశారు. దేశాలు, ప్రాంతాలు వేరైనా మనుషులంతా ఒక్కటేననీ, ఒక్కరు కూడా బాధపడొద్దని ఆశించిన, పీడిత ప్రజల పక్షాన నిలిచిన మహనీయుడు ష్వైజర్ అని కొనియాడారు. మన ప్రాణం విలువ ఎంత విలువైనందో ఎదుటి వారి ప్రాణం కూడా అంతే విలువైందనే విషయాన్ని ప్రతిఒక్కరూ ఎరిగి నడుచుకోవాలని సూచించారు. విద్వేషాల పేరుతో నేడు దేశంలో ఎదుటివారిని నొప్పించి బాధపెట్టాలని చూడటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. సాటి మనుషులను చంపివేయడం దుర్మార్గమన్నారు. ఎదుటి వాళ్ల బాధను తగ్గించాలనుకునేవారు ష్వైజర్ ఆత్మకథను ఒక పాఠంగా తీసుకోవాలన్నారు.

దళిత హెచ్‌ఎం రాములుపై మతోన్మాదుల దాడి

- డీటీఎఫ్, బీటీఏ ఖండన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ గ్రామ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు (జీహెచ్‌ఎం) రాములు (దళితుడు)పై మతోన్మాద మూకలు భక్తి ముసుగు వేసుకుని ఉద్దేశపూర్వకంగా దాడి చేయడాన్ని డీటీఎఫ్, బీటీఏ తీవ్రంగా ఖండించాయి. ఈ మేరకు డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎం సోమయ్య, టి లింగారెడ్డి, బీటీఏ అధ్యక్షులు కల్పదర్శి చైతన్య శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 21న తుక్కుగూడ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను లెక్కలు అడిగిన సందర్భంగా సరిగ్గా చెప్పనందుకు ఓ విద్యార్థిని ఆ హెచ్‌ఎం పక్కకు నిలబెట్టారని తెలిపారు. దాన్ని అయ్యప్పమాల వేసుకున్న విద్యార్థిని కాలితో తన్నాడనే దుష్ప్రచారం చేసి సోషల్ మీడియాలో వైరల్ చేసి కొంత మంది మతోన్మాద మూకలని సమీకరించి ప్రణాళికాబద్ధంగా హెచ్‌ఎం రాములుపై దాడి చేశారని పేర్కొన్నారు. క్షమాపణ చెప్పినా వినకుండా, అక్కడున్న మాలను ధరించిన విద్యార్థి, ఇతర స్వాములకు మొక్కించడం అత్యంత హేయమని వివరించారు. దాడికి గురైన హెచ్‌ఎం రాములు దళితుడని తెలిపారు. ఈ సంఘటన ఉపాధ్యాయుల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. పాఠశాలల్లో మతోన్మాదుల జోక్యం సరికాదని తెలిపారు. ఈ దాడి విషయాన్ని ప్రభుత్వం, పోలీసులు తీవ్రంగా పరిగణించి నిందితులపై కేసులను నమోదు చేసి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి : పీఆర్టీయూటీఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని పీఆర్టీయూటీఎస్ కోరింది. వారి సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని సూచించింది. ఈ మేరకు పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, పుల్గం దామోదర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి మోహన్‌రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శులు బీరెల్లి కమలాకర్‌రావు, గుండు లక్ష్మణ్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రెండు దశాబ్దాలుగా ఉద్యోగ భద్రత లేకుండా సమగ్ర శిక్ష ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. ఐదేండ్లుగా వేతనాల్లో పెరుగుదల లేక అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వారి సమస్యలన్నీ పరిష్కరించి రెగ్యులరైజ్ చేస్తూ వేతనాలను పెంచాలంటూ వారు సమ్మె చేస్తున్నారని వివరించారు. సమగ్ర శిక్ష ఉద్యోగులతో ప్రభుత్వం చర్చించి వారి సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ పాఠశాలల విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వెంటనే సమ్మె విరమింపజేయాలని కోరారు.



అంబేద్కర్ తాత్వికతకు అక్షర రూపం కోయి నాగస్వరం

- కవి శిఖామణి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కోయి కోటేశ్వర రావు నాగ స్వరం కవితా సంపుటి అంబేద్కర్, పూలే భావజాలానికి అక్షరరూపం అని సుప్రసిద్ధ కవి శిఖామణి అన్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో తోపుడుబండి సాదిక్ వేదిక పై కోయి కోటేశ్వర రావు రచించిన నాగ స్వరం కవితా సంపుటిని శిఖా మణి ఆవిష్కరించి మాట్లాడారు. అస్తిత్వ ఉద్యమాల భావజాలాన్ని శక్తివంతంగా తన కవిత్వంలో కోటేశ్వర రావు ఆవిష్కరించారని కొనియాడారు. రునాగస్వరంలో కోటేశ్వర రావు కవిత్వం, విమర్శ పరిశోధన లాంటి భిన్న ప్రక్రియల్లో బహుముఖ ప్రతిభ కనబరుస్తున్నారని ప్రశంసించారు. ప్రముఖ విమర్శకులు డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ కోయి కోటేశ్వర రావు రాసిన కవిత్వంలో గొప్ప జీవన ఆర్తి ఉందనీ, ఫాసిజాన్ని తీవ్రంగా వ్యతిరేకించే తత్త్వం ఉందని అన్నారు. ప్రముఖ సాహితీ వేత్త పసునూరి రవీందర్ మాట్లాడుతూ కోయి కవిత్వం తనకెంతో ఇష్టమనీ, వస్తురూపాలను సముచితంగా సమన్వయం చేస్తూ పది కాలాలు నిలిచి పోయే కవిత్వం రాశారని కొనియాడారు. సభకు అధ్యక్షత వహించిన యోగి వేమన యూనివర్సిటీ విశ్వ విద్యాలయం ఆచార్యులు వినోదిని మాట్లాడుతూ కోయి కవిత్వంలో సమాజం పట్ల ధర్మాగ్రహంతో పాటు ఆర్ద్రత కూడా కనిపిస్తుందన్నారు.

చరిత్ర సగం రాసిన వాక్యం

- జూలూరు గౌరీశంకర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

చరిత్ర సగం రాసిన వాక్యం అని తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు జూలూరు గౌరీశంకర్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో సీనియర్ జర్నలిస్ట్ పీవీ రావు రాసిన వ్యాసాల సంకలనం 'వార్తలు సమాప్తం లోపలి కథ మొదలు' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సభకు కవి, జర్నలిస్ట్ ప్రసేన్ అధ్యక్షత వహించగా గౌరీశంకర్ మాట్లడుతూ చరిత్ర సగం రాసిన వాక్యం అన్నారు. మల్లన్నసాగర్ రైతుల పక్షం నిలిచినట్టుగానే లగచర్ల అంశం పట్ల రచయితలు స్పందించాలని కోరారు. జర్నలిస్టుల వాక్యాలకు పదును ఉంటుందనీ, సామాజిక చింతన ఉన్న వారే గొప్ప జర్నలిస్టులు అవుతారని అన్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులు యాకూబ్ మాట్లాడుతూ.. పుస్తకం నివురు గప్పిన నిప్పు అని అన్నారు. రచయిత పీవీ రావు మాట్లాడుతూ.. నన్ను కదిలించిన ఘటనలు రాశానని స్పందించారు. ఈ సభలో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, మిమిక్రీ ఆర్టిస్ట్ రమేష్, సింగరేణి మాజీ డైరక్టర్ డిఎల్ ఆర్ ప్రసాద్, కొండపల్లి పవన్, తెలంగాణ పబ్లికేషన్స్ నిర్వాహకులు కోయ చంద్రమోహన్, కవి తంగిరాల చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ప్రసిద్ధ కవి సుంకిరెడ్డి నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన కవి సమ్మేళనంలో మెర్సీ మార్గరెట్, నస్రీంఖాన్, వనపట్ల సుబ్బయ్య, రూపా రుక్మిణి, సుంకర రమేశ్, ఉదారి నారాయణ, సలీమ, మోహన్‌కృష్ణ, తదితరులు సామాజిక చైతన్యపూరితమైన తమ స్వీయ కవితలను వినిపించారు.



కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత తగుళ్ళ గోపాల్ అధ్యక్షతన జరిగిన యువ కవి సమ్మేళనంలో యువ కవులు వైవిధ్యభరితమైన స్వీయ కవితలు వినిపించారు. అందులో పేర్ల రాము, సాయికిరణ్, శ్రీనిధి, అనూష, కిరణ్‌మహేశ్, తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌లోని నవతెలంగాణ బుక్‌స్టాల్‌లో పుస్తకాలను పరిశీలిస్తున్న శాసన మండలి డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాశ్, ఆయన పక్కన బుక్‌ఫెయిర్ కార్యదర్శి ఆర్.వాసు

నేడు బుక్‌ఫెయిర్‌కు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రాక

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో గల దాశరథి ప్రాంగణంలో హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌ను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ వర్మ సందర్శించనున్నట్టు బుక్‌ఫెయిర్ అధ్యక్షులు, కవి యాకూబ్, కార్యదర్శి ఆర్.వాసు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గవర్నర్ మధ్యాహ్నం 3 గంటల నుంచి పలు స్టాళ్లను సందర్శిస్తారని పేర్కొన్నారు. అనంతరం బోయి విజయభారతి వేదికగా జరిగే సభలో పుస్తకప్రియులను ఉద్దేశించి మాట్లాడుతారని తెలిపారు.

నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలి

- వెనక్కి తీసుకునే వరకు పోరాడుతాం : ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు వీపీ సాను
- మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలు



నవతెలంగాణ-మహబూబాబాద్

నూతన విద్యా విధానం రద్దు చేసేంత వరకు పోరాడుతామని ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు వీపీ సాను తెలిపారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పెరుమండ్ల జగన్నాథం భవన్‌లో శుక్రవారం జరిగిన భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కేంద్రం నిర్దయమైన నూతన జాతీయ విద్యా విధానం-2020 వల్ల పేద విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని, బాలిక విద్య మరింత దిగజారుతున్నదని, దాంతో బాల్య వివాహాలూ పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విద్యా విధానం సెంట్రలైజేషన్, కమర్షియలైజేషన్, కమ్యూనలైజేషన్‌కు కేంద్రంగా ఉందని అన్నారు. సామాజిక న్యాయాన్ని విస్మరించి, మను ధర్మ శాస్త్ర ఎజెండాను అమలు చేసేందుకే ఈ విద్యావిధానాన్ని తీసుకొచ్చారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి పరిశోధక విద్యార్థికి రాష్ట్ర ప్రభుత్వం ఫెలోషిప్ ఇవ్వాలని కోరారు. స్వాతంత్ర్యోద్యమంలో భగత్ సింగ్ లాంటి వీరుల త్యాగాల వారసత్వాన్ని తలకెత్తుకొని విద్యార్థుల పోరాట పటిమను కొనసాగించడానికి 'స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం' లక్ష్యాలతో పురుడు పోసుకున్నదే ఎస్ఎఫ్ఐ అని అన్నారు. ఎస్ఎఫ్ఐ ఏర్పాటై నేటికి 50ఏండ్లు గడిచిపోయిందని, నాటి నుంచి దిన దిన ప్రవర్ధమానంగా ఎదుగుతూ 50 లక్షలకు పైగా సభ్యత్వంతో దేశంలో అతి పెద్ద విద్యార్థి సంఘంగా ఉందని అన్నారు. 'అధ్యయనం-పోరాటం' నినాదాలతో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం రాజీలేని పోరాటాలను నిర్వహిస్తున్నదని తెలిపారు. అందుకే జెఎన్‌యూ నుంచి హెచ్‌సీయూ వరకు స్టూడెంట్స్ ఎన్నికల్లో ఎస్ఎఫ్ఐ విజయం సాధిస్తోందని అన్నారు. అనంతరం రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రోజురోజుకు విద్యారంగం దివాళా తీస్తున్నదని, ఫుడ్ పాయిజన్ ఘటనలు, గురుకులాల్లో అనేక సమస్యలు బయటకు వచ్చినా వాటిని ప్రభుత్వం పెడ చెవిన పెడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమ వసతిగృహాలు, యూనివర్సిటీల్లో సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విద్యారంగానికి తక్షణమే మంత్రిని నియమించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర వీరభద్రం, మహబూబాబాద్ జిల్లా కన్వీనర్ పట్ల మధు, జిల్లా కో కన్వీనర్లు గుగులోతు సూర్యప్రకాశ్, గందసిరి జ్యోతిబసు, దీపిక, సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా నాయకులు సింహాద్రి, భూక్యా రాజేష్, ప్రవీణ్, వినయ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

సోషలిజం అజేయం

- దేశానికి ఒకే ఎన్నిక సముచితం కాదు
- సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలకు ప్రజల సంపూర్ణ మద్దతు
- "సమకాలీన పరిస్థితులు-సోషలిజం ఔనత్యం" పై సెమినార్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య



నవతెలంగాణ- పటాన్‌చెరు

సోషలిజం అజేయమని, కమ్యూనిస్టు సిద్ధాంతం ద్వారానే సమసమాజం ఏర్పడుతుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని అంబేద్కర్ భవన్‌లో "సమకాలిన పరిస్థితులు-సోషలిజం ఔనత్యం" అంశంపై శుక్రవారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ప్రపంచ ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితుల్ని పరిశీలించినప్పుడు ఎర్రజెండా ఔనత్యం పెరుగుతుందన్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతానికి ప్రత్యామ్నాయం అనేది లేదన్నారు. అనేక దేశాల్లో ఎర్రజెండా నాయకత్వాన సోషలిజం అజేయంగా విరాజిల్లుతుందని తెలిపారు. తారతమ్యాల్లేని సమసమాజం కేవలం కమ్యూనిస్టు సిద్ధాంతంతోనే సాధ్యపడుతుందన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా ఒకప్పుడు సోవియట్ రష్యా నిలిచిందని, ప్రస్తుతం చైనా ప్రపంచానికే ప్రత్యామ్నాయంగా ముందుకు సాగు తున్న పరిస్థితులు న్నాయన్నారు. అనేక దేశాల్లో జరుగుతున్న పోరాటాలు, ఎన్నికల్లో వస్తున్న ఫలితాలు ఎర్రజెండా గొప్పదనాన్ని పెంచుతున్నాయన్నారు. ఫెడరల్ స్ఫూర్తితో నడుస్తున్న భారతదేశంలో ఒకే ఎన్నిక అనేది సముచితం కాదన్నారు. కేంద్రంతో పాటు రాష్ట్రాలకు ఒకేసారి ఎన్నికలు జరపడం ద్వారా ఖర్చు అంశాన్ని ప్రాధాన్యతగా తీసుకోవడంతో సరిపోదన్నారు.

కమ్యూనిజం ద్వారానే సమసమాజం

ఆయా రాష్ట్రాల్లో జరిగే రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థి తులను బట్టి ప్రజలు తీర్పుని స్తుంటారని తెలిపారు. బీజేపీ ముందుకు తెస్తున్న ఒకే ఎన్నిక ఎజెండా వెనకాల వేరే ప్రయోజనాలు దాగి ఉన్నాయని, వాటిని ప్రజలకు చెప్పకుండా దేశంలో అన్ని చట్టసభలకు ఒకేసారి ఎన్నికలు జరపడం ద్వారా ఖర్చు, సమయం వృథా కాకుండా చూడొచ్చన్న విషయాలను మాత్రమే జనంలో చర్చకు పెట్టడం సరికాదన్నారు. నిరుద్యోగం, అధిక ధరలు, పేదరికం, సామాజిక వివక్ష, విద్య, వైద్యం వంటి అనేక కీలకాంశాలను చర్చకు రాకుండా కేంద్ర ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చు కుంటుందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ(ఎం) అనేక ఉద్యమాలు నడుపుతు న్నదన్నారు. రాబోయే కాలంలో మరింత సమరశీలంగా ప్రజల్ని ఐక్యం చేసి పోరాటాలు నడిపేందుకు అవసరమైన కర్తవ్యాలను సంగారెడ్డిలో జరగనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర నాల్గోవ మహాసభల్లో చర్చిస్తామని తెలిపారు. ఈ సెమినార్‌లో సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.రాజయ్య, జిల్లా కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, నాయకులు పాండురంగారెడ్డి, వాజీద్ అలీ, బంగారు రాజు, శాంతకుమార్, జయకుమార్, రామకృష్ణ, పోచయ్య, బాస్కర్‌రెడ్డి, వీరారావు, సదాశివరెడ్డి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

అల్లు అర్జున్ కేసు 10కి వాయిదా



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

సంచలనం రేపిన సంధ్యా థియేటర్ ఘటన కేసులో సినీనటుడు అల్లు అర్జున్‌పై విచారణ కేసును వచ్చేనెల 10కి నాంపల్లి కోర్టు వాయిదా వేసింది. సంధ్యా థియేటర్‌లో పుష్ప-2 ప్రీమియర్ షో ఈ నెల 4న జరిగిన తొక్కిసలాటలో ఒక మహిళ మృతి చెందగా.. ఆమె కుమారుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆ బాలుడు ఇంకా కోలుకోలేదు. కాగా, ఈ ఘటనకు సంబంధించి చిక్కడపల్లి పోలీసులు సినిమా థియేటర్ యాజమాన్యంతో పాటు నటుడు అల్లు అర్జున్, అతనికి భద్రత కల్పించిన బౌన్సర్ల పైనా కేసులు నమోదు చేయటం, ఈ నెల 13న అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయటం, అదే రోజు హైకోర్టు నటుడికి నాలుగు వారాల పాటు అరెస్ట్ చేయకుండా వెసులుబాటునివ్వటం తెలిసిందే. కాగా, హైకోర్టు తీర్పు వెలువడకముందే అల్లు అర్జున్‌ను నాంపల్లి కోర్టు రిమాండ్ చేయటంతో వెంటనే నిందితుడిని చిక్కడపల్లి పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. చివరికి, నాటకీయ ఫక్కీలో అర్ధరాత్రి జైలుకు హైకోర్టు ఆదేశాలు అందినా.. అప్పటికే సమయం గడిచిందంటూ తెలిపిన జైలు సూపరింటెండెంట్ అర్జున్‌ను మరుసటి రోజు 14వ తేదీ ఉదయం విడుదల చేస్తామని చెప్పి వెళ్లిపోయారు. ఆ మేరకు ఆ రాత్రి జైలులోనే గడిపిన అర్జున్.. మరుసటి రోజు విడుదలయ్యాడు. కాగా, నాంపల్లి కోర్టు విధించిన జ్యుడీషియల్ రిమాండ్ గడువు శుక్రవారం 27వ తేదీతో ముగియటంతో వర్చువల్‌గా కోర్టుకు అల్లు అర్జున్ హాజరయ్యాడు. విచారణ జరిపిన న్యాయమూర్తి ఈ కేసును వచ్చేనెల 10వ తేదీకి వాయిదా వేశారు.

ప్రజా పోరాటాలే సమస్యలకు పరిష్కారం



మతోన్మాద బీజేపీని తరిమికొట్టండి

- ప్రజా సమస్యల పట్ల ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదు
- ప్రజలకు అండగా ఎర్రజెండా : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి
- స్టేషన్‌ఘన్‌పూర్‌లో సీపీఐ(ఎం) జనగామ జిల్లా మహాసభలు ప్రారంభం

నవతెలంగాణ-జనగామ

ప్రజా పోరాటాలే సమస్యలకు పరిష్కార మార్గమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో సీపీఐ(ఎం) జిల్లా 3వ మహాసభలు శుక్రవారం ప్రారంభయ్యాయి. ఈ సందర్భంగా స్టేషన్‌ఘన్‌పూర్ బస్టాండ్ సమీపంలోని కూరగాయల మార్కెట్ గ్రౌండ్ నుంచి గాంధీ సెంటర్ మీదుగా ఫ్లై ఓవర్ బ్రిడ్జి పక్కనున్న తెలంగాణ క్రీడా ప్రాంగణం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు దర్గ్యా నాయక్ ప్రాంగణం (తెలంగాణ క్రీడా మైదానం)లో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మునిగల రమేష్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో జూలకంటి మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పేదల పక్షాన నిలబడి రక్తం ఒడ్డిన చరిత్ర జనగామ ప్రాంతానికి ఉందన్నారు. 75 ఏండ్ల స్వతంత్ర భారతదేశంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని, పాలకులు దోచుకుని దాచుకోవడం తప్ప అని అన్నారు. దేశంలో రైతులు, శ్రామికులు దేశ సంపదను సృష్టిస్తుంటే వాటిని పాలకులు దోచి కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని విమర్శించారు. ఆదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తులకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఊడిగం చేస్తోందన్నారు. పదేండ్ల 8 నెలల పాలనలో పన్నుల మీద పన్నులు వేస్తూ ప్రజలపై భారం మోపుతోందన్నారు. పదేండ్ల క్రితం రూ.55 వేల కోట్లు అప్పులు ఉంటే ఇప్పుడు రూ.1.55 లక్షల కోట్ల అప్పులు చేసిందని అన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పిన బీజేపీ దేశంలో ప్రభుత్వ సంస్థలను ప్రయివేటీకరించి నిరుద్యోగాన్ని మరింత పెంచి పోషిస్తున్నదని తెలిపారు. మతాల మధ్య చిచ్చు పెడుతూ దేశంలో మారణహోమాన్ని సృష్టిస్తున్న బీజేపీని ప్రజలు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. పగటి వేషగాళ్లుగా రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు రోజుకో పార్టీ మారుతున్నారని అన్నారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం విధ్వంసానికి గురైందని, దాంతో ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారని అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీలను నేటికీ పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని తెలిపారు. ప్రజా సమస్యలు గాలికి వదిలేసి ఒకరినొకరు తిట్టుకునే పనిలో ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేద, బడుగు, బలహీనవర్గాల సమస్యల పరిష్కారం కోసం ఎర్రజెండా అండగా ఉంటుందన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ మాట్లాడుతూ.. దేశంలో ఎర్రజెండానే పేదలకు ప్రత్యామ్నాయమని, దేశ రాజకీయాల్లో నిర్మాణాత్మక పాత్ర పోషించి పేద బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తోందన్నారు.

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌ను, భారత రాజ్యాంగాన్ని అవమానపరుస్తూ మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలనే పిచ్చి ఆలోచనలు చేస్తున్నారని, వాటిని మానుకోవాలని హెచ్చరించారు. ఈ సభలో సీపీఐ(ఎం) జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఇర్రి అహల్య, రాపర్తి రాజు, సాంబరాజు యాదగిరి, బోట్ల శేఖర్, రాపర్తి సోమయ్య, సింగారపు రమేష్, నాయకులు బూడిద గోపి, కొడిపాక నాగరాజు, జోగు ప్రకాష్, చుంచు విజయేందర్, చందు నాయక్, బోడ నరేందర్, బెల్లంకొండ వెంకటేష్, ధర్మ బిక్షం తదితరులు పాల్గొన్నారు.

నేడు చర్లపల్లిలో సీఐటీయూ రాష్ట్ర సెమినార్

- "మతోన్మాదం-రాజ్యాంగ హక్కుల పరిరక్షణ' అంశంపై.. హాజరుకానున్న బివి.రాఘవులు



నవతెలంగాణ - చర్లపల్లి

సీఐటీయూ అఖిల భారత పూర్వ అధ్యక్షులు, ఇ.బాలానందన్ శత జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా "మతోన్మాదం - రాజ్యాంగ హక్కుల పరిరక్షణ" అంశంపై శనివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా చర్లపల్లిలో రాష్ట్ర సెమినార్ నిర్వహిస్తున్నట్టు ఆ యూనియన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ఎ.అశోక్, ప్రధాన కార్యదర్శి జె.చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చర్లపల్లి పారిశ్రామికవాడలోని చర్లపల్లి ఫేజ్-2 చర్లపల్లి ఇండస్ట్రియల్ అసోసియేషన్ (సీఐఏ) హాల్‌లో శనివారం సాయంత్రం 5 గంటలకు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అధ్యక్షతన సెమినార్ జరగనున్నట్టు పేర్కొన్నారు. సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు, సీఐటీయూ ఉమ్మడి రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి బివి.రాఘవులు ప్రధాన ఉపన్యాసం చేస్తారన్నారు. వక్తలుగా సీఐటీయూ సీనియర్ నాయకులు పి.రాజారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ.రమ హాజరవుతున్నారని తెలిపారు.

జిల్లా పరిధిలోని వివిధ పారిశ్రామికవాడ పరిశ్రమల కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై సెమినార్‌ను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. మతోన్మాదులు, కార్పొరేట్లు రాజ్యాంగ హక్కులను కాలరాసేందుకు కుట్రలు చేస్తున్నాయని, వీటిని పోరాట శక్తితో అడ్డుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా వారు చెప్పారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

ఉపాధికి చట్టం చేయాలి : ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు పి.అరుణ జ్యోతి



నవతెలంగాణ-ఖమ్మం

మహిళలకు రక్షణ కల్పించాలని, ఉపాధికి చట్టం చేయాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు పి.అరుణ జ్యోతి అన్నారు. శుక్రవారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో మెరుగు రమణ అధ్యక్షతన నిర్వహించిన ఐద్వా జిల్లా వర్క్‌షాప్‌లో ఆమె మాట్లాడారు. నేడు సమాజంలో మహిళలు స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి లేదని, పసి వయసు నుంచి పండు ముసలి వరకూ లైంగికదాడులు, హత్యలు, హింస పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు ఎవరు మారినా మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలమవు తున్నారని విమర్శించారు. సమాజంలో మూఢన మ్మకాలు, డ్రగ్స్, మద్యం, నీలి చిత్రాలు, పబ్బుల వల్ల యువత చెడు మార్గం పట్టి మహిళల మీద అగాయి త్యాలకు, హింసకు పాల్పడుతున్నారని తెలిపారు. తక్షణం వాటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. మహిళల్లో మూఢనమ్మకాలను పోషిస్తు న్నారని అన్నారు. భారత రాజ్యాంగానికి బీజేపీ వల్ల ప్రమాదం ఏర్పడిందని, దాన్ని రక్షించుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందని తెలిపారు. దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నించే మతోన్మాద శక్తులకు, విచ్ఛిన్న శక్తులకు వ్యతిరేకంగా మహిళలు పోరాడాలని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు దాటినా మహిళా సాధికారిత కోసం నేటికీ చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో 25 శాతం కేటాయించాలని డిమాండ్ చేశారు. మహిళలకు రక్షణ లేకపోతే సమాజ అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక మహిళలు, దళితులు, గిరిజనులు, పేదల మీద దాడులు పెరిగాయని, వారు తినే తిండి, కట్టుకునే బట్టలు, వారి ఆచార వ్యవహారాల మీద ఆంక్షలు విధిస్తున్నారని, ఇది ప్రజాస్వామ్య లౌకిక విధానానికి వ్యతిరేకమన్నారు. మహిళా అభివృద్ధి, రక్షణ కోసం తెచ్చిన చట్టాలను డబ్బు ఉన్నవారికి, అధికారంలో ఉన్న వారికి చుట్టాలుగా పనిచేస్తున్నాయని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాల విధానాల వల్ల ధరలు పెరిగి మహిళలకు పోషకాహారం అందక, సరైన ఆహారం తినక వ్యాధుల బారిన పడి మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు 40 శాతం మంది మహిళలు రక్తహీనతతో, 50 శాతం పిల్లలు రక్తం లేక బాధపడుతున్నారని తెలిపారు. పేద మహిళల రక్షణ కోసం ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రేషన్ షాపుల ద్వారా కేరళ తరహాలో 17 రకాల నిత్యావసర వస్తువులను అందించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలని అమలు చేయా లని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు బుగ్గవీటి సరళ, రాష్ట్ర కోశా ధికారి మాచర్ల భారతి, జిల్లా కార్యదర్శి బండి పద్మ, జిల్లా ఆఫీస్ బేరర్స్ పి.నాగ సులోచన, మెహరున్నీసా బేగం, కె.అమరావతి, జె.సునీత, పి.ప్రభావతి, ఎస్.పకీరమ్మ, పి.సుమతి, బెల్లం లక్ష్మి, సంఘం జిల్లా నాయకులు కోలేటి అరుణ, ఎం.నాగమణి, టి.విజయ, పద్మ, కె.ఉమామతి, ఎస్‌కే. షైనాబీ, కుమారి, ఫరీదా, బొడ్డు పద్మ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లను పెంచాలి

- లేనిపక్షంలో 'స్థానిక' ఎన్నికలు జరగనివ్వం
- జనవరి 3న ఇందిరా పార్కు వద్ద భారీ సభ
- జనగణనలో భాగంగా బీసీ కులగణన చేపట్టాలి : ఎమ్మెల్సీ కవితతో 40కిపైగా బీసీ కుల సంఘాల నేతల భేటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచకుంటే తాము ఎన్నికలు జరగనివ్వబోమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ మేరకు రిజర్వేషన్లు పెంచిన తర్వాతే ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించడంపై ఆలోచన చేయాలనీ, లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీల అమలు కోసం జనవరి 3న ఇందిరాపార్కు వద్ద భారీ సభను నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. దాదాపు 40కిపైగా బీసీ కుల సంఘాలకు చెందిన నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవితతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బీసీల సమస్యలు, హామీల అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చలు జరిపారు. అనంతరం ఎమ్మెల్సీ కవిత విలేకరులతో మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

గ్రామ పంచాయతీ కార్మికుల టోకెన్ సమ్మె

ప్రభుత్వమే నేరుగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ / మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని వినతి



నవతెలంగాణ- విలేకరులు

పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, వేతనాలు పెంచి ప్రభుత్వమే కార్మికులకు చెల్లించాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్మికులు శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా టోకెన్ సమ్మె చేపట్టారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లాలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ముందు టోకెన్ సమ్మె చేపట్టారు. గ్రామ పంచాయితీ సిబ్బందిని పర్మినెంట్ చేసి వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ డిమాండ్ చేశారు. ముందుగా మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేనియెడల జనవరి 4వ తేదీ తర్వాత ఎప్పుడైనా నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం ఎదుట టోకెన్ సమ్మె నిర్వహించారు. కందుకూరు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం నుంచి ప్రధాన చౌరస్తా వరకు పంచాయతీ కార్మికులు సీఐటీయూ ఆధర్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించాలని జీపీ కార్మికులు చేస్తున్న టోకెన్ సమ్మెకు సీఐటీయూ ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండల కన్వీనర్ కూటికల ఆనందరావు మద్దతు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో చేపట్టిన టోకెన్ సమ్మె చేపట్టారు. ఎన్నికల సమయంలో గ్రామ పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వేర్చాలన్నారు. రెబ్బెన మండల కేంద్రంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు ధర్నా చేపట్టారు.

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మున్సిపల్ టౌన్ హాల్ నుంచి భారీ ర్యాలీగా వెళ్లి తెలంగాణ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. వనపర్తి జిల్లా కేంద్రంలో మర్రికుంట పాలకేంద్రం నుంచి పాత కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ గ్రామ పంచాయతీ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో కార్మికులు టోకెన్ సమ్మె నిర్వహించారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల కేంద్రంలో విధులను బహిష్కరించి నిర్వహించిన సమ్మెలో గ్రామ పంచాయతీ కార్మిక జిల్లా కార్యదర్శి ఆసిఫ్ పాల్గొని ప్రసంగించారు. సిద్దిపేట జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట సమ్మెలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాల స్వామి, గజ్వేల్‌లో సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య పాల్గొని ప్రసంగించారు.

ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం, కారేపల్లి, బోనకల్ మండల పరిషత్ కార్యాలయాల ఎదుట జీపీ కార్మికులు టోకెన్ సమ్మె చేపట్టారు. శుక్రవారం సెలవ్ కావడంతో కొద్దిసేపు ఆందోళన చేపట్టి వెళ్లిపోయారు. భద్రాచలం మండలం పంచాయతీ కార్యాలయం ఎదుట సమ్మె శిబిరాన్ని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ ప్రారంభించి మాట్లాడారు. మణుగూరు, బూర్గంపాడు, అశ్వారావుపేట, పినపాక, ములకలపల్లి, దుమ్ముగూడెం, దమ్మపేట మండలాల్లో టోకెన్ సమ్మెకు సీఐటీయూ, జేఏసీ, సీపీఐ(ఎం) నాయకులు మద్దతు తెలిపి సమ్మెలో పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలందరికీ రూ.12 వేలు ఇవ్వాలి

లబ్దిదారులను గ్రామసభ ద్వారా ఎంపికచేయాలి : మంత్రి సీతక్కకు వ్యవసాయ కార్మిక, సామాజిక సంఘాల నేతల వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉపాధి హామీకి సంబంధం లేకుండా వ్యవసాయ కూలీలందరికీ రూ.12 వేలు ఇవ్వాలనీ, లబ్దిదారులను గ్రామ సభల ద్వారా ఎంపిక చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.నాగయ్య, ఆర్.వెంకట్రాములు, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ రైతు స్వరాజ్య వేదిక నాయకులు వి.కిరణ్, కొండల్, హర్ష డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ(సీతక్క)కు వినతిపత్రాన్ని అందజేశారు. ఉపాధిహామీ పనులు 100 రోజులు చేయాలి..ఆధార్‌కార్డు, పట్టాపాసుబుక్కుల ఆధారంగా ప్రభుత్వం ముందుకెళ్తుందనే ప్రచారంపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. ఉపాధి హామీ పనులతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ రూ.12 వేలు ఇవ్వాలని కోరారు.

రాష్ట్రంలో భూమి లేని పేదలు 40 లక్షల మందిదాకా ఉన్నారనీ, వారికి రూ.1200 కోట్లు సరిపోవని చెప్పారు. మొత్తం లబ్దిదారులకు రూ.4800 కోట్లు కేటాయించాలని మంత్రికి విన్నవించారు. వ్యవసాయ కార్మికులపై సర్వే చేసి వారి పేర్లతో కూడిన రిజిస్టర్‌ను గ్రామపంచాయతీల్లో ఉంచాలని సూచించారు. గ్రామీణ పేదల లబ్ది చేకూర్చడం కోసం తీసుకొస్తున్న ఈ పథకం విధివిధానాల రూపకల్పనలో వారి హక్కుల కోసం పనిచేస్తున్న సంఘాలు, సంస్థల ప్రతినిధుల సలహాలు, సూచనలు తీసుకోవాలని విన్నవించారు. ఎకరం, అరెకరం ఉన్న రైతులను కూడా వ్యవసాయ కూలీలుగా పరిగణించి వారికి కూడా లబ్దిచేకూర్చాలని విజ్ఞప్తి చేశారు.

సంపాదకీయం

డైవర్షన్ పాలిటిక్స్



సాధారణంగా రాజకీయాలు ప్రభుత్వ పరిపాలనను శాసిస్తాయి. ప్రజాప్రభుత్వాలు విధానాలకు లోబడి పనిచేయాలి. ప్రతిపక్షం నిరంతరం సర్కారుపై నిఘా పెట్టడం, ఆందోళనలు, ఉద్యమాలు చేయడం సహజం. అధికారం కోసం అలవికాని హామీలిచ్చి పబ్బంగడుపుకునే ప్రభుత్వాలు ఎదురుదాడికి దిగడం, అవసరమైన సామ, దాన పద్ధతులు వదిలేసి దండనకు తెగబడటం మనం చూస్తూనే ఉన్నాం. ప్రజా సమస్యలను పరిష్కరించలేని నిస్సహాయత, అశక్తత ఉన్నప్పుడు ప్రభుత్వాలు, ప్రభుత్వాధినేతలు ప్రతిపక్షంపైనా, విధానాలను ప్రశ్నించిన రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యక్తులు, సంస్థలు, పార్టీలపై అభాండాలు వేయడం, అసత్య ఆరోపణలు చేయడం నేడు దేశ రాజకీయాల్లో పరిపాటిగా మారింది.

> ప్రధానంగా చట్టసభల్లో విధానాలపై సద్విమర్శలు చేసే బదులు వ్యక్తిగత దూషణలకు దిగడం సామాన్యుల సమస్యలపై చర్చలు అర్థాంతరంగా ముగుస్తున్నాయి. పథకాలు అమలుచేయలేక హైడ్రాను ముందుతెచ్చారనీ, అల్లు అర్జున్‌పై తప్పుడు కేసు పెట్టి రేవంత్ సర్కారు డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నదని బీజేపీ చెప్పడం దొంగే దొంగా దొంగా అనే చందంగా ఉంది.

హుందాతనం కొరవడుతుందని చెప్పడానికి ఈ పరిస్థితులే నిదర్శనం.

కేంద్రంలోని మోడీ సర్కారు ఇందులో అందెవేసిన చేయి. ప్రభుత్వ పాలనపరంగా జనం సమస్యలు పరిష్కరించ లేనప్పుడు రాజకీయ అలజడిని రేపడం నేడు బీజేపీ సర్కారు చేస్తున్న కుట్ర విద్య. దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగినప్పుడు దేశవ్యాప్తంగా మోడీ సర్కారుపై రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ఆందోళనలు ఉప్పెనలా లేచాయి. కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్ ప్రభుత్వాలు సైతం ప్రశ్నించాయి. జీఎస్టీ పేర అడ్డగోలుగా రాష్ట్రాల నిధులు, అధికారాలను చెరబట్టిన మోడీ ప్రభుత్వం సమాఖ్య తత్వాన్ని బొందపెట్టి మరీ రాష్ట్రాలను ఆర్థికంగా బలహీనపరిచే చర్యలకు తెగించింది. ఢిల్లీ ప్రభుత్వాన్ని సైతం ఇరుకునపెట్టేందుకు పూనుకుంది. ప్రజాసమస్యలపై ప్రశ్నిస్తే ఎదురుదాడి చేయడమేగాక అబద్ధాలు, అసత్యాలను ప్రచారం చేయడంలో బీజేపీ వాట్సాప్ యూనివర్సిటీ నాలుగడుగులు ముందే ఉంటుంది. తద్వారా సమస్యలను పక్కదారి పట్టించే వ్యూహం అమలుచేస్తున్నది. తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ. 86 వేల కోట్ల నిధులు ఇవ్వకుండానే ఇచ్చినట్టుగా సాక్షాత్తు రాజ్యాంగ వ్యవస్థ పార్లమెంటులో కేంద్ర మంత్రి వచ్చి అబద్ధం చెప్పడం, దాన్ని బీజేపీ వాట్సాప్ యూనివర్సిటీ ప్రచారంలో పెట్టడం వాస్తవాలను మరుగున తొక్కడమే. నిజాలు ప్రజల దృష్టికి పోకుండా చేయడమే. తాజాగా ముగిసిన పార్లమెంటు సమావేశాల్లోనూ ప్రజాసమస్యలపై చర్చకు బీజేపీ మోకాలడ్డింది. జమిలి ఎన్నికల బిల్లును పాస్ చేసుకునేందుకు హోంమంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పై పరుషమైన వ్యాఖ్యలు చేసి జనాన్ని రెచ్చగొట్టారు. దీంతో అలజడి చెలరేగింది. ఇదే అదనుగా జమిలీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చుకున్నారు. అదానీ అవినీతిపై దేశంలో అనేక విమర్శలు వచ్చి ఆందోళనలు జరిగినా, అమెరికాలో కేసు నమోదైనా ప్రధాని మోడీ నోరువిప్పకపోవడం విడ్డూరం.

స్వార్థ ప్రయోజనాలు రాజకీయాలతో జనంగోడు ఎజెండా కావడం లేదు. కాదు, కాదు కానియ్యడం లేదు. పరిపాలనలో బీజేపీ భావోద్వేగాలను పరకాయ ప్రవేశం చేయించడాన్ని ఎంతమాత్రం సహించకూడనిది. కేంద్రం ఈడీ, సీబీఐ, ఐటీ తదితర రాజ్యాంగ సమస్థలను తమ మతోన్మాద రాజకీయాల కోసం పావుగా వాడుకుంటున్నది. అధికారమే పరమావధిగా అడుగులేస్తున్నది. ఏదైనా ప్రజా సమస్య ముందుకొచ్చినప్పుడు అయోధ్య, కాశీ అంటూ సెంటిమెంటు తెర లేపుతున్నారు. రాజకీయాలతోపాటు ప్రభుత్వాల పరిపాలనలోనూ ఆరోగ్యకరమైన వాతావరణం కొరవడుతుడుతున్నది. హుందాతనం లోపిస్తున్నది. ఈ పరిస్థితుల్లో ఇటు పాలకపక్షం, అటు ప్రతిపక్షం నుంచి యువతకు, భవిష్యత్ తరాలకు ఎలాంటి విలువలు, ఆదర్శాలను వారసత్వంగా అందిస్తారనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.

ప్రధానంగా చట్టసభల్లో విధానాలపై సద్విమర్శలు చేసే బదులు వ్యక్తిగత దూషణలకు దిగడం సామాన్యుల సమస్యలపై చర్చలు అర్థాంతరంగా ముగుస్తున్నాయి. పథకాలు అమలుచేయలేక హైడ్రాను ముందుతెచ్చారనీ, అల్లు అర్జున్‌పై తప్పుడు కేసు పెట్టి రేవంత్ సర్కారు డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నదని బీజేపీ చెప్పడం దొంగే దొంగా దొంగా అనే చందంగా ఉంది. సందట్లో సడేమియా పాత్రకే పరిమితమవుతున్న రాష్ట్ర బీజేపీ, కేంద్రం నుంచి నిధులు తెచ్చి రాష్ట్రాభివృద్ధికి సహకరించే ఆలోచనకు స్వస్తిచెప్పింది. స్థానిక పాలకపక్షంపై విమర్శలు చేస్తూ రాజకీయ పబ్బానికి అలవాటుపడింది. ఇక్కడి కేంద్ర మంత్రులు చేష్టలుడిగిపోయారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా ప్రజలు ఆ పార్టీ బలాన్ని తగ్గించారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే తగిన గుణపాఠం నేర్చుకోవాల్సి వస్తుంది. పారా హుషార్.

పోరుబాటగా ఆశా వర్కర్ల బస్సు జాతా


పి. జయలక్ష్మి
9490098605

ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో ఆశా వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18,000/-లు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని, పీఎఫ్., ఈఎస్ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్ల రాష్ట్ర బస్సు జాతా ఈ నెల 15న నిర్మల్ జిల్లాలో ప్రారంభమైంది. రాష్ట్రమంతా అన్ని జిల్లాలు పర్యటించి డిసెంబర్ 31న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద భారీ బహిరంగ సభతో ముగుస్తుంది.

ఆశాల సమస్యల పరిష్కారం కోసం ఏడుగురు బృందం సభ్యులు ఇల్లు వాకిలి సొంత ఊరు కుటుంబాన్ని చివరికి చేస్తున్న ఆశా పనిని కూడా పక్కన పెట్టారు. మహిళలు అనేక ఆటంకాలను అధిగమించి 17 రోజులు రాష్ట్రమంతా పర్యటించడానికి సిద్ధం కావటం చిన్న అంశమేమీ కాదు. అందుకే ఆశాలు కూడా ఈ బస్ జాతాకు అడుగడుగునా నీరాజనాలు పడుతున్నారు. ఫిక్స్‌డ్ వేతనంలేక అనేక సంవత్సరాల నుండి వెట్టిచాకిరీలో మునిగిపోయిన ఆశాలు బస్సు జాతాను చూసి మా బతుకుల్లో వెలుగులు నింపడం కోసం బయలుదేరిన పోరు యాత్రగా బస్సు జాతాను అక్కున చేర్చుకుంటున్నారు. మా జిల్లాకు ఫలానా తేదీన బస్సు జాతా వస్తుందనీ, మేము సమయానికి వెళ్ళి విజయవంతం చేయాలని కుటుంబ సభ్యులకు, చుట్టాలతో పాటు గ్రామంలో సేవలందించే ప్రజలందరిలో ఆశాలు ఎంతో గర్వంగా ప్రచారం చేస్తున్నారు. కరపత్రం పంపిణీ పోస్టర్ ఆవిష్కరణ ఆశా వర్కర్ల సమస్యలపైన పాడిన పాటల ప్రచారంతో రాష్ట్రమంతా గ్రామగ్రామానా బస్సు జాతా ప్రచారాన్ని ఆశాలు మారుమోగి స్తున్నారు. ఉదయం నుండి సాయంత్రం ఆరు గంటల వరకు ఈ జాతా కోసం ఆశాలు వెయ్యి కండ్లతో ఎదురుచూస్తున్నారు. కొన్ని జిల్లాల్లో అయితే ఒకరోజు ముందే జిల్లా కేంద్రానికి చేరుకుంటున్నారు. అధికారుల వేధింపులు, క్రిస్టమస్ లాంటి పండుగలను సైతం అధిగమించి భారీ సంఖ్యలో ఆశాలు పాల్గొంటున్నారు. ఆశా యూనిఫామ్ కట్టుకొని, చేతిలో సీఐటీయూ జెండా పట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం మా డిమాండ్లు పరిష్కరించాలని జిల్లా కేంద్రాల్లో భారీ ర్యాలీలు నిర్వహిస్తున్నారు. బోనాలు, బతుకమ్మలు, డప్పులు, కోలాటం ఆట పాటలతో బస్సు జాతాకు ఆశాలు ఘనస్వాగతం పలుకుతున్నారు.

తెలంగాణ రాష్ట్రంలో ఆశాలు అడుగుతున్నది గొంతెమ్మ కోర్కెలు కాదు. పాత డిమాండ్లే. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఫిక్స్‌డ్ వేతనం రూ.18,000/-ల కోసం, ఇతర డిమాండ్ల పరిష్కారం కోసం ఆశాలు 15 రోజులు నిరవధిక సమ్మె చేశారు. హైదరాబాద్ కోఠి కమిషనర్ ఆఫీసు వద్ద సమ్మె ముగింపు సందర్భంగా ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు చర్చలు జరిపారు. ఆశాల సమస్యల పరిష్కారం కోసం ఒక కమిటీని వేస్తున్నామని, ఈ కమిటీ నివేదిక తయారు చేసి ఎన్నికల్లో అధికారంలోకి వచ్చే ప్రభుత్వానికి అందిస్తుందని ఆశాల సమస్యలు ప్రభుత్వం పరిష్కారం చేసే విధంగా కమిటీ కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. ఇదే సమ్మె సందర్భంగా ఇప్పుడు అధికారంలో ఉన్న ఎంఎల్ఏలు, మంత్రులు సీతక్క, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో సహా కాంగ్రెస్ నాయకులందరూ ఆశాల టెంట్ల వద్దకు వచ్చి మద్దతు తెలిపారు. మా కాంగ్రెస్ పార్టీకి ఓట్లేసి గెలిపించండి మాకు అధికారం ఇస్తే ఆశాల సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో కూడా ఆశాలకు వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని



పొందుపర్చారు. ఎన్నికల అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ఆశాలకిచ్చిన హామీలు, గత సమ్మె హామీలు అమలు చేయాలని ఆశాలు రాష్ట్ర వ్యాప్తంగా అనేక పోరాటాలు నిర్వహించారు. ఈ పోరాటాల్లో ఉన్నతాధికారులు ఫిక్స్‌డ్ వేతనంతో పాటు రూ.50 లక్షల ఇన్సూరెన్స్, 50 వేల మట్టి ఖర్చులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర హామీలు ఇచ్చారు. హామీలతో కడుపు నిండట్లేదని, హామీల అమలు కోసం వెంటనే జీఓ లు విడుదల చేయాలని ఆశాలు డిమాండ్ చేస్తున్నారు.

ఆశాలు అడుగుతున్న డిమాండ్లు చాలా న్యాయమైనవి. ఎందుకంటే ఒక కుటుంబం బతకాలంటే రూ. 26 వేల కనీస వేతనం ఉండాలి. కానీ తెలంగాణాలో ఆశాలు అడుగుతున్నది ఫిక్స్‌డ్ వేతనం రూ.18,000/-లు మాత్రమే. ఎందుకంటే వారు చేస్తున్న పనుల్లో ఎక్కువ శాతం రాష్ట్ర ప్రభుత్వం చెప్పే పనులే ఉన్నాయి. పైగా ఈ ప్రభుత్వం కూడా హామీలు ఇచ్చింది కాబట్టి. పైగా ఆశాలకు రాష్ట్రంలో పారితోషికాలు మూడు సంవత్సరాల క్రితం పెంచారు. ఈ కాలంలో అనేక రెట్లు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయి. ఆశాలు చేసే పనులను ఈ కాలంలో ప్రభుత్వం విపరీతంగా పెంచింది. పారితోషికం లేని అనేక పనులను ఆశాలతో చేయిస్తున్నారు. ఆశాలు చేస్తున్న పనులకు ఇచ్చే పారితోషికాల డబ్బులు చూస్తే నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా వుంది. ఆశాల శ్రమనంతా లెక్కలోకి తీసుకోవాలి. అందుకే పారితోషికాలను రూ.18వేలకు పెంచి ఫిక్స్‌డ్ వేతనం 18వేలు నిర్ణయించాలని ఆశాలు కోరుతున్నారు. ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయం అయితే ఆశా వర్కర్ల సమస్యలు 90శాతం పరిష్కారం అవుతాయి. ఒకప్పుడు కేసులున్నప్పుడే ఆశాలు పనిలో ఉండేవారు. మిగిలిన సమయం సొంత పనులు చేసుకొనేవారు. కానీ కొంతకాలంగా రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితులను మొత్తం మార్చింది. ఉదయం లేచిన దగ్గర నుండి రాత్రి వరకు ఆశాలు మొత్తం హెల్త్ డిపార్ట్‌మెంట్ పనిలో ఉండాలని ఆదేశాలు జారీ చేసింది. దీని ప్రకారమే రాష్ట్రంలో ఆశాలు పని చేస్తున్నారు. కానీ ప్రతి నెల 20వ తేదీన ఆశాలు చేసిన శ్రమనంతా పక్కన బెట్టి కేసులుంటేనే డబ్బులు కేసుల్లేకుంటే డబ్బుల్లేవని ప్రభుత్వం చెప్తున్నది. దీంతో ఆశాలు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురై, అనేక అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. అందుకే ఈ వెట్టి చాకిరీ విధానాన్ని రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్, హర్యానా, మహారాష్ట్రల మాదిరిగా నెల జీతం నిర్ణయించాలని ఆశాలు డిమాండ్ చేస్తున్నారు. ఫిక్స్‌డ్ వేతనం అయితే అధికారుల వేధింపులు కూడా తగ్గుతాయి. ఇంత ముఖ్యమైన అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చేయాలి.

రాష్ట్రంలో 30వేల మంది ఆశా వర్కర్లు గత 19 సంవత్సరాల నుండి పని చేస్తున్నారు. వీరంతా మహిళలు, బడుగు, బలహీన వర్గాలకు చెందినవారు. రాత్రనకా పగలనకా నిరంతరం ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీల సంఖ్య పెంచుతున్నారు. టీబీ, లెప్రసీ, బోదకాలు తదితర వ్యాధులు రాకుండా అరికడుతున్నారు. బీపీ, షుగర్‌కు మందులు పంచుతున్నారు. సీజనల్ వ్యాధులను గుర్తించి అరికడుతున్నారు. పిల్లలకు వ్యాధినిరోధక టీకాలిప్పించటం తదితర అనేక పనులు ఆశాలు చేస్తున్నారు. కరోనా మహమ్మారి కాలంలో ఆశాలు వారి ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజలకు సేవలందించారు. కరోనాను కట్టడి చేయడంలో ఆశాలు కీలకపాత్ర పోషించారని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఓ) గుర్తించింది. ఆశాలు గ్లోబల్ లీడర్స్ అని అవార్డును ఇచ్చింది. సీఐటీయూ పోరాటాల ఫలితంగా 2013లో 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సమావేశం స్కీం వర్కర్లలో భాగమైన ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్‌హెచ్‌ఎం స్కీంను ప్రయివేటీకరణ చేయకూడదని తీర్మానం చేసింది. కానీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అంశాలను పరిగణలోకి తీసుకోవటం లేదు. ఆశాల శ్రమను గుర్తించటం లేదు. పైగా ఎన్‌హెచ్‌ఎం స్కీంకు ఆశా వర్కర్లకు వ్యతిరేకంగా అనేక నిర్ణయాలు చేస్తున్నారు. ఆశాల సమస్యలు పరిష్కారం చేయడంలో ఎక్కువ బాధ్యత కేంద్ర ప్రభుత్వానికే వుంది. కానీ కేంద్ర ప్రభుత్వం అతితక్కువ కేవలం రూ.3 వేలు మాత్రమే పారితోషికాలు చెల్లిస్తున్నది. ఇతర సమస్యలను పరిష్కరించటంలేదు. పైగా ఆరోగ్య రంగాన్ని ప్రయివేటీకరణ చేస్తున్నది. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్స్‌ని తెచ్చింది. పని గంటలను 8 నుంచి 12 గంటలకు పెంచుతున్నది. యూనియన్ పెట్టుకునే హక్కును, సమ్మె చేసే హక్కును కాలరాస్తున్నది. కనీస వేతనం రోజుకు రూ.178/-లు ఉంటే చాలని దుర్మార్గంగా నిర్ణయం చేసింది. నిత్యావసర వస్తుల ధరలు ఆకాశాన్నంటుతున్న క్రమంలో ఆశా వర్కర్ల వేతనాలు పెంచే అంశాన్ని పూర్తిగా పక్కన పడేసింది. ఈ విధానాలను నిరసిస్తూ ఆశాల సమస్యలు కేంద్రం ప్రభుత్వం పరిష్కరించాలని నవంబర్ 26న ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద వేలాదిమంది ఆశాలు ధర్నా నిర్వహించారు. అయినా కేంద్ర ప్రభుత్వం నేటికీ స్పందించలేదు.

> ఇప్పుడు అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ పాలన సంవత్సరం పూర్తయినా ఇచ్చిన హామీలను వెనక్కి తిరిగి చూడటం లేదు. పైగా పోరాటం చేసిన ప్రతీసారి చూస్తాము, చేస్తామని కాలయాపన చేసి తప్పించుకుంటున్నది. ఈ విధానాలతో విసిగి వేసారిన ఆశాలు పోరాటమే మార్గమని డిసెంబర్ 15న నిర్మల్ జిల్లాలో రాష్ట్ర బస్సు జాతాను ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలు పర్యటించి భవిష్యత్ పోరాటాలకు ఆశాలను సన్నద్ధం చేస్తున్నారు. డిసెంబర్ 31న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద వేలాదిమంది ఆశాలతో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. ఈ లోపు కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి ఆశాల సమస్యలు పరిష్కరించాలి. ఆలస్యం చేస్తే బస్సు జాతా అనంతరం పనులన్నీ బంద్ చేసి నిరవధిక సమ్మెకు దిగుతామని ఆశాలు రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేస్తున్నారు.

> కరోనా మహమ్మారి కాలంలో ఆశాలు వారి ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజలకు సేవలందించారు. కరోనాను కట్టడి చేయడంలో ఆశాలు కీలకపాత్ర పోషించారని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఓ) గుర్తించింది. ఆశాలు గ్లోబల్ లీడర్స్ అని అవార్డును ఇచ్చింది. సిఐటియు పోరాటాల ఫలితంగా 2013లో 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సమావేశం స్కీం వర్కర్లలో భాగమైన ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్‌హెచ్‌ఎం స్కీంను ప్రయివేటీకరణ చేయకూడదని తీర్మానం చేసింది. కానీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అంశాలను పరిగణలోకి తీసుకోవటం లేదు. ఆశాల శ్రమను గుర్తించటం లేదు. పైగా ఎన్‌హెచ్‌ఎం స్కీంకు ఆశా వర్కర్లకు వ్యతిరేకంగా అనేక నిర్ణయాలు చేస్తున్నారు. ఆశాల సమస్యలు పరిష్కారం చేయడంలో ఎక్కువ బాధ్యత కేంద్ర ప్రభుత్వానికే వుంది. కానీ కేంద్ర ప్రభుత్వం అతితక్కువ కేవలం రూ.3 వేలు మాత్రమే పారితోషికాలు చెల్లిస్తున్నది. ఇతర సమస్యలను పరిష్కరించటంలేదు.

తెలంగాణ రాష్ట్రంలో 10 సం॥రాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఆశాల సమస్యలు పరిష్కారం చేయలేదు. ఆశాలు బలంగా కోరుకుంటున్న ఫిక్స్‌డ్ వేతనాన్ని నిర్ణయం చేయకుండా ఆశాలను మోసం చేసింది. ఇప్పుడు అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ పాలన సంవత్సరం పూర్తయినా ఇచ్చిన హామీలను వెనక్కి తిరిగి చూడటం లేదు. పైగా పోరాటం చేసిన ప్రతీసారి చూస్తాము, చేస్తామని కాలయాపన చేసి తప్పించుకుంటున్నది. ఈ విధానాలతో విసిగి వేసారిన ఆశాలు పోరాటమే మార్గమని డిసెంబర్ 15న నిర్మల్ జిల్లాలో రాష్ట్ర బస్సు జాతాను ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలు పర్యటించి భవిష్యత్ పోరాటాలకు ఆశాలను సన్నద్ధం చేస్తున్నారు. డిసెంబర్ 31న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద వేలాదిమంది ఆశాలతో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. ఈ లోపు కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి ఆశాల సమస్యలు పరిష్కరించాలి. ఆలస్యం చేస్తే బస్సు జాతా అనంతరం పనులన్నీ బంద్ చేసి నిరవధిక సమ్మెకు దిగుతామని ఆశాలు రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేస్తున్నారు.

(రచయిత తెలంగాణా ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు)

కల్లో, సారానో సాక పోసినట్టు
రక్తం సాకబోత
సొంత నేలకోసం
మనుషులు ఆరబోత

కూలిన మొండి గోడల మధ్య
తెగిపడిన మాంసపు ముద్దల నడుమ
రక్తబంధాలన్ని చెల్లా చెదురుగా
పడి ఉన్నాయి
అమ్మా, నాన్నా , అక్కా, తమ్ముడూ
తెల్లటి మంచు దుప్పటి కప్పుకున్న
ఏ మాంసం గడ్డ ఎవరిదో

నేను...
నేను... ఇప్పుడు కండ్లకు
దుఃఖపు పొరలు కమ్ముకున్న
విషాదాన్ని
పాలస్తీనా బిడ్డను...

యుద్ధం కంపోజ్ చేసిన విషాద గీతాన్ని...



నా నేలకు నేను పరాయిని
నా నేలకు నేనే శరణార్థిని
నా నేలకు నేనే ప్రవాసిని
అయినప్పుడు
నా నేల మీద నేను శవాన్ని.

ముక్కలు ముక్కలైన పసినవ్వులు
ముక్కలు చెక్కలైన బుజ్జిబుజ్జి మాటలు
విరిగిపడిన బుడిబుడి నడకల
ప్రతిరూపాన్ని ...
యుద్ధం కంపోజ్ చేసిన
విషాద గీతాన్ని... నేను

అయినా,
ఆత్మస్థైర్యంతో పోరాడుతూనే ఉంటాను
దుఃఖ గీతాన్ని ఆలపిస్తున్న
నిలువెల్ల గాయాలను మానిపేందుకు
శిథిల భవనాలు కింద
పోరాట అక్షరాలు నేర్చుకుంటున్న
పాలస్తీనా బిడ్డను నేను

- అనంతోజు మోహన్‌కృష్ణ

ఎవరు విభజించారు? జరిగిన విధ్వంసానికి కారకులెవరు?


జి. తిరుపతయ్య
9951300016

"బాటేంగెతో కటేంగే" "ఏక్ హైతో సేఫ్ హై" ఈ రెండు నినాదాలు మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల ముందు నుంచి చాలా పాపులర్‌గా వినిపించాయి. వీటి అర్థం ఏమంటే "విభజిస్తే విధ్వంసం" మరియు "ఒకటిగా ఉంటే సురక్షితం". ఈ నినాదాలను భారతీయ జనతా పార్టీ అగ్రనాయకత్వం పెద్ద ఎత్తున రాజకీయ ఉపన్యాసాలుగా మార్చుకున్నది. వారి సోషల్ మీడియా మొత్తంలో కూడా ఇదే ప్రచారం హోరెత్తింది.. అసలీ నినాదాలు ఎందుకు వచ్చాయి? కాంగ్రెస్ పార్టీ, ముఖ్యంగా రాహుల్ గాంధీ, అనేక సందర్భాల్లో ప్రస్తావిస్తూ ఈ దేశంలో 2021 నుంచి జరగాల్సిన జనాభా లెక్కలు జరగడం లేదని అందులో ముఖ్యంగా దాదాపు తొంబై ఏళ్ల కింద జరిగిన బీసీ కులగణన జరపాలని పట్టుబట్టారు. దీనిపై సర్వత్రా ఆసక్తి కూడా నెలకొంది. పవన్ కె వర్మ వంటి పార్లమెంటేరియన్లు, అనేకమంది ప్రముఖులు కూడా ఈ కుల గణన జరపడంద్వారా సంక్షేమ కార్యక్రమాలకు సరైన దిశానిర్దేశాన్ని నిర్ణయించుకోవచ్చని కూడా సూచనలు చేశారు. దీంతో కులగణన జరపడం తప్పదేమో అన్న పరిస్థితి దాపురించడంతో, పైన తెలిపిన పెద్దలు ఈ నినాదాలను ఎత్తుకున్నారు. తద్వారా "కులగణన అనేది విభజనతో సమానం అది విధ్వంసానికి దారితీస్తోంది" అంటూ ఒకటిగా ఉంటేనే ఐక్యంగా ఉంటామన్న ముక్తాయింపు పలుకుతూ ప్రచారాన్ని హోరెత్తించారు. ఎవరిని వారుగా గుర్తించడమే విభజన వాదమైతే ఫలానా వాళ్లు మా వాళ్లే కాదు అనే ద్వేషభావన మరి దేని కిందికి వస్తుంది? మతం పేరు మీద దేశాన్ని పూర్తిగా రెండుగా చీల్చిన వాళ్ళే విభజన వాదాన్ని గురించి మాట్లాడటం విడ్డూరం. కేవలం మత విద్వేషంతోటే అధికారాన్ని చేపట్టిన సమూహం ఇప్పుడు కులగణన ప్రక్రియను ఒక విభజన వాదంగా చూపి ఒకటిగా ఉంటేనే ఐక్యంగా ఉంటామనే నినాదాన్ని ఇవ్వడం కేవలం రాజకీయ ప్రయోజనానికి ఏర్పడే చిల్లును పూడ్చుకోవడానికి జరిపే ప్రయత్నమే! సమాజంలో కులాలుగా ఏర్పడటానికి ఇప్పుడున్న వారెవ్వరూ కారణం కాదు, అది అనాది వాస్తవం. కానీ వాటి వ ర్య వ సా నా ల న ం కొనసాగిస్తున్నది నేటి తరమే కదా! కులం ద్వారా సంక్రమిస్తున్న ఆస్తిపాస్తులనూ, అవకాశాలనూ అనుభవించడం ఒక ఎత్తయితే అనాది కాలంలో జరిగిన అన్యాయాన్ని పూడ్చే బాధ్యత మరచిపోతే ఎలా?



కుల గణన వద్దంటున్నారు గానీ కుల నిర్మూలన గురించి మాత్రం పల్లెత్తు మాట మాట్లాడటం లేదు. కులం సృష్టించిన విధ్వంసాన్ని గానీ, అది ఇంకా ఇంకా చేస్తున్న అరాచకాన్ని గానీ ఈ సాంప్రదాయ వాదులెవ్వరూ ప్రస్తావించరు. కులాన్ని త్యజించండి అని మాత్రం చెప్పరు! మత ఐక్యత కోరుకునే వారు కనీసం మాట వరసకైనా "మనమంతా హిందువులం మనకెందుకీ కులాలు" అని ఒక్కరైనా ఒక్కమాట చెప్పరు! ఇదిగో నేను కులాన్ని త్యజించానని అధికార పార్టీకి చెందిన ఒక్క నాయకుడైనా చెప్పరే! మాల మాదిగల ఇళ్ళన్నీ ఊరవతల, మురికి నీరు పారే పల్లపు వైపు విసిరేయబడ్డ వాస్తవాన్ని తెలిసి కూడా సవరించడానికి ఎప్పుడైనా ప్రయత్నించారా? పట్టణ ప్రాంతాల్లో కులం పేరు కారణంగా అద్దెకు ఇళ్ళు దొరకని ఉదంతాలెన్నో! చాకలి, మంగలి, కమ్మరి, కుమ్మరి మేదరి వంటి అనేక బీసీ కులాలదీ ఇదే పరిస్థితి. నాతో జరిగిన ఒక సంభాషణలో ఈ కుల వ్యవస్థను సమర్థించే కొందరు చెప్పేదేమంటే "సామాజిక సమస్యలకు అది సమాధానమిస్తుంది, తటస్థ స్థితి ఏర్పడినప్పుడు అగ్రకులం వ్యక్తి చెప్పింది పాటించడం ద్వారా సమస్యలు సమసిపోతాయి" అని. అంతటితో ఆగకుండా "అంతెందుకు ఈ కుల వ్యవస్థ ఒక ఆఫీసులోని ఉద్యోగుల హైరార్కీ (పదవుల/హోదాల క్రమం) అనుకోండి, క్రింది వారు పై వారి మాట విన్నట్టే) అంటూ మరో సమర్ధన కూడా చేస్తారు. దానికి సమాధానంగా "ఆఫీసుల్లో పదోన్నతులుంటాయి, అటెండరు కూడా ఆఫీసరౌతాడు, అలాంటి వెసులుబాటు ఈ నిచ్చెన మెట్ల కులవ్యవస్థలో ఉన్నదా?" అంటూ ప్రశ్నిస్తే.. నోట్లో వెలక్కాయ పడ్డట్లు తికమక పడి పుట్టుకతో వచ్చిన కులాన్ని ఎవరూ కాదనగూడదు అని మరో సెంటిమెంటు విసురుతారు. "కులముగాదు తన గుణమతనిని ప్రముఖుణ్జీ జేయు" అన్న కవుల మాటలు ఏ మాత్రం చెవినెక్కించుకోకుండా ఇంకా అవే ఆలోచనలతో సాగుతోందీ సమాజం! తృణమూల్ కాంగ్రెస్ పార్లమె ంటు సభ్యురాలు మహువా మొయిత్రా గారన్నట్టు ఇప్పుడు మతం పేర ఏకం చేసిన వాళ్ళే ఆ పని పూర్తైన మరుక్షణం కులం పేర ప్రజలను వేరు చేసే కుంపటి సిద్ధంగా ఉంచారు. మొన్నామధ్య ఉత్తరప్రదేశ్‌లోని ఒక న్యాయమూర్తి "ఈ దేశంలో మెజారిటీ ప్రజల అభిప్రాయాల ప్రకారం పాలన జరిగితే తప్పేంటి (హిందువులు మెజారిటీ గాబట్టి వారికి అనూకూలంగా ఉండాలన్నది నీగూఢార్థం)" అనగానే అందరూ చంకలు గుద్దుకున్నారు. అలా మెజారిటీ ప్రకారం పరిపాలన సబబే అనుకుంటే ఒక గ్రామంలో ఫలానా కులం ఎక్కువ సంఖ్యలో ఉందనుకోండి.. అప్పుడు ఆ గ్రామానికి సదరు కులం పేర్లు పెడదామా? అక్కడి పరిపాలనంతా ఆ కులం వాళ్ళతోనే చేయిద్దామా? మాజీ డీజీపీ శ్రీ అరవిందరావ్ గారు నవంబరు 23న ఆంధ్రజ్యోతిలో ఓ వ్యాసం రాస్తూ "ఇప్పుడిప్పుడే కులం ఆనవాళ్ళు చెరిగి పోతున్నాయి, మళ్ళీ కుల గణన చేసి విభజనకు అవకాశమివ్వద్దు" అని అభిప్రాయపడ్డారు. పోలీసు కేసుల్లో కుల ప్రస్తావన లేకుండానే ఎఫ్ఐఆర్‌లు రిజిష్టర్ అవుతున్నాయా? పెళ్ళిళ్ళు కుల ప్రస్తావన లేకుండానే జరుగుతున్నాయా? ఈ కులం కుంపటిలో కాలిపోతున్న ప్రేమ పెళ్ళిళ్ళు వీరికి కనపడటం లేదా ఏంటి?

కనీసం గుర్తించండి ప్లీజ్

"అగాధం ఎంత లోతుందో తెలియాలంటే కనీసం తొంగి చూసే ధైర్యమన్నా చేయాలి" అని కవి అలిసెట్టి ప్రభాకర్ అంటారు. "ఆ అగాధంలోకి మేము వోర చూపైనా వేయము కానీ ఆ అగాధంలోంచే మీరు మాకు అండగా నిలవడానికి, మనమంత ఒక్కటే అని నినదించాలి" అన్నది నేటి పాలకుల నినాదం. 2016లో డీమానిటైజేషన్, 2017లో జీఎస్టీ, 2019లో కరోనా - ఈ మూడింటి ప్రభావాల వల్ల గత్యంతరం లేక వివక్షకు ఆలవాల మైన అదే కుల వృత్తుల్లోకి చేరుకుంటున్న వారి సంఖ్య పెరిగిందట. ప్రముఖ యూట్యూబర్ తులసి చందు కులప్రస్తావన గురించి చెబుతూ గూగుల్‌లో ఈ దేశంలోని కులం పేరు సర్చ్ చేస్తే అనేక కులాల స్థితిగతులను తెలిపే ఇమేజెస్ కనిపిస్తాయి. వాటిని బట్టి ఏ కులము ఏ మేర అభివృద్ధి చెంది ఉన్నదో, దళితులు ఆదివాసీలు ముఖ్యంగా ఎస్సీల స్థితిగతులు అత్యంత దయనీయంగా గూగుల్‌లో దర్శనమిస్తాయి. గూగుల్‌ను అడగకపోయినా మనకు కులాల యొక్క స్థాయి అర్థం కావాలంటే పెళ్ళిళ్ల పేరంటాలకు హాజరయ్యే మనుషులు ధరించే దుస్తులను బట్టి కూడా వారు ఏ కులానికి చెందిన వారో చాలా స్పష్టంగా తెలిసిపోతోంది. ఇక ప్రభుత్వ పాఠశాలలు కుల ముఖచిత్రానికి అద్దం పడతాయి. ఒక్క సారి దర్శించండి.

మీ పదవులకేమీ ఢోకా వుండదు

బీసీ కుల గణన వొద్దనడానికి ప్రధాన కారణం కులాల వారిగా పదవుల పంపకాలు చేస్తే కష్టమౌతుందని! ఎందుకంటే పది శాతం కూడా లేని కులాలు తొంబై శాతం రాజకీయ మరియు పరిపాలనా పదవుల్లో వున్నారు. అందుకే కాబోలు ఓ ముసలి బీసీ నాయకుడికి పక్క రాష్ట్ర కోటాలోంచి రాజ్యసభ సభ్యత్వాన్ని కిరీటంగా ఇచ్చి ఢిల్లీ పెద్దలు నోరు మూయించినట్టున్నారు! కింది కులాల్లో పోరాటాలు ఊపందుకుంటే ఇలాంటి తాయిలాలతో సరిపెడతారు. కులం ఇంత విధ్వంసాన్ని సృష్టిస్తున్నదని తెలిసినా మత ఏకీకరణ కోసం జరుగుతున్న దుష్ప్రచారాలను భుజానేసుకుంటున్నది ఈ బీసీలే! మనుషులందరికీ మైలను రుద్దే మతపరమైన ఏకీకరణకు మాములు జనమంతా బలిగావడం గొర్రె కసాయివాణ్ణి నమ్మినట్లే! భారతదేశంలోని మత విద్వేషాలు రాజకీయ ప్రయోజనాలకోసం రెచ్చగొట్టబడుతున్నవి మాత్రమే. విద్వేషాలే లేవని భావించమనే ఈ కులం ప్రభావమే, అనాది అసమానతలకూ, నేటి వివక్షకూ ప్రత్యక్ష సాక్ష్యం. పదవుల వేటలో కింది కులాల వల్ల పెద్ద ప్రమాదం లేదు ఎందుకంటే వారికి ప్రహరీ నిర్మాణానికి రాళ్ళెత్తడం తప్ప పదవులను ఇడిసి పట్టుకునే చాణక్యత లేదు. కానీ కులగణన చేయడం ద్వారా సామాజిక ముఖచిత్రపు వాస్తవ కోణం తెలుస్తుంది. సరిదిద్దాలన్న ఆలోచన ఎవరికైనా, ఏనాడైనా ఏర్పడితే అది ఉపయోగపడుతుంది.

> భారతదేశంలోని మత విద్వేషాలు రాజకీయ ప్రయోజనాలకోసం రెచ్చగొట్టబడుతున్నవి మాత్రమే. విద్వేషాలే లేవని భావించమనే ఈ కులం ప్రభావమే, అనాది అసమానతలకూ, నేటి వివక్షకూ ప్రత్యక్ష సాక్ష్యం. పదవుల వేటలో కింది కులాల వల్ల పెద్ద ప్రమాదం లేదు ఎందుకంటే వారికి ప్రహరీ నిర్మాణానికి రాళ్ళెత్తడం తప్ప పదవులను ఇడిసి పట్టుకునే చాణక్యత లేదు. కానీ కులగణన చేయడం ద్వారా సామాజిక ముఖచిత్రపు వాస్తవ కోణం తెలుస్తుంది. సరిదిద్దాలన్న ఆలోచన ఎవరికైనా, ఏనాడైనా ఏర్పడితే అది ఉపయోగపడుతుంది.

ఆశాల శ్రమకు గుర్తింపేది?

- ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాల్సిందే..: ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి
- స్కీమ్ వర్కర్ల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యం : ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్
- ములుగు, భూపాలపల్లి, సూర్యాపేట జిల్లాల్లో బస్సుజాతాకు ఘన స్వాగతం



పారితోషికం ఇవ్వకుండా పనులు

నవతెలంగాణ-సూర్యాపేట/ ములుగు/భూపాలపల్లి టౌన్

ఆశాలతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్న పాలకులు వారి శ్రమను గుర్తించడం లేదని, పారితోషికాలు లేకుండా అనేక పనులు చేయించుకుంటున్నారని ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి అన్నారు. రేయింబవళ్లు కష్టపడి పని చేస్తున్న ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశాల బస్సుజాతా శుక్రవారం ములుగు, భూపాలపల్లి, సూర్యాపేట జిల్లాల్లో సాగింది. ఈ సందర్భంగా బస్సుజాతాకు ములుగు జిల్లా కేంద్రంలోని బోనాలు, బతుకమ్మలు, కోలాటం నృత్యాలతో ర్యాలీగా ఘన స్వాగతం పలికారు. కలెక్టరేట్ సెంటర్‌లో ఆర్.నీలాదేవి అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోనూ బోనాలు ఎత్తుకుని, కోలాటం ఆడుతూ ర్యాలీగా ఆశాలు అంబేద్కర్ సెంటర్‌కు చేరుకున్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి బంధు సాయిలు అధ్యక్షతన సభ నిర్వహించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని అంజనపురి కాలనీకి చేరుకున్న ఆశా వర్కర్స్ బస్సుజాతాకు శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ చెరుకు ఏకలక్ష్మి, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాంబాబు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయా సభల్లో జయలక్ష్మి మాట్లాడుతూ.. మ్యానిఫెస్టోలో రూ.18 వేల వేతనం ఇస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ సంవత్సరం గడిచినా ఆశాల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. ఆశాలకు వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చి మాట తప్పిందన్నారు. నిరంతరం ప్రజలకు ఆశాలు ఆరోగ్య సేవలు అందిస్తున్నారన్నారు. ఇప్పటికీ వారికి పారితోషికం రూ.9700 మాత్రమే ఇస్తున్నారని, కొన్ని సందర్భాల్లో ఈ డబ్బులు కూడా అందరికీ సమానంగా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్, హర్యానా, మహారాష్ట్రలలో మాదిరిగా తెలంగాణలో కూడా రూ.18000 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశాల సమస్యల పరిష్కారం కోసం జరిగే రాష్ట్రవ్యాప్త బస్సు జాతాలో పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్ మాట్లాడుతూ.. ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు, వీఓఏలు తదితర స్కీమ్‌లలో పనిచేస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వాలు నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 17 షెడ్యూల్డ్ పరిశ్రమల్లో పనిచేస్తున్న 1,20,000 మంది అసంఘటిత కార్మికులకు కనీస వేతనం నిర్ణయించి అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. సంఘీభావంగా సీపీఐ(ఎం) ములుగు జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పి.గంగామణి, ఆర్.నీలాదేవి, కె.సునీత, ఆర్.సాధన, ఎస్.పద్మ, ఎం.బాలమణి, ఆశా వర్కర్లు విజయ, అరుణ, సీఐటీయూ నాయకులు చెరుకు సత్యం, హెల్త్ డిపార్ట్ మెంట్ శ్రవణ్ కుమార్, విప్లవ, లత తదితరులు పాల్గొ న్నారు.

హేళన.. చులకనభావం

- సెలవులో ఉన్నా...స్పందించాల్సిందే
- అర్థరాత్రి అయినా సమాచారమివ్వాల్సిందే
- ఆ అధికారిణి తీరుపట్ల ఉద్యోగుల్లో ఆందోళన
- టీశాక్స్‌లో నేరుగా జేడీగా రావడంపై విచారణ జరపాలని డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమాజంలో అనుకోకుండా తలెత్తే కొన్ని సమస్యలకు పరిష్కారం కోసం స్కీంలు (పథకాలు) ప్రవేశపెడతారు. కొంత కాలం కొనసాగి ఆయా సమస్యలు పరిష్కారమయితే ఆ స్కీంలకు కూడా కాలం చెల్లుతుంది. అయితే అవి పరిష్కారం అయ్యే వరకు ఆయా స్కీంలలో ఉన్న వారు ఉమ్మడిగా అంకితభావంతో ఆ పథకం ఉద్దేశాలను నెరవేర్చాల్సి ఉంటుంది. వైద్యారోగ్యశాఖ పరిధిలోనూ పలు పథకాలు ఇదే విధంగా అమలవుతున్నాయి. అందులో రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఒకటి. హెచ్‌ఐవీపై ప్రజల్లో అవగాహన కల్పించడం, అది వ్యాప్తి చెందకుండా ప్రజలను అప్రమత్తం చేయడం, జాగ్రత్తలు సూచించడం, ఆ వ్యాధి బారిన పడిన వారికి మెరుగైన సేవలందించడం ఆ సొసైటీ ఏర్పాటు ఉద్దేశాల్లో ముఖ్యమైనవి. అయితే సొసైటీ లక్ష్యసాధన దిశగా చేస్తున్న పనుల కంటే తరచూ పలు వివాదాలతో నిండిపోవడమే కనిపిస్తున్నది.

తాజాగా ఆ సొసైటీలో సీఎస్టీ విభాగంలో జేడీగా విధులు నిర్వహిస్తున్న ఒక అధికారిణి వ్యవహారశైలిపై ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇతర విభాగాల నుంచి డిప్యూటేషన్‌పై వచ్చే వారికి సొసైటీలో వచ్చిన తర్వాత హోదా కల్పిస్తే ఈ అధికారిణికి మాత్రం ముందుగానే జేడీగా పోస్టు నిర్ణయించడంపై ఉద్యోగుల నుంచి అభ్యంతరం వ్యక్తమవుతున్నది. ఆమె మాటతీరు హేళన చేసినట్టు ఉండడంతో క్షేత్రస్థాయిలో పని చేస్తున్న ఉద్యోగులకు ఇబ్బందికరంగా మారిందని చెబుతున్నారు. సీనియర్ వైద్యులు పని చేస్తున్న ఈ సొసైటీలో కనీస గౌరవం ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. అక్టోబర్ నెలలో 24, 25 తేదీల్లో హైదరాబాద్ ట్రైనింగ్ సెంటర్‌లో, ఈ నెల 21న జరిగిన జూమ్ మీటింగ్ నిర్వహణలోనూ ఆ అధికారి వ్యవహారశైలి ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉందని బాధను వ్యక్తం చేస్తున్నారు. అడిగిన సమాచారాన్నే మళ్లీ మళ్లీ అడగటం, పని వేళల్లో కాకుండా అర్థరాత్రి సమయాల్లోనూ సమాచారాన్ని అడగటం, ఆరోగ్యం బాగోలేక సెలవుల్లో ఉన్న ఉద్యోగులకు అత్యవసర సమాచారమంటూ పని చెప్పి వేధిస్తున్నారని వాపోతున్నారు. ఈ మొత్తం వ్యవహారంతో గతంలో ఇతర జేడీలు ఉన్న సమయంలో మెరుగ్గా జరిగిన ప్రోగ్రాంలు సైతం డీలా పడిపోయినట్టు సమాచారం. గతంలో జూమ్ మీటింగ్‌లు ఏర్పాటు చేస్తే ఒకట్రెండు రోజుల ముందు ఉద్యోగులకు సమాచారం ఇచ్చేవారు. దీంతో ఆ సమావేశంలో పాల్గొనాల్సిన ఉద్యోగులు మిగిలిన పనులను, రోగులకు అందించే సేవలు పూర్తి చేసుకుని సిద్ధపడేవారు. అయితే ప్రస్తుతం సమావేశాలకు మాత్రం కొన్ని నిమిషాల ముందు చెప్పి తప్పనిసరిగా పాల్గొనాల్సిందేనని హుకుం జారీ చేస్తుండటంతో ఒత్తిడికి గురవుతున్నామని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం కోసం పంపించే గూగుల్ షీట్లు కూడా తరచూ మారుస్తుండటం ఇబ్బందిగా ఉంటుందని చెబుతున్నారు.

ఈ మొత్తం వ్యవహారంతో సొసైటీ ఏర్పాటు అసలు లక్ష్యం, కార్యక్రమాలు కుంటుపడుతున్నాయనీ, ఉద్యోగుల్లో పని చేయాలనే ఆసక్తిని చంపేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొసైటీలో పని చేస్తున్న వారిలో అత్యధిక మంది అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తూ మెరుగైన సేవలందిస్తుంటే వారిని ప్రోత్సహించి పని తీసుకోవాల్సిన అధికారిణి తీరు అందుకు భిన్నంగా ఉండటం పట్ల ఉద్యోగుల్లో ఆగ్రహం పెరిగిపోతున్నది. దీనిపై త్వరలోనే వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు ఆ శాఖ కార్యదర్శిని కలిసి వినతిపత్రం సమర్పించాలని నిర్ణయించుకున్నారు.

పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు అనుమతులు సాధించాలి

- అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లాలి : మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి మిగిలిన అనుమతులు సాధించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత వి.శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. క్యాబినెట్ మొత్తం ప్రధాన మంత్రిని కలుస్తారా? అనేది తేల్చుకోవాలన్నారు. ఆ ప్రాజెక్టు కోసం అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకువెళ్లాలని కోరారు. బీఆర్ఎస్ త్వరలోనే కార్యాచరణ చేపడుతుందనీ, రైతు సంఘాలతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. 12 లక్షల ఎకరాలకు నీళ్లిస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెబితే, ఆ ప్రాజెక్టుకు కేంద్రం అనుమతులు ఇవ్వడం లేదని శ్రీనివాస్ గౌడ్ గుర్తుచేశారు. డీపీఆర్ ను వెనక్కి పంపించిందని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలోనే పూర్తయిన ఈ ప్రాజెక్టుపై ఏపీ ప్రభుత్వం క్రిష్టా ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేసిందని తెలిపారు. బీఆర్ఎస్ పంపించిన డీపీఆర్‌కు పర్యావరణశాఖ అనుమతించిందని గుర్తుచేశారు. నాగార్జున సాగర్ ఎగువన ఉన్న 45 టీఎంసీలు తెలంగాణ వాడుకోవాలని తీర్పు ఉందనీ, 90 టీఎంసీల నికర జలాలు తెలంగాణకు ఉన్నాయని తెలిపారు. అయితే తెలంగాణకు రావాల్సిన మూడు అనుమతులను ఏపీ ప్రభుత్వం ఆపిందని చెప్పారు.

నిమ్స్ ఆస్పత్రిలో దారుణం

- దొంగతనం నెపంతో కార్మికుడిని చితకబాదిన పోలీసులు..!
- సీఐటీయూ నాయకులు, కార్మికుల ఆందోళన
- దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్



నవతెలంగాణ-బంజారాహిల్స్

నిమ్స్ ఆస్పత్రిలో ఓ కాంట్రాక్ట్ కార్మికున్ని దొంగతనం నెపంతో పోలీసులు చితకబాదారు. నిమ్స్ ఆస్పత్రికి ఎంఆర్ఐ స్కానింగ్ కోసం వచ్చిన ఓ పేషెంట్ తన బంగారు గొలుసు పోయిందని ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు కాంట్రాక్టు కార్మికున్ని తీవ్రంగా కొట్టారు. అయితే, ఆ పేషెంట్ ఇన్నర్ పాకెట్‌లోనే ఆ బంగారు గొలుసు దొరికింది. పూర్తిగా విచారించకుండా.. నిజాలు తెలుసుకోకుండానే అకారణంగా కార్మికున్ని కొట్టడంపై సీఐటీయూ ఆధ్వర్యంలో తోటి కార్మికులు ఆందోళన చేశారు. వివరాల్లోకెళ్తే.. శుక్రవారం సాయంత్రం 4:30 నిమ్స్ ఆస్పత్రికి ఓ అవుట్ పేషెంట్ ఎంఆర్ఐ స్కానింగ్ కోసం వచ్చాడు. అతన్ని ల్యాబ్‌లోకి తీసుకెళ్లే సమయంలో ఒంటిపై ఉన్న వస్తువులను భద్రపరచుకోవాలని స్కానింగ్ ఆపరేటర్ సూచించాడు. దాంతో అతను తన ఫోన్‌ను ఎంఆర్ఐ విభాగంలో విధులు నిర్వహిస్తున్న కార్మికుడు లింగయ్యకు ఇచ్చాడు. స్కానింగ్ అనంతరం రోగి.. కార్మికుడి వద్ద నుంచి ఫోన్ తీసుకున్నాక.. తన మెడలో గొలుసు కనబడటం లేదని ఇవ్వాలని గొడవ చేశారు. అయితే, తనకు ఫోన్ మాత్రమే ఇచ్చారని గొలుసు ఇవ్వలేదని కార్మికుడు ఎంత చెప్పినా వినకుండా రోగి గొడవ చేస్తూ సెక్యూరిటీ ఆఫీసు అధికారులకు, సిబ్బందికి, కాంట్రాక్ట్ సూపర్‌వైజర్‌కు, డ్యూటీ ఎంఆర్ఓకు సమాచారం ఇచ్చాడు. దాంతో సెక్యూరిటీ అధికారి రామారావు పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పంజాగుట్ట స్టేషన్ క్రైమ్ పోలీసులు ఎంక్వయిరీ పేరుతో సదరు కార్మికున్ని తీసుకెళ్లి చితక బాదారు. దాంతో కార్మికుడి ఆరోగ్య పరిస్థితి క్షీణించింది. విషయం తెలుసుకున్న సీఐటీయూ నాయకులు పోలీస్ స్టేషన్‌కు వెళ్తే.. ఎన్ని గంటలైనా అతన్ని కలవనివ్వలేదు. అయితే, కార్మికుడు భయపడుతున్నట్టు చెప్పి అతన్ని పోలీసులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఎమర్జెన్సీ వార్డులో ప్రస్తుతం కార్మికుడు చికిత్స పొందుతున్నారు. ఇదిలా ఉండగా, ఎంఆర్ఐ గదిలో సీసీ కెమెరాలను పరిశీలించగా.. రోగి ప్యాంట్ జేబులోనే గొలుసు ఉన్నట్టు తెలిసింది.ఈ ఘటనపై సీఐటీయూ నాయకులు, కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప స్పందించాలని కోరుతూ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. బాధ్యతాయుతంగా నమ్మకంగా పనిచేస్తున్న కార్మికులపై భౌతిక దాడి చేసిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. పంజాగుట్ట క్రైమ్ బ్రాంచ్ ఎస్ఐ కార్మికున్ని పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

ప్రమాణాలతో కూడిన పరిశోధనలతోనే గుర్తింపు

- స్టాన్లీ ఇంజినీరింగ్ కాలేజీ అంతర్జాతీయ సదస్సులో వక్తలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రమాణాలతో కూడిన పరిశోధనలను చేస్తేనే విద్యాసంస్థలకు ప్రత్యేక గుర్తింపు వస్తుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. నాణ్యమైన పరిశోధనలు తయారు చేసేలా విద్యార్థులను అధ్యాపకులు ప్రోత్సహించాలని సూచించారు. రెండు రోజులపాటు జరగనున్న రీసెర్చ్ ఇన్ ఇంటెలిజెంట్ కంప్యూటింగ్ ఇన్ ఇంజినీరింగ్ (ఆర్ఐసీఈ-2024) అంతర్జాతీయ సదస్సు శుక్రవారం హైదరాబాద్‌లోని స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో ప్రారంభమైంది. ఆ కాలేజీ ప్రిన్సిపాల్ సత్యప్రసాద్ లంక మాట్లాడుతూ విద్య, పరిశోధన సమాజాభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలని చెప్పారు. ఉన్నత ప్రమాణాలతో కూడిన పరిశోధనలు ఎంతో అవసరమని అన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ దేశానికి విశేషమైన సేవలందించారని వివరించారు. దేశ వృద్ధి, అభివృద్ధిపై శాశ్వత ప్రభావాన్ని చూపారని అన్నారు. ఆర్థిక సంస్కరణల పట్ల ఆయన నాయకత్వం, దృక్పథం, అంకితభావం దేశానికి దార్శనికతను చూపాయని చెప్పారు. ఆయన నిబద్ధతతో పనిచేశారనీ, దేశ సమగ్రత, పురోగతి కోసం పాటుపడ్డారని వివరించారు. వియత్నాం హనోయి విశ్వవిద్యాలయం సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం అధిపతి ఎన్‌గుయెన్ హాంగ్ సన్ మాట్లాడుతూ ఈ సదస్సు విజయవంతం కావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. జ్ఞానాన్ని పెంపొందించే ఆవిష్కరణలను ప్రోత్సహించాలని సూచించారు. మలేషియా లింకన్ విశ్వవిద్యాలయం ఏఐ కంప్యూటింగ్ అండ్ మల్టీమీడియా డీన్ మిథున్ చక్రవర్తి మాట్లాడుతూ పరిశోధనల్లో ఉన్నత ప్రమాణాలను నెలకొల్పాలని సూచించారు. పరిశ్రమల అభివృద్ధికి దోహదపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ అతుల్ నేగి, స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మరో రోజు ఆగండి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఫార్ములా ఈ రేస్‌లో అక్రమాలు జరిగాయంటూ ఏసీబీ నమోదు చేసిన కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఈ నెల 31వ తేదీ వరకు అరెస్టు చేయరాదని హైకోర్టు పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. ఈలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఏసీబీని ఆదేశించింది. విచారణను ఈ నెల 31కి వాయిదా వేస్తూ జస్టిస్ లక్ష్మణ్ శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 30 వరకు కేటీఆర్‌ను అరెస్టు చేయరాదన్న గత ఉత్తర్వులను రద్దు చేయాలని ఏసీబీ చేసిన వినతిని తిరస్కరించారు. కేసులో ఇరుపక్షాల వాదనల తర్వాతే తగిన ఉత్తర్వులు ఇవ్వగలమని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా ఈ కేసులో ఏసీబీ అఫిడవిట్‌ను దాఖలు చేసింది. ఒప్పందాల్లో మంత్రి కేటీఆర్ ఏకపక్షంగా చెల్లింపులు చేశారని ఆరోపించింది. ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేశారని పేర్కొంది. దురుద్దేశంతో, కుట్రపూరితంగా వ్యవహరించిన నాటి మంత్రి కేటీఆర్ క్యాబినెట్ అనుమతి లేకుండా ఆర్థిక శాఖ ఆమోదం కూడా పొందకుండా నిధులు విడుదల య్యేలా చేశారని వివరించింది. విదేశీ సంస్థకు అనుమతులు లేకుండానే రూ.54 కోట్లు బదిలీ చేశారనీ, దీని వల్ల హెచ్ఎండీఏ రూ.8 కోట్లు ఇన్‌కంట్యాక్స్ చెల్లించాల్సి వచ్చిందని వివరించింది. మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి ఫిర్యాదు మేరకు ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌లో ఏసీబీ డీఎస్పీ మాజిద్ అలీఖాన్ పైవిధంగా కౌంటర్ పిటిషన్ వేశారు. ఇదే కేసులో కేటీఆర్ కూడా ఏసీబీ కౌంటర్‌కు రిప్లై కౌంటర్ దాఖలు చేశారు. రాజకీయంగా కుట్రతో నమోదు చేసిన కేసు. ఒప్పందాల మేరకే చెల్లింపులు జరిగాయి. అనుమతులు, విదేశీ నిధుల వ్యవహారాలు, ఇతర లోపాలుంటే వాటిని పరిశీలించి చట్ట ప్రకారం చర్యలు ఉండేలా చేయాల్సింది అధికారులేగానీ మంత్రులు కాదు. అన్యాయంగా తనపై కేసు నమోదు అయింది. అవినీతిపరుడనే ముద్ర వేసి రాజకీయంగా, వ్యక్తిగతంగా అప్రతిష్టపాలు చేయాలనే ప్రభుత్వ కుట్రను అడ్డుకోవాలి అని కేటీఆర్ హైకోర్టును కోరారు. ఈ కేసు విచారణ ఈ నెల 31న జరగనుంది.

దేశం గొప్ప నాయకుడిని కోల్పోయింది : కూనంనేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రముఖ ఆర్థిక వేత్త, మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ మరణం పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన మరణంతో దేశం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయిందని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడే దేశంలో ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని వివరించారు. ఆర్థికవేత్తగా, అధ్యాపడిగా, రిజర్వు బ్యాంకు గవర్నర్‌గా, రాజ్యసభ సభ్యుడిగా, ప్రతిపక్ష నాయకుడిగా, ప్రధానమంత్రిగా దేశానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. యూపీఏ ప్రభుత్వానికి నాయకత్వం వహించి పదేండ్లపాటు ప్రధానమంత్రిగా ఆయన దేశంలో అనేక వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ఆయన మరణం పట్ల ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతూ, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

మన్మోహన్ అంత్యక్రియలకు హాజరు కానున్న బీఆర్ఎస్

- కేటీఆర్ ఆధ్వర్యంలో ఢిల్లీకి వెళ్లనున్న ఎంపీలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అంత్యక్రియలకు హాజరుకావాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు మాజీ ప్రధాని భౌతికకాయానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధర్వంలోని ఆ పార్టీ ఎంపీలు ఢిల్లీకి వెళ్లి ఘనంగా నివాళులర్పించనున్నారు. ఈ మేరకు కేసీఆర్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశ ఆర్థిక సంస్కరణల ఆర్కిటెక్టుగా మన్మోహన్‌సింగ్ దేశానికి అమోఘమైన సేవలందించారని తెలిపారు. దాంతోపాటు తెలంగాణతో ఆయనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని పేర్కొన్నారు. ఆయన క్యాబినెట్‌లో తాను మంత్రిగా పనిచేశాననీ, ఆయనతో వ్యక్తిగత అనుబంధమున్నదని వివరించారు. ఆయనెంతో స్థిత ప్రజ్ఞత కలిగిన దార్శనికులని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి రాష్ట్ర ఏర్పాటు దాకా వారందించిన సహకారం ఈ సమాజం మరువబోదని పేర్కొన్నారు. రాష్ట్రం కోసం పోరాడుతున్న తనకు, నాటి టీఆర్ఎస్ పార్టీకి ప్రతి సందర్భంలో మనోధైర్యాన్ని నింపుతూ వారు అండగా నిలిచారని గుర్తు చేశారు. ఆయన ప్రధానిగా ఉన్న సమయంలోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిందని తెలిపారు. రాష్ట్ర ఏర్పాటులో సానుకూల వైఖరితో తనకు ఆయన అందించిన సహకారం మరువలేనని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ సమాజానికి అత్యంత ఆప్తుడైన మన్మోహన్ సింగ్ మరణం పట్ల సంతాపం ప్రకటిస్తూ ఘన నివాళులు అర్పిస్తున్నట్టు వివరించారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌కు నివాళులు

- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ చిన్నారెడ్డి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

అనారోగ్యంతో న్యూఢిల్లీ ఎయిమ్స్‌లో మతి చెందిన మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్‌కు రాష్ట్ర ప్రణాళికా సంఘం చైర్మెన్ డాక్టర్ జి చిన్నారెడ్డి, ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్, ప్రజావాణి అధికారులు, సిబ్బంది ఘనంగా నివాళులు అర్పించారు.శుక్రవారం మహాత్మాజ్యోతిబా పూలే ప్రజాభవన్ సంతాప కార్యక్రమంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి చిన్నారెడ్డి, దివ్య, సిబ్బంది శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి చిన్నారెడ్డి మాట్లాడుతూ మన్మోహన్‌సింగ్ గొప్ప ఆర్థిక సంస్కర్త అని వ్యాఖ్యానించారు. దేశం ఆర్థికంగా క్లిష్ట పరిస్థితుల్లో ఉండగా తన మెదస్సుతో దేశాన్ని ఆర్థికంగా గట్టెక్కించిన గొప్ప మేధావి అని కొనియాడారు. ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం వంటి గొప్ప కార్యక్రమాలకు మన్మోహన్‌సింగ్ శ్రీకారం చుట్టారని తెలిపారు. పదేండ్లపాటు దేశ ప్రధానమంత్రిగా మన్మోహన్‌సింగ్ చేపట్టిన అనేక సంస్కరణలు భావితరాలకు స్ఫూర్తి అని అభిప్రాయపడ్డారు.

ప్రజావాణిలో 154 అర్జీలు

- సెలవు రోజునా కార్యక్రమం కొనసాగింపు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 154 అర్జీలు అందాయి. ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ డాక్టర్ జి చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వివిధ అంశాలపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, అర్జీలపై ఎండార్స్‌మెంట్ చేసిన చిన్నారెడ్డి, దివ్య సమస్యలను పరిష్కరించారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మతి చెందిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం సెలవు దినంగా ప్రకటించినప్పటికీ ఈ సమాచారం తెలియక వచ్చిన ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని యధావిధిగా కొనసాగించారు. పంచాయతీరాజ్, గ్రామీణ అభివద్ధి శాఖకు సంబంధించి 59, విద్యుత్ 26, రెవెన్యూ 18, హోంశాఖ ఎనిమిది , వ్యవసాయ ఐదు, ఇతర శాఖలకు సంబంధించి 38 అర్జీలు ప్రజావాణికి అందాయి.

పీహెచ్‌డీ విద్యార్థిని ఆత్మహత్య

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- పరారీలో ఇద్దరు
- తండ్రి డబ్బులు తీసుకుంటే.. కుమార్తెకు వేధింపులు



నవతెలంగాణ - చర్లపల్లి

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో పరిశోధక విద్యార్థిని ఆత్మహత్య కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఉద్యోగం ఇప్పిస్తానని తండ్రి డబ్బు తీసుకుంటే.. తిరిగివ్వాలంటూ కుమార్తెను వెధించడంతో ఆమె మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంది. ఈ కేసులో మృతురాలి తండ్రి సంగీతరావు, అనిత, ఆమె తండ్రి సోమయ్యను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనిత భర్త అనిల్, సైదులు పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. పులివర్తి నాగమణి- పులివర్తి సంగీతరావు దంపతులు. సంగీతరావు గతంలో హబ్సిగూడలోని ఐఐసీటీలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. సంగీతరావు ఇతరుల నుంచి డబ్బు తీసుకుని చెల్లించలేకపోయేవాడు. దాంతో వడ్డీ వ్యాపారులు తరచూ వారి ఇంటికి వచ్చి ఆందోళన చేసేవారు.

దాంతో నాగమణి భర్త ప్రవర్తనతో విసిగిపోయి 2 సంవత్సరాల నుంచి అతని నుంచి దూరంగా జీవిస్తోంది. వారి కుమార్తె దీప్తి(29) ఐఐసీటీలో ప్రాజెక్టు అసిస్టెంట్‌గా పనిచేసేది. అయితే, వీరి ఇంటి ఎదురుగా ఉండే కానిస్టేబుల్ అనిల్ భార్యకు ఐఐసీటీలో ఉద్యోగం ఇప్పిస్తానని సంగీతరావు 2022లో రూ.15 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకపోవడంతో అనిల్ తన డబ్బు తిరిగి ఇవ్వాలని దీప్తిని అడిగేవాడు. డబ్బు తన తండ్రి తీసుకున్నాడని, ఆయన తమతో కలిసి ఉండటం లేదని సమాధానం చెప్పింది. అనిల్ పట్టించుకోకుండా తన భార్యతో నాచారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయించాడు. దాంతో దీప్తి, సంగీతరావు మీద ఛీటింగ్ కేసు నమోదైంది. అనిల్, అనిత న్యాయస్థానంలో సివిల్ దావా కూడా వేశారు. ఈ విషయమై అనిత, అనిల్, అనిత తండ్రి సోమయ్య, సోదరుడు సైదులు కలిసి కేసు ఉపసంహరించుకునేందుకు రూ.35 లక్షలు డిమాండ్ చేసి, వారి జీవితాలను నాశనం చేస్తామని బెదిరించారు. దాంతో మనస్తాపానికి గురైన దీప్తి బుధవారం రాత్రి 10 గంటల సమయంలో చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తల్లి వచ్చి చూసేసరికి అప్పటికే మరణించింది. ఫోన్ తనిఖీ చేస్తే.. సెల్ఫీ వీడియో ఉంది. ఈ మేరకు నాచారం పోలీసులు సంగీతరావు, అనిత, ఆమె తండ్రి సోమయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనిత భర్త అనిల్, సైదులు పరారీలో ఉన్నారు.

'సర్వ'త్రా 'శిక్ష'

- అడుగడుగునా శ్రమదోపిడీ
- రెగ్యులరైజేషన్, పేస్కేల్ కోసం అభియాన్ ఉద్యోగుల డిమాండ్
- 18 రోజులుగా ఆందోళనలు.. కేజీబీవీల్లో కుంటుబడిన విద్య
- సమస్య పరిష్కారంపై చొరవ చూపని ప్రభుత్వం
- రాష్ట్రంలో 19,325 మంది ఉద్యోగుల నిరసన



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మె బాట పట్టి నేటికీ 18 రోజులవుతుంది. విద్యాభివృద్ధికి తోడ్పడే ఈ ఉద్యోగులు తమకు జరుగుతున్న అన్యాయంపై డిసెంబర్ 10వ తేదీ నుంచి ఆందోళనలు చేపట్టారు. రోజుకో రూపంలో ఉద్యమం సాగిస్తున్నారు. తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. టీ తాగేలోగా తమ సమస్యలను పరిష్కరిస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎందుకు ఆ మాట నిలుపుకోవడం లేదని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. దీనికి సింబాలిక్‌గా ఐదు రోజుల క్రితం టీ కప్పుతో కూడిన ప్లకార్డులను చేతపట్టుకుని ఖమ్మంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రంలోనూ పలు జిల్లాల్లో వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 19,325 మంది ఉద్యోగులు ఆందోళన బాట పట్టడంతో కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో బోధన కుంటుబడింది. ప్రభుత్వం వీరిని రెగ్యులరైజ్ చేయాల్సిందిపోయి పట్టింపులకు పోతున్నట్టు సమాచారం. ఆందోళనల్లో భాగమవుతున్న ఉద్యోగులకు ప్రత్యామ్నాయాలను వెతికే పనిలో ఉన్నట్టు తెలుస్తోంది. అదే జరిగితే న్యాయపరంగా వెళ్లే అంశాన్ని సమగ్ర శిక్షా ఉద్యోగులు పరిశీలిస్తున్నారు.

అడుగడుగునా శ్రమదోపిడీ

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారమైనా సమగ్ర శిక్షా ఉద్యోగులకు వేతనాలు ఇవ్వట్లేదు. జిల్లాస్థాయిలో ఏపీవోలు, సిస్టమ్ అనలిస్టులు, టెక్నికల్ పర్సన్స్, ఆపరేటర్స్, డీఎల్ఎంటీ, మెసెంజర్స్, మండలస్థాయిలో ఎంఐఎస్ కోఆర్డినేటర్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, ఐఈఆర్‌పీఎస్, మెసెంజర్స్, సీజీవీలు, స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ (సీఆర్‌పీ), కేజీబీవీ అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో స్పెషల్ ఆఫీసర్లు (పీజీ హెచ్‌ఎం హెూదా), కాంట్రాక్ట్ రిసోర్స్ టీచర్స్ (స్కూల్ అసిస్టెంట్ హెూదా), పీఈటీలు, ఏఎన్ఎంలు, అకౌంటెంట్స్, క్రాఫ్ట్ అండ్ కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్స్, కుక్స్, వాచ్ ఉమెన్స్, స్వీపర్లు, స్కావెంజర్స్, పాఠశాల స్థాయిలో పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్స్ (ఆర్ట్, పీఈటీ వర్క్ ఎడ్యుకేషన్), భవిత కేంద్రాల్లో ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ టీచర్స్ పని చేస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నా వీరికి వేతనం మాత్రం అరకొరగానే ఇస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగులకు ఇచ్చేదానిలో నాలుగో వంతు కూడా ఇవ్వడం లేదు. మెసెంజర్లకు రూ.11 వేలు, సీఆర్‌పీలకు రూ.19,350 (ఏపీలో ఇదే పోస్టుకు రూ.26వేలు), హెచ్‌ఎం స్థాయిలో ఉన్న స్పెషల్ ఆఫీసర్‌కు రూ.32 వేలు వేతనం ఇస్తున్నారు. టీఏ, డీఏల వంటివేవీ లేవు. ఏడాదిలో పదినెలలు మాత్రమే వేతనాలు ఇస్తున్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల్లో ఇప్పటి వరకు 119 మంది మరణించారు. కానీ వీరి కుటుంబాలకు ఎలాంటి పరిహారం ఇవ్వలేదు. తమను రెగ్యులరైజ్ చేయడంతో పాటు రూ.10 లక్షల బీమా, రూ.5 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తు న్నారు. మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వా లని కోరుతున్నారు. ఉద్యోగుల కుటుంబా లకు రూ.15 లక్షల పరిహారం, 61 ఏండ్లు నిండితే రూ.20 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలనే డిమాండ్‌లను ఉద్యోగులు ప్రభుత్వం ముందు ఉంచారు.

పదేండ్లకుపైగా పని చేస్తున్నా రెగ్యులరైజేషన్ లేదు

సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ)లో ఉద్యోగులు కనిష్ఠంగా పదేండ్లు.. గరిష్ఠంగా 20 ఏండ్లుగా పని చేస్తున్నారు. కానీ వారి వేతనాల్లో ఎలాంటి పెరుగుదల లేదు. ఇప్పటికీ ఈ విభాగంలోని ఉద్యోగులకు కనిష్ఠంగా రూ.7వేలు, గరిష్ఠంగా రూ.30వేల వరకు మాత్రమే వేతనం లభిస్తోంది. ఈ శ్రమదోపిడీని వారు వ్యతిరేకిస్తున్నారు. అయితే రెగ్యులరైజ్ చేయాలని, పేస్కేల్ అమలు చేయాలనే నినాదంతో ఆందోళనలు చేపట్టారు. కాంట్రాక్టు పద్ధతిలోనే నియామకమైనా మెరిట్, రోస్టర్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ విధానంలోనే తమను విధుల్లోకి తీసుకున్నారని ఉద్యోగులు చెబుతున్నారు. అటువంటి తమకు ఉద్యోగభద్రత కల్పించేందుకు అర్హులం కామా? తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని అడగకూడదా అని ప్రశ్నిస్తున్నారు. వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు శుక్రవారం హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. ఈ విషయాన్ని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని వీరికి హామీ ఇచ్చారు. అలాగే మంత్రి పొన్నం ప్రభాకర్‌తో శుక్రవారం చర్చలు జరగాల్సి ఉండగా మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణంతో వాయిదా పడ్డాయి.

చర్చలకు సమయం ఇవ్వట్లేదు..

చర్చలకు ఆహ్వానిస్తూనే ప్రభుత్వం సమయం ఇవ్వట్లేదు. పదేండ్లకు పైబడి పనిచేస్తున్నా ఉద్యోగుల క్రమబద్ధీకరణ కానీ, పేస్కేల్ కానీ అమలు చేయట్లేదు. అరకొరవేతనాలిస్తూ శ్రమదోపిడీకి పాల్పడుతున్నారు. సుప్రీం తీర్పు ఇచ్చినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అత్యంత దారుణం.

షేక్ మహబూబ్‌పాషా,
ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం
ఖమ్మం జిల్లా అధ్యక్షులు

నేడు మన్మోహన్ సింగ్‌కు తుది వీడ్కోలు

(మొదటిపేజీ తరువాయి)

ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి వంటి పలువురు మాజీ ప్రధానుల స్మారక చిహ్నాలు ఉన్నట్టే మన్మోహన్ సింగ్ స్మారకానికి స్థలం కేటాయించాలని కోరుతోంది. ఈ డిమాండ్‌తో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ప్రధాన కార్యాదర్శులు ప్రియాంక గాంధీ, కెసి వేణుగోపాల్ కలిశారు.అదే విధంగా మన్మోహన్ సింగ్‌కు స్మారక స్థలం ఏర్పాటుపై శుక్రవారం ఉదయం ఖర్గే ప్రధానితో ఫోన్‌లో మాట్లాడారు. తాజాగా ఈ అంశంపై నరేంద్ర మోడీకి రెండు పేజీల లేఖ రాశారు. అయితే ఈ డిమాండ్‌పై కేంద్రం ఇంకా స్పందించ లేదు.

ఎయిమ్స్‌లో గురువారం రాత్రి మతి చెందిన మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ పార్థివదేహాన్ని శుక్రవారం ఉదయం మోతీలాల్ నెహ్రూ రోడ్‌లోని ఆయన నివాసంలో ఉంచారు. అక్కడ ఆయన పార్థివదేహంపై జాతీయ జెండా కప్పారు. మన్మోహన్ సింగ్ సతీమణి గురుశరణ్ కౌర్, ఇతర కుటుంబ సభ్యుల సమక్షంలో ప్రముఖులు నివాళులర్పించారు. ఇక్కడ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, నిర్మలా సీతారామన్, హర్దీప్‌సింగ్ పూరి, రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ మాజీ ప్రధాని భౌతికకాయానికి నివాళు లర్పించారు. సుప్రీంకోర్టు, దాని న్యాయమూర్తుల తరపున సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నివాళులర్పించారు.

ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి (తెలంగాణ), చంద్రబాబు నాయుడు (ఆంధ్రప్రదేశ్), ఎంకె స్టాలిన్ (తమిళనాడు), సుఖ్వీందర్ సింగ్ (హిమాచల్‌ప్రదేశ్), అతిశీ మర్లెన(ఢిల్లీ), ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్, కాంగ్రెస్ నేతలు కెసి వేణుగోపాల్, జైరాం రమేష్, పవన్ ఖేరా, డీఎంకే నేత టిఆర్ బాలు, తెలంగాణ మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ తదితరులు నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, ప్రజల సందర్శనార్థం అక్బర్ రోడ్ 24లోని కాంగ్రెస్ ప్రధాన కార్యాల యానికి ఆయన పార్థివదేహాన్ని తరలించారు. ఢిల్లీలో భారీగా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్క చేయకుండా కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు మన్మోహన్ సింగ్‌కు నివాళు లర్పించారు. సీపీఐ(ఎం) సమన్వయకర్త ప్రకాశ్ కరత్ నివాళులర్పించారు.

ఏడు రోజులు సంతాప దినాలు

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం పట్ల కేంద్ర మంత్రివర్గం సంతాపం తెలిపింది. ఆయన మృతికి తీవ్ర విచారం వ్యక్తం చేసింది. శుక్రవారం ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం సంతాప తీర్మానాన్ని ఆమోదించింది. ఈ సమావేశంలో మన్మోహన్ సింగ్ మృతికి సంతాపంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. జనవరి 1 వరకు ఏడు రోజులపాటు సంతాప దినాలుగా ప్రకటించారు. ఈ ఏడు రోజులపాటు దేశవ్యాప్తంగా, విదేశాల్లోని ఇండియన్ మిషన్స్, రాయబార కార్యాలయాల్లో జాతీయజెండాను సగం వరకు ఎగురవేయనున్నారు. మన్మోహన్ సింగ్ అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలని నిర్ణయించారు. అంత్యక్రియల రోజు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు హాఫ్ డే సెలవు ప్రకటించారు.

అంతర్జాతీయ నేతల సంతాపం

అమెరికా, చైనా, కెనడా, ఫ్రాన్స్, రష్యా, మలేషియా, శ్రీలంక, బంగ్లాదేశ్, ఇరాన్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపాలు వెల్లువెత్తాయి. చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ శుక్రవారం ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసింది. భారత్-చైనా సంబంధాలకు సింగ్ సానుకూల సహకారం అందించారని పేర్కొంది. బ్రిక్స్ వంటి సంకీర్ణాలకు మన్మోహన్ సింగ్ అందించిన సహకారాన్ని శ్రీలంక అధ్యక్షుడు అనురా కుమార దిసానాయకే గుర్తు చేసుకున్నారు. "శ్రీలంక ప్రజల తరపున, నా తరపున ఇండియాకు, మన్మోహన్ సింగ్ కుటుంబానికి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అసంఖ్యాక అభిమానులకు హృదయపూర్వక సానుభూతిని తెలియజేస్తున్నాను. ఆయన దార్శనికత కలిగిన నాయకుడు. ఆయన ప్రభావం జాతీయ సరిహద్దులను అధిగమించింది. 2004 నుంచి 2014 వరకు ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో తీసుకొచ్చిన విద్యా హక్కు చట్టం, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం వంటి పథకాలు, ఆయన విధానాలు, ఇతరులను కలుపుకుపోవడం పట్ల ఆయన దృఢమైన నిబద్ధతను ప్రతిబింబించాయి" అని అన్నారు.

మన్మోహన్ సింగ్ మరణం పట్ల రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ సంతాపం వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్ చీఫ్ అడ్వైజర్ ముహమ్మద్ యూనస్ సంతాపం తెలిపారు. మన్మోహన్ సింగ్ గొప్ప వినయం కలిగిన వ్యక్తిగా, దూరదృష్టి గల నాయకుడిగా, రాజనీతిజ్ఞుడిగా, దేశ ప్రజల సంక్షేమానికి భరోసా ఇవ్వడంలో అచంచలమైన నిబద్ధతకు పేరుగాంచిన వ్యక్తిగా అభివర్ణించారు. మన్మోహన్ సింగ్ మృతి పట్ల ఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయం సంతాపం తెలిపింది. ఆఫ్ఘనిస్తాన్ మాజీ అధ్యక్షుడు హమీద్ కర్జాయ్ సంతాపం తెలుపుతూ ఇండియా అత్యంత ప్రసిద్ధ కుమారుల్లో ఒకరిని కోల్పోయిందని అన్నారు.

ఐఎంఎఫ్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గీతా గోపినాథ్ మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం తెలిపారు. మన్మోహన్ సింగ్ సంస్కరణలు భారతదేశాన్ని మార్చాయని, సంకెళ్లు లేని ఆర్థిక వ్యవస్థను తయారు చేశాయని తెలిపారు.

అదే విధంగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు గౌరవార్థం ఇండియా క్రికెట్ క్రీడాకారులు చేతికి నల్ల బ్యాండ్ ధరించారు. ఆస్ట్రేలియాతో జరుగుతున్న నాలుగో టెస్టు రెండో రోజు భారత క్రికెట్ జట్టు చేతికి నల్ల బ్యాండ్‌లు కట్టుకుంది.

"నిజమైన రాజనీతిజ్ఞుడిని" కోల్పోయాం:సీడబ్ల్యూసీ తీర్మానం

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ శ్రద్ధాంజలి ఘటించింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీతోపాటు ఇతర కాంగ్రెస్ ముఖ్య నేతలు హాజరయ్యారు. మన్మోహన్ సింగ్ మృతికి సంతాపంగా సీడబ్ల్యూసీ నేతలు రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తీర్మానం ఆమోదించింది. దేశ రాజకీయ, ఆర్థిక రంగంలో ఆయన ఒక మహెూన్నత వ్యక్తి అని, దీని సహకారం దేశాన్ని మార్చివేసిందని తీర్మానంలో పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా ఆయనకు గౌరవాన్ని సంపాదించిపెట్టిందని తెలిపింది. తన జీవితం, పని భారతదేశ విధిని గాఢంగా రూపొందించిన "నిజమైన రాజనీతిజ్ఞుడిని" కోల్పోయిందని పేర్కొంది.



మన్మోహన్ అలా..మోడీ ఇలా..!

- జేఎన్‌యూ నిరసనల్లో ఇద్దరి తీరు వేరు..

న్యూఢిల్లీ: ఢిల్లీలోని జవహర్‌లాల్ యూనివర్సిటీ (జేఎన్‌యూ)లో నిరసనల పట్ల మన్మోహన్ సింగ్ ఎంతో సంయమనంతో, దయతో వ్యవహరించారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో అలాంటి సంయమనం, దయ మచ్చుకు కూడా కానరావు. 2005లో ప్రధాని హెూదాలో మన్మోహన్ సింగ్ జేఎన్‌యూని సందర్శించినప్పుడు విద్యార్థులు నల్లజెండాలు చేబూని నిరసన తెలిపారు.

దీనిపై ఆగ్రహించిన యూనివర్సిటీ యాజమాన్యం ఆందోళన చేస్తున్న విద్యార్థులకు నోటీసులు జారీ చేసింది. కొందరిని ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ మరుసటి రోజు సింగ్ జోక్యం చేసుకుని, విద్యార్థులతో వ్యవహరించే విషయంలో సున్నితంగా ఉండాలని అప్పటి వైస్ ఛాన్సలర్ బిబి భట్టాచార్యకు సూచించారు. 2015లో జరిగిన ఒక ఇంటర్వ్యూలో భట్టాచార్య ఈ సంఘటన గురించి స్వయంగా మాట్లాడారు."దయచేసి సానుభూతితో ఉండండి సార్ అని మన్మోహన్ సింగ్ నాతో అన్నారు. నేను కనీసం వారిని హెచ్చరించాలని చెప్పాను. కానీ ఈ రోజు సమస్య ఏమిటంటే విద్యార్థులతో కమ్యూనికేషన్ లైన్లు విచ్ఛిన్నమయ్యాయి, "అని మాజీ వైస్ ఛాన్సలర్ చెప్పారు.

మోడీ హయాంలో అణచివేత

విద్యార్థుల నిరసనలు కొత్త విషయం కాదు. విశ్వవిద్యాలయం ప్రారంభం నుండి ఇది ఒక సంప్రదాయం. అయితే, మోడీ ప్రభుత్వం వచ్చాక జేఎన్‌యూలో విద్యార్థుల నిరసనలపై ఉక్కుపాదం మోపింది. దేశద్రోహ నేరం కింద కేసులు పెట్టి జైలుకు పంపడం, క్యాంపస్‌లో పోలీసుల నిఘా, విద్వేష మూకల దాడులు పెరిగిపోయాయి. విద్యా సంవత్సరానికి విశ్వవిద్యాలయ పాలకవర్గమే పెద్ద అడ్డంకిగా మారింది.

మన్మోహన్ సింగ్ గొప్ప ఆర్థికవేత్త

సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ గొప్ప ఆర్థిక వేత్త, మహా నాయకుడు, సంస్కరణవాది అన్నింటికి మించి గొప్ప మానవతావాది అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మరణంతో దేశం ఒక గొప్ప కుమారుడిని కోల్పోయిందని అవేదన వ్యక్తం చేశారు. మాజీ ప్రధానమంత్రి మరణంపై ఎక్స్‌లో తన సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని సీఎం తెలియజేశారు. నిర్ణయాలు తీసుకోవడంలో మన్మోహన్ సింగ్ సమగ్రత, పారదర్శకత అన్నింటికీ మించి మానవీయ స్పర్శను జోడించేవారనీ, నవ భారత శిల్పుల్లో మన్మోహన్ సింగ్ ఒకరని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు.రాజకీయ, ప్రజా జీవితంలో గౌరవ మర్యాదలు ఎలా పాటించాలో ఆయన తన ప్రవర్తన ద్వారా చూపించారని సీఎం పేర్కొన్నారు.

రావుల సంతాపం

మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం పట్ల రాజ్యసభ మాజీ సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి ప్రగాఢ సంతాపం తెలిపారు. తాను 2002 నుండి 2008 వరకు రాజ్యసభ సభ్యునిగా, ఫ్లోర్ లీడర్‌గా తాను లేవనెత్తిన పలు అంశాలను ప్రస్తావిస్తూ... ఆయన చెప్పిన సమాధానాలు ఇంకా తనకు గుర్తున్నాయని పేర్కొన్నారు. అసమాన్య ఆర్థిక వేత్తను, పరి పాలన దక్షుడిని దేశం కోల్పోయిందని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్య లకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మరణం పట్ల పలువురు రాష్ట్ర కాంగ్రెస్ నేతలు సంతాపం తెలిపారు. టీపీసీసీ అధ్యక్షులు బొమ్మన మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, జూపల్లి క్రిష్టారావు, మాజీ ఎంపీ వి.హను మంతరావు, ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, చామల కిరణ్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమ, వ్యవసాయ, రైతు కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి, ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్నారెడ్డి, ఫిషరీస్ చైర్మెన్ మెట్టు సాయికుమార్, అధికార ప్రతినిధి చనగాని దయాకర్ సంతాపం ప్రకటించారు.

ఘనంగా బీఓఐ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు



నవతెలంగాణ - హైదరాబాద్

ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా సుల్తాన్‌బజార్‌లోని ఆ శాఖలో 50 ఏండ్ల వార్షికోత్సవ ఉత్సవాలను జరిపినట్టు తెలిపింది. ఈ సందర్భంగా పలువురు వినియోగదారుల మధ్య కేక్ కట్ సెలబ్రేట్ చేయడంతో పాటుగా పలువురు ఖాతాదారులను సత్కరించినట్టు వెల్లడించింది. వినియోగదారులకు అన్ని రకాల బ్యాంకింగ్ సేవలను అందించడానికి సిద్ధంగా ఉన్నామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారని పేర్కొంది.

వనం వీడి జనంలోకి రావాలి

- మావోయిస్టులకు ములుగు ఎస్పీ శబరీష్ పిలుపు
- వారి కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ



నవతెలంగాణ -తాడ్వాయి

అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టు కుటుంబాలను ములుగు ఎస్పీ శబరీష్ పరామర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న "పోరు కన్నా ఊరు మిన్న-మన ఊరికి తిరిగి రండి" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ములుగు జిల్లా ఎస్పీ శబరీష్ జిల్లాలోని పలువురు మావోయిస్టు నాయకుల కుటుంబాలను సందర్శించారు. తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన మావోయిస్టు నేతలు బడే చొక్కారావు అలియాస్ దామోదర్, గోవిందరావుపేట మండలం మొద్దులగూడెం గ్రామానికి చెందిన కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్.. కుటుంబ సభ్యులను ఎస్పీ కలిసి వారి కుటుంబ స్థితిగతులను తెలుసుకున్నారు. అనంతరం వారికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ విలేకర్లతో మాట్లాడుతూ.. మావోయిస్టులు వనం వీడి జనంలోకి రావాలని, వారిలో చాలా మందికి ఆరోగ్య సమస్యలు ఉన్నందువల్ల, ప్రస్తుతం మావోయిస్టు ఉద్యమం చివరి స్థాయికి చేరిందని అన్నారు. ఉద్యమాన్ని వదిలి జనజీవన స్రవంతిలో కలిసిపోయిన వారికి, వారి కుటుంబసభ్యులకు పోలీసులు అండగా ఉంటారని, పునరావాసం కింద రూ. 20 లక్షల రివార్డుతో పాటు ఇల్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చారు. మావోయిస్టులు లొంగిపోయిలే కుటుంబ సభ్యులు సహకరించాలని కోరారు. ఆయన వెంట ములుగు డీఎస్పీ నలువాల రవీందర్, పస్రా సీఐ గద్ద రవీందర్, స్థానిక ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సీఆర్పీఎఫ్ పోలీసులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

మిట్టి కేఫ్‌ను సందర్శించిన రాష్ట్రపతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో మిట్టి కేఫ్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సందర్శించారు. 15 మంది మానసిక, శారీరక, ఆరోగ్య వైకల్యం కలిగిన వ్యక్తులు దీనిని నిర్వహిస్తున్నారు. అధికారులు వీరికి నూతనంగా నిర్మించిన రిసెప్షన్ సెంటర్‌లో ఉచితంగా వసతి కల్పించారు. ఇటీవల శీతాకాల విడిది సందర్భంగా రాష్ట్రపతి మిట్టి కేఫ్ ను సందర్శించారు. ఈ కేఫ్‌కు తెలంగాణ సోషల్ ఇంపాక్ట్ గ్రూప్ చేయూతనందిస్తోంది. శారీరక, మానసిక వికలాంగులకు అవసరమైన నైపుణ్యాలను, శిక్షణను అందించుటకు ఏర్పడిన స్వచ్ఛంద సంస్థయే "మిట్టి కేఫ్". ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్, సుప్రీం కోర్టు కాంప్లెక్స్, పలు అంతర్జాతీయ విమానాశ్రయాలతో పాటు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన 40కి పైగా స్థలాలలో ఇలాంటి కేఫ్‌లు ఏర్పాటు చేసినట్టు నిర్వాహకురాలు స్వర్ణభ మిత్ర వివరించారు. ఈ కేఫ్‌లో ప్రత్యేకంగా నెలకొల్పిన స్టాల్‌లో అణగారిన వర్గాలచే ఆధునిక శైలిలో చేతితో రూపొందించిన అలంకరణ పరికరాలు, పిల్లల ఆట వస్తువులు, నోటు పుస్తకాలు, పెన్నులు విక్రయిస్తున్నారు. బొల్లారం లోని రాష్ట్రపతి నిలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన రిసెప్షన్ సెంటర్ భవనంలో రాష్ట్రపతి నిలయం అధికారులు ఉచితంగా కేటాయించిన స్థలంలో మిట్టి కేఫ్‌ను నెలకొల్పారు. వీరికి నెలకు (వారు చేసే విధులను బట్టి) రూ.15 వేల నుండి రూ.50 వేల వరకు వేతనంగా అందుతుంది. ఆర్థిక స్వావలంబన, ఆత్మ గౌరవంతో జీవించుటకు , కుటుంబాన్ని నడుపుటకు ఈ కేఫ్ అండగా ఉంటున్నట్టు నిర్వాహకులు తెలిపారు. వార్షికంగా రూ. 36-46 లక్షలు టర్నోవర్ సాధిస్తామని నిర్వాహకులు విశ్వాసం వ్యక్తం చేశారు.

నకిలీ సర్టిఫికెట్లను గుర్తించి తొలగించాలి

- వికలాంగుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కాటమోని వెంకటేష్ గౌడ్



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ వికలాంగుల సర్టిఫికెట్లతో లబ్ధి పొందుతున్న వారిని గుర్తించి వెంటనే తొలగించాలని వికలాంగుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కాటమోని వెంకటేష్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా చాలామంది దళారులు అధికారుల సహకారంతో నకిలీ సర్టిఫికెట్లను సృష్టించి ఆసరా పెన్షన్, వికలాంగుల పెన్షన్ పొందుతున్నారన్నారు. కొంతమంది అధికారులు లంచాలు తీసుకోని అనర్హులకు బోగస్ సదరం సర్టిఫికెట్లను జారీ చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేయూత పెన్షన్ త్వరలో రూ. 6వేలను విడుదల చేయనున్న క్రమంలో నకిలీ సర్టిఫికెట్లను తొలగించి అసలైన వికలాంగులకు న్యాయం చేయాలని కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
శనివారం | డిసెంబర్ 28, 2024 | www.navatelangana.com

ఆలయాల అభివృద్ధికి కృషి



నవతెలంగాణ-అంబర్‌పేట

ఆలయాల అభివృద్ధికి నిరంతర కృషి చేస్తున్నానని అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. శుక్రవారం అంబర్‌పేట డివిజన్ పరిధిలోని ప్రేమ్ నగర్‌లో ముత్యాలమ్మ, నల్ల పోచమ్మ ఆలయంలో 2025 ఆలయ క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ సమిష్టి కృషితో ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు నాగ శంకర్, పెంట యాదగిరి, ఆంధ్రపు నర్సింగ్ రావు, కంది నరసయ్య, గడ్డం మల్లేష్, పంది మల్లయ్య కోనేటి రాజు, అంజయ్య గుప్తా, పండారి తదితరులు పాల్గొన్నారు.

బుక్ ఫెయిర్ వేదికలు బిజీ బిజీ





నవతెలంగాణ ముషీరాబాద్

హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో రెండు వేదికలు పలు సాహితీ కార్యక్రమాలతో, పుస్తకావిష్కరణలతో కళకళలాడుతున్నాయి. వారం నుంచి క్రమం తప్పకుండా ప్రజల నుంచి భారీ స్పందన వస్తోంది. స్టాళ్లు పుస్తక ప్రియులతో నిండిపోతున్నాయి. మరో రెండు రోజుల్లో అంటే డిసెంబర్ 29న బుక్‌ఫెయిర్ ముగినుండటంతో పుస్తకప్రియులు ఈ రెండు రోజులూ బుక్ ఫెయిర్‌ను మరింత సద్వినియోగం చేసుకోవాలని బుక్ ఫెయిర్ అధ్యక్ష, కార్యదర్శులు యాకూబ్, ఆర్.వాసు కోరారు.

పుస్తకావిష్కరణలు, ఖవ్వాలి సంగీత ప్రదర్శనలు

37 వ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో పుస్తకాల పండగా జోరుగా సాగుతోంది. సాదిక్ వేదికపై పలు పుస్తకావిష్కరణలు జరిగాయి. సంధ్య విప్లవ్ రాసిన 'త్రికాల' పుస్తకాన్ని ప్రముఖ రచయిత సతీష్ చందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కాశీం ఆ పుస్తకాన్ని పరిచయం చేశారు. ఇదే వేదికపై జరిగిన శ్రీనివాస్ చక్రవర్తి రాసిన 'ఆల్బర్ట్ స్త్రైజర్ ఆత్మకథ' పుస్తకావిష్కరణ జరిగింది. బుక్ ఫెయిర్ వేదికగా జరిగిన ఖవ్వాలి సంగీత కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో శుక్రవారం తెలంగాణ బాలోత్సవ్ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం 1.00 గంటలకు కె.శాంతారావు నిర్వహణలో బాలల హక్కులు సెమినార్ జరిగింది. ఇంటర్నేషనల్ లయన్స్ లియో వేణుగోపాల్ నిర్వహణలో చిల్డ్రన్ స్పెషల్ డాన్సులు- పాటలు ఆహుతులను అలరించాయి. కమ్యూనిటీ బేస్డ్ కేర్ ప్రోగ్రాంలోని లెర్నింగ్ సెంటర్ పిల్లల నాటిక ప్రదర్శన ఆకట్టుకుంది. చదువు యొక్క ప్రాముఖ్య తను తెలిపే నాటికను పిల్లలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్, కో. ఆర్డినేటర్స్ చొక్కపు వెంకట రమణ, భూపతి వెంకటేశ్వర్లు, సమీర్, సుజావతి పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాల వారు రాయకపోతే సమాజానికి చాలా నష్టం



- అరుణిమ పుస్తకావిష్కరణలో వక్తలు

నవతెలంగాణ-ముషీరాబాద్

అట్టడుగున ఉన్న వర్గాల వాళ్ళు రాయకపోతే సమాజానికి చాలా నష్టం అని వక్తలు తెలిపారు. ఇందిరా పార్క్ ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో డాక్టర్ సంధ్య విప్లవ్ పుస్తకం, అరుణిమ చారిత్రాత్మక నవల పుస్తకాన్ని బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ బీఎస్ రాములు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యమాలు చేసిన కాలం నాటి రోజుల్ని ఈ పుస్తకం గుర్తు చేసింది. ఈ పుస్తకంలోని కథనం చాలా ఉద్వేగపూరితంగా సాగిందన్నారు. ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ అట్టడుగున ఉన్న వర్గాల వాళ్ళు రాయకపోతే సమాజానికి చాలా నష్టం అని ఒక స్త్రీ కలం పట్టడం, స్త్రీ జీవితాన్ని రాయడం సాధారణ విషయం కాదు. కన్నీరు పెట్టే ఏ స్త్రీ అయినా, ఓడిపోతున్నానే ఆగిపోయే ఏ స్త్రీ అయినా చదవాల్సిన పుస్తకం" అన్నారు. ఎన్ వేణుగోపాల్ మాట్లాడుతూ వరంగల్ నేపథ్యంలో సాగిన కథ ఇది. అంతే కాదు ఇది 70 నుంచి 80 ఏండ్ల సామాజిక చరిత్ర. వెనుకబడిన గిరిజన కుటుంబంలో పుట్టి ఉన్నత ఉద్యోగిగా ఎదిగిన మహిళ కథ ఇది. విప్లవోద్యమం, బంజారాల జీవితం, వివక్ష ఇలా సమస్త సామాజిక జీవితంలోని పార్శ్వాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కోయి కోటేశ్వరరావు, సంధ్య పీఓడబ్ల్యూ, భంగ్యా నాయక్, బండారు విజయ పాల్గొన్నారు.

మల్లెల తీర్థం మహా ఖననం పుస్తకావిష్కరణ



నవతెలంగాణ-ముషీరాబాద్

హైదరాబాద్ బుక్ ఫెయిర్ వేదికగా సిద్ధార్థ కవిత్వం మల్లెల తీర్థం మహా ఖననం పుస్తకాన్ని పీఓడబ్ల్యూ సంధ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంధ్య మాట్లాడుతూ సిద్ధార్థ అన్న ప్రేమతో నా చేత ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ ముఖచిత్రంలోనే ఎన్నో భావ విస్ఫోటనాలు కనిపిస్తున్నాయి. ఆయన సృష్టించే కవిత్వం అంతా ప్రజల కోసమే" అని అన్నారు. చిత్రకారుడు ఏలె లక్ష్మణ్ మాట్లాడుతూ సిద్ధార్థతో స్నేహం ఏర్పడి 35 ఏండ్లకు పైగా అవుతుంది. 35 ఏండ్ల ముందు ఎలా ఉన్నాడో ఇప్పుడు కూడా అలాగే ఉన్నారు. సిద్ధార్థ సంపూర్ణమైన కవి. ఈ కవితలు చూస్తుంటే నా పెయింటింగ్ గుర్తొస్తున్నాయని తెలిపారు. బి.ఎస్. రాములు మాట్లాడుతూ తెలంగాణ భాషను అద్భుతంగా కవిత్వరీకరించారన్నారు. కవి సిద్ధార్థ మాట్లాడుతూ ఇంత మంది హేమాహేమీల మధ్య ఈ పుస్తకం రావడం కన్నా గొప్ప సందర్భం ఏదీ ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో పాశం యాదగిరి, బి.ఎస్. రాములు, కె. ఆదిత్య, అంబటి సురేంద్ర రాజు, హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులు కవి యాకూబ్ పాల్గొన్నారు.

జనవరి 3న సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

వచ్చేనెల 3న సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కొత్తపల్లి బాయమ్మ, ఉపాధ్యక్షులు వడ్ల అరుణ, అప్సర, షేక్ షకీనా బి తెలిపారు. శుక్రవారం తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి ఆధ్వర్యంలో హనుమాన్ టెక్డిలోని బీసీ సాధికారత భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. వచ్చే నెల 3న బీసీ భవన్‌లో సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున మహిళలు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర అధ్యక్షులు బెల్లాపు దుర్గారావు, ప్రధాన కార్యదర్శి కీర్తి యుగంధర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ సయ్యద్ భాష, రాష్ట్ర ఫైనాన్స్ కమిటీ చైర్మెన్ అహ్మద్ హుస్సేన్, మురహరి శ్రీధర్, గ్రేట్ హైదరాబాద్ అధ్యక్షులు సంఘ వీరప్ప, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులు వడ్ల అరుణ, అప్సర, షేక్ షకీనా బి, ఫర్హానా, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బాబా ఫక్రుద్దీన్, తదితరులున్నారు.

29న పూర్వ అధ్యాపక విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-మెహిదీపట్నం

విజయనగర్ కాలనీలోని విజయనగర్ కాలేజ్ ఆఫ్ కామర్స్ కళాశాల పూర్వ ఎకనామిక్స్ అధ్యాపకురాలు భవాని దేవి గౌరవార్థం కళాశాల పూర్వ అధ్యాపక, విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఈనెల 29న నిర్వహించనున్నట్లు సభ నిర్వాహకులు డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. భవానీ దేవి కళాశాల అధ్యాపకురాలుగా ఎన్నో ఏండ్లుగా పనిచేసి ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దినట్లు ఆయన తెలిపారు. 29న మాసబ్ ట్యాంక్‌లోని మహవీర్ ఆస్పత్రి ఎదురుగా ఉన్నటువంటి జేఎన్టీయూ ఆడిటోరియంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం వరకు ఆమె ఆధ్వర్యంలో ఈ ఆత్మీయ సమ్మేళనం జరగనున్నట్లు ఆయన చెప్పారు. సుమారు 1000 మంది పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు ఈ సమ్మేళనంలో పాల్గొంటారని ఆయన వివరించారు. ఈ సందర్భంగా 1973 నుండి 2024 వరకు వివిధ ప్రాంతాలలో స్థిరపడిన కళాశాల పూర్వ విద్యార్థులు అధ్యాపకులు ఈ సమ్మేళనానికి హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి

- కార్పొరేటర్ ఇ.విజయకుమార్ గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

స్థానిక సమస్యల పరిష్కారా నికి నిరంతరం కృషి చేస్తున్నానని అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. శుక్రవారం అంబర్‌పేట డివిజన్ పరిధిలోని పటేల్‌నగర్, ప్రేమ్ నగర్ తదితర ప్రాంతాలలో పాదయాత్ర నిర్వహించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకొని ఆయన మాట్లా డుతూ విద్యుత్ లైట్లు, డ్రయినేజీ సమస్యపై త్వరలోనే అధికారంతో సమావేశం నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తాన న్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ పెద్దలు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

హమాలీల లైసెన్సులు రెన్యువల్ చేయాలి



నవతెలంగాణ-మెహిదీపట్నం

గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీల లైసెన్స్ రెన్యువల్ చేయాలని గుడిమల్కాపూర్ హమాలీ యూనియన్ సంఘం గౌరవ అధ్యక్షులు విట్టల్, సంఘం అధ్యక్షులు రాములు డిమాండ్ చేశారు. హమాలీలకు లైసెన్స్‌లు ఇచ్చి ఎనిమిది సంవత్సరాలు అవుతుందని హమాలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కావున ప్రభుత్వం వెంటనే వారి లైసెన్స్‌లు రెన్యువల్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్‌కు విజ్ఞప్తి పత్రం సమర్పించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గగన్ మహల్ వద్ద ఓ వృద్ధుడు పడి ఉన్నాడు. డయల్ 100 ఫోన్ రావడంతో అబిడ్స్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని అతనిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు అడ్మిన్ ఎస్ఐ బి. శైలజ తెలిపారు. తెలిపిన వివరాల ప్రకారం.. అబిడ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గగన్ మహల్ వద్ద ఓ వృద్ధుడు పడి ఉన్నట్లు డయల్ 100కు ఫోన్ వచ్చిందన్నారు. అతనికి ఉస్మా నియా ఆస్పత్రి వైద్యులు చికిత్స అందించారని చికిత్స పొందుతూ అతను మృతి చెందినట్లు తెలిపారు. మృతిని వయసు 65 ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరచినట్లు తెలిపారు. మృతుని సంబంధీకులు ఎవరైనా ఉంటే అబిడ్స్ పోలీస్‌స్టేషన్ 8712 660110,8712661243 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

'జలమండలి ఉద్యోగుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లండి'

ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డికి ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి విజ్ఞప్తి



నవతెలంగాణ-హిమాయత్ నగర్

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న జలమండలి ఉద్యోగుల సమస్యలను సీఎం ఎ.రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జలమండలి కంగర్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వేం నరేందర్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి శాలువా, పూలమాలలతో మొగుళ్ళ రాజిరెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 11 సంవత్సరాల నుండి జలమండలి కార్మిక ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వేతనాల పెంపుదలతో పాటు అనేక మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాల దేనని రాజిరెడ్డి గుర్తు చేశారు. జలమండలి ఉద్యోగులందరికీ ఉచిత హెల్త్‌కార్డులు జారీ చేయాలని ఐఎన్‌టీయూసీ జలమండలి కంగర్ యూనియన్ విజ్ఞాపన పత్రం సీఎం రేవంత్ రెడ్డి కార్యాలయానికి చేరిందని, సీఎంతో మాట్లాడి సానుకూల నిర్ణయం తీసుకుని ఉచిత హెల్త్ కార్డుల జారీ పక్రియ త్వరితగతిన చేపట్టాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ఐఎన్‌టీయూసీ నేతలు చక్రధర్ రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేవలం ఆర్టీసీ బస్సులతోనే కాలుష్య నియంత్రణ సాధ్యమవుతుందా



- వీఎస్ రావు
- గోడపత్రికను ఆవిష్కరించిన టీజీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్

నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ జోన్‌లోని అన్ని డిపోలల్లో విద్యుత్ బస్సులను తీసుకుని రావాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. దాంతో 'విద్యుత్ బస్సులు ప్రజలు ఆర్టీసీలపై ప్రభావం' అనే అంశంపై జనవరి 6న జరిగే రాష్ట్ర సదస్సు గోడపత్రికను టీజీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ గ్రేటర్ హైదరాబాద్ జోన్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ.ఎస్ రావు మాట్లాడుతూ కాలుష్య నియంత్రణ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఆర్టీసీలో ప్రయివేట్ ఆపరేటర్లతో విద్యుత్ బస్సులను నడపాలని చూస్తోందన్నారు. కాలుష్య నియంత్రణ మేము కోరుకుంటున్నామని, కేవలం ఆర్టీసీలో ప్రవేశపెట్టే బస్సుల ద్వారానే కాలుష్య నియంత్రణ సాధ్యవుతుందా అని ప్రశ్నించారు. హైదరాబాదులో తిరిగే వివిధ ప్రయివేట్ వాహనాల ద్వారా కాలుష్య పరిస్థితి ఏంటి అని అన్నారు. విద్యుత్ బస్సులు ఆర్టీసీలో ప్రవేట్ ఆపరేటర్లతో నడపడం వల్ల మెకానికులు డ్రైవర్లు పెద్ద మొత్తంలో మిగులు తేలుతారని, వారు ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ వయాబిలిటీ ఫండ్ ఇవ్వాలన్నారు. విద్యుత్ బస్సుల విధానంలో కేంద్ర ప్రభుత్వం సవరణ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వమే విద్యుత్ బస్సులు కొని దామాషా పద్ధతిలో ఆర్టీసీలకు ఇవ్వాలన్నారు. 6న జరగబోయే రాష్ట్ర సదస్సులో ఆర్టీసీ మెకానికులు డ్రైవర్లు కండక్టర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ గ్రేటర్ హైదరాబాద్ జోన్ అధ్యక్ష కార్యదర్శులు పీ. చంద్రప్రకాష్, జీఆర్ రెడ్డి హైదరాబాద్ ఎస్‌డబ్ల్యూఎఫ్ రీజియన్ కార్యదర్శి ఎస్ కష్ణ, బర్కత్‌పూర డిపో సెక్రెటరీ కె.ఆర్.రెడ్డి, రాణిగంజ్ డిపో నాయకులు యాదగిరి, బర్కత్‌పుర నాయకులు వెంకటేష్, ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు ఎస్బిచారి, సీఐటీయూ నాయకులు కుమారస్వామి పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మెదడుకు పదును



- లయన్ మోహన్ దాస్ డిస్ట్రిక్ట్ లియో చైర్మెన్ 320ఏ

నవతెలంగాణ సిటీబ్యూరో

పుస్తక పఠనంతో మెదడుకు పదును పెరుగుతుందని డిస్ట్రిక్ట్ లియో చైర్మెన్ 320ఏ లయన్ మోహన్ దాస్ అన్నారు. నవభారత లయన్స్ క్లబ్, చొక్కాపు వెంకటరమణ, డా.హిప్నో పద్మా కమలాకర్ ఆధ్వర్యంలో 37వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ బొంబాయి విజయ భారతి వేదిక మీద ప్రభుత్వ వసతిగృహంలో నివసిస్తున్న ప్రత్యేక అవసరాలున్న బాల బాలికలు దేశ భక్తి పాటలు, డ్యాన్సలతో అలరించారు. చక్కగా ప్రదర్శించిన బాల కళాకారులుకు లయన్ మోహన్ దాస్, లయన్ డా.జి.మహేంద్రకుమార్ రెడ్డి, చొక్కాపు వెంకట రమణ, డా.రమేష్‌కుమార్, జి.కృష్ణ వేణి, శాతరావు, శ్యామల, డా.హిప్నో పద్మా కమలాకర్ బహుమతులు, పుస్తకాలు, కేకులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం జీవితంలో అత్యంత ప్రభావవంతమైన అలవాటుగా నిలుస్తుందన్నారు. ఇది కేవలం కాలక్షేపమే కాకుండా శక్తివంతమైన సాధనంగా పనిచేస్తుందని చెప్పారు. పుస్తక పఠనంతో మనం పొందే ప్రయోజనాలు అన్నిటికంటే విలువైనవన్నారు. ప్రతి రోజు కనీసం 30 నిమిషాలు పుస్తకాలు చదవాలని సూచించారు. మొదటి వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డా. జి.మహేంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ పఠనంతో ఆలోచనా శక్తి పెరుగుతుందన్నారు. చదవడం ద్వారా పిల్లల్లో సృజనాత్మక ఆలోచనల తీరులు విస్తరిస్తాయని చెప్పారు. కథలు, కవితలు, పరిశోధనల చదివితే మెదడుకు కొత్త ఆలోచనల వస్తాయన్నారు. మంచి పుస్తకం మనసుకు తృప్తినిచ్చి మానసిక ఒత్తిడిని తగ్గిస్తుందన్నారు. విశ్లేషణాత్మక ఆలోచనా విధానం అభివృద్ధి చెందుతుందన్నారు. స్టాల్ నెం.245 లో బుక్ లవర్స్ అడిగిన ప్రశ్నలకు చక్కని అవగాహన కల్పించారు. చొక్కాపు మాట్లాడుతూ మేధస్సు మెరుగుపడుతుందన్నారు. ఇది జ్ఞాపకశక్తి మెరుగుపరచడంతో పాటు, నిర్ణయాలు తీసుకోవడంలో స్పష్టతను పెంచు తుందన్నారు. డా.హిప్నో పద్మా కమలాకర్ మాట్లాడుతూ పుస్తకం ఎంత అద్భుతంగా కనిపించినా, అందులో అక్షరాలు లేకపోతే అది కేవలం అలంకారమే అవుతుందన్నారు. మనిషి ఎంత అందంగా ఉన్నా మేధస్సులో జ్ఞానం లేకపోతే జీవితంలో విలువను సంతరించుకోలేడన్నారు. పుస్తకాలు చదవడం మన ఆలోచనలను విశాలంగా మార్చి, మనిషిని నిజమైన వ్యక్తిగా తీర్చిదిద్దుతుందని తెలిపారు. పుస్తకాలను ప్రేమించండి, చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. ఒక నిమిషం పాటు ఆర్థిక వేత్త మన్మోహన్ సింగ్‌కి శ్రద్ధాంజలి ఘటించారు.

దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన మహనీయుడు మన్మోహన్

ఉద్యమ నాయకుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తుమ్మల ప్రఫుల్ రామ్ రెడ్డి



నవతెలంగాణ-ముషీరాబాద్

దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన మహనీయుడు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అని ఉద్యమ నాయకుడు కాంగ్రెస్ సీనియర్ నాయకులు తుమ్మల ప్రఫుల్ రామ్ రెడ్డి అన్నారు. ఆయన మృతి దేశానికి తీరని లోటని గాంధీ నగర్‌లోని త్యాగరాయ గానసభ చౌరస్తా వద్ద మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని ఆర్థికంగా కొత్త పుంతలు తొక్కించిన నేత మన్మోహన్ సింగ్ అని అన్నారు. భారత దేశ ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలకు ఆద్యులు అని, రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా, యూజీసీ చైర్మెన్‌గా విశిష్ట సేవలందించి ఆయన ఆర్థిక మంత్రిగా కూడా సేవలు అందించారన్నారు. ఆయన హయాంలో చేపట్టిన సంస్కరణల వల్ల మన ఆర్థిక వ్యవస్థ కొత్త పుంతలు తొక్కిందని ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమైనవి తెలిపారు. రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించి, మన రాష్ట్ర ఆవిర్భావానికి కృషి చేశారని, విద్యా హక్కు చట్టం, సమాచార హక్కు చట్టం, ఆహార భద్రత చట్టం, ఉపాధి హామీ చట్టం వంటి కీలక నిర్ణయాలు ప్రధాని మన్మోహన్ సింగ్ కాలంలోనే అమల్లోకి వచ్చాయని తెలిపారు. నేడు భౌతికంగా మన్మోహన్‌సింగ్ మనకి దూరమైన, ఆయన ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకు కాంగ్రెస్ కార్యకర్తలందరం పునరంకితమవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డం రాజేష్, ఏలూరి భాస్కర్ రెడ్డి, హరికృష్ణ అనిల్, తదితర నాయకులు పాల్గొన్నారు.

మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మృతి చాలా బాధాకరం

నవతెలంగాణ-అంబర్‌పేట

గొప్ప ఆర్థిక వేత్త, సంస్కరణ వాదిని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పార్లమెంట్‌లో బిల్లు వచ్చినప్పుడు తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చ విధంగా ప్రయత్నించారని టీజీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం బి కృష్ణ యాదవ్, కార్యదర్శి ఏమే ఖాదర్ అన్నారు. ఈ సందర్భంగా మన్మోహన్ సింగ్ మృతి పట్ల ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశన్న అసోసియేట్ ప్రెసిడెంట్ డాక్టర్ సురేందర్, డాక్టర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

'పార్లమెంట్‌లో బీసీ బిల్లుపై చంద్రబాబు ఒత్తిడి పెంచాలి'

- కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రత్వ శాఖ పెట్టాలి
- ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, బీసీల పక్షాన నిలబడి బీసీ బిల్లు పెట్టిస్తే చంద్రబాబు నాయుడు చరిత్రలో నిలిచిపోతారని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం అభిప్రాయ పడింది. సంఘం మహిళ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు ఎనుగాల నూకలమ్మ అధ్యక్షతన శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సంఘం ఏపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరై నూతనంగా సంఘం ఏపీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియామకమైన మద్దుల వెంకట కోటేశ్వరరావుకు నియామకపత్రం అందజేసి, ఆయనను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్రంలో బీసీలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక అభివృద్ధికి కార్యక్రమాలు చేపట్టడానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కోరారు.ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ మాదిరిగా బీసీలకు సామాజిక రక్షణ, భద్రత కల్పించడానికి 'బీసీ యాక్ట్' ను తీసుకురావాలని, కేంద్రం, రాష్ట్రాల్లో విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను బీసీల జనాభా దమాషా ప్రకారం 27 శాతం నుండి 56 శాతంకు పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు కేటాయించాలని, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 20 నుంచి 40 శాతానికి పెంచాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ, ఉపాధ్యక్షులు అంగిరేకుల వరప్రసాద్, ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కన్నిశెట్టి లక్ష్మణ్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ అంగిరేకుల ఆదిశేషు, సెక్రటరీ జనరల్ రమణరాజు, మహిళా విభాగం రాష్ట్ర నేతలు దేవమ్మ, నాగేశ్వరి, జ్యోతి, వకుల, పలు జిల్లాల నాయకులు చక్రధర్, ఎల్.పి.ప్రసన్నకుమార్, జగదీష్, శివరాం, కోటయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

8

మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్

శనివారం | డిసెంబర్ 28, 2024 | www.navatelangana.com

డ్రయినేజీ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని వినాయక్ నగర్ నగర్ కాలనీలోని వీధి నంబరు 23వ లైన్ లో డ్రయినేజీ, వీధిలైట్లు పలు సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు విష్ణుమూర్తి గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే స్పందిస్తూ కాలనీలోని సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మల్కాజిగిరి నియోజకవర్గం ఇన్‌చార్జి బద్దం పరశురాం రెడ్డి, వినాయక్ నగర్ డివిజన్ కార్యదర్శి బాలకృష్ణ గుప్తా, నాయకులు ఫరీద్, రమేష్, రాజశేఖర్ రెడ్డి, కాలనీ వాసులు బాల నరసింహ, శ్రీకాంత్ గౌడ్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



మాజీ ప్రధాని కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం దేశానికి, కాంగ్రెస్ పార్టీకి తీరని నష్టమని కాంగ్రెస్ యువజన విభాగం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం తరుణ్ గౌడ్ అన్నారు. శుక్రవారం న్యూ ఢిల్లీలో మన్మోహన్ సింగ్ పార్థివ దేహానికి నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఈ దేశాన్ని అత్యంత వైభవంగా పాలించడమే కాకుండా దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో సంస్కరణకర్తగా దేశాన్ని గడ్డు పరిస్థితుల నుండి కాపాడిన మేధావి అన్నారు. -నవతెలంగాణ,బోడుప్పల్

పక్కా ప్రణాళికలతో డివిజన్‌ను అభివృద్ధి



- డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్
- పాపయ్య నగర్‌లో రూ.5 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం

నవతెలంగాణ - జవహర్ నగర్

పక్కా ప్రణాళికలతో అన్ని డివిజన్లను అభివృద్ధి చేస్తానని జవహర్ నగర్ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం 8వ డివిజన్‌లోని పాపయ్య నగర్ కాలనీలో కాలనీవాసుల సొంత నిధులతో డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ సహకారంతో రూ.5 లక్షలతో 170 మీటర్ల డ్రయినేజీ పైపులైన్ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ 8వ డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని, డివిజన్‌లో ఉన్న అన్ని కాలనీలను అభివృద్ధి పదంలో ముందుకు తీసుకువెళ్తానన్నారు. సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తానని, చెప్పారు. రాబోయే రోజుల్లో డివిజన్‌కు మరిన్ని నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పథంలో తీసుకువెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో భారతి, రమేష్, కుమార్, రాజయ్య, సిద్ధులు, కృష్ణ, మల్లేష్, ప్రసాద్, పర్వేజ్, సుమలత, యాకోబి, తిరుపతి, నర్సింహులు, సుజాత, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

గంగి మల్లేష్‌కు భారత విభూషన్ అవార్డు



నవతెలంగాణ-కీసర

హైదరాబాద్ రవీంద్రభారతిలో వల్లూరి ఫౌండేషన్, శ్రీ ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కీసర మండలం, రాంపల్లిదాయార మాజీ సర్పంచ్ డాక్టర్ గంగి మల్లేష్‌కు భారత విభూషన్ అవార్డును అందజేశారు. వల్లూరి ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీనివాసరాజు మాట్లాడుతూ..వివిధ రంగాలలో పనిచేస్తున్న వ్యక్తులను గుర్తించి వారికి అవార్డు ప్రదానం చేయడం ఎంతో గర్వకారణంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా విచ్చేసిన దైవజ్ఞశర్మ మాట్లాడుతూ.. సమాజ సేవలో తన వంతు సేవ చేయాలని చిన్న వయసులోనే దేశంలో మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న శ్రీనివాసరాజుకు అభినందనలు తెలిపారు. కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి మాట్లాడుతూ..చిన్న వయసు నుంచి శ్రీనివాసరాజు అన్ని రంగాలలో ముందుంటూ సమాజ సేవకు సైతం మొదటి స్థానంలో ఉంటున్నారని కొనియాడారు. భారత విభూషన్ అవార్డు గ్రహీత గంగి మల్లేశం మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా సమాజ సేవ చేస్తున్న తనకు ఈ అవార్డు అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు.

ఘనంగా అయ్యప్ప మండల పడిపూజ



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

కమలానగర్‌లోని అయ్యప్ప స్వామి టెంపుల్‌లో జరిగిన అయ్యప్ప మండల పూజ, కావడి పూజ కార్యక్రమాలను అయ్యప్ప స్వామి నామస్మరణతో హెూరెత్తింది. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా అయ్యప్ప స్వామి టెంపుల్ చైర్మెన్ ఎస్ఆర్ ప్రసాద్‌తో పాటు అయ్యప్ప స్వామి మాలదారులు పెద్ద ఎత్తున పాల్గొని మహా మండల పడిపూజను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వంశీ, రాజు తుపాకుల, త్యాగరాజు, సాయి, నాగరాజు, తదితరులున్నారు.

పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్ సాయిబాబా నగర్‌లో గల శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం షష్టిమ వార్షికోత్సవం, పడి పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డిలు పాల్గొన్నారు. మహా పడిపూజను వైభవంగా నిర్వహించారు. స్వామియే శరణం అయ్యప్ప.. శరణం శరణం అయ్యప్ప.. అంటూ అయ్యప్ప స్వామి నామస్మరణతో ఆలయ పరిసరాల్లో మార్మోగింది. ఈ మహపడిపూజకు అయ్యప్ప స్వాములు, భక్తులు భారీ సంఖ్యలో హాజరై భజన పాటలు, భక్తి గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో బైరీ నవీన్ గౌడ్ మాణెమ్మ, సతీష్ రెడ్డి, అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు.

చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయొద్దని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు



నవతెలంగాణ-కాప్రా

కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు కాప్రా సర్కిల్ పరిధిలో ప్రజలు ఎక్కడపడితే అక్కడ బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దని కాప్రా డివిజన్‌లోని పలు సర్కిల్స్‌లో అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగానే శుక్రవారం ఈసీఐఎల్ ఎక్స్ రోడ్డు, రాధిక ఎక్స్ రోడ్డు, జీఆర్ రెడ్డి నగర్ ఎక్స్ రోడ్లలో బహిరంగా ప్రదేశాల్లో చెత్త వేయకూడదని హెూర్డింగ్‌లు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కట్టారు. కాప్రా చౌరస్తా, ఎల్లారెడ్డి గూడ చౌరస్తా, వంపుగూడ చౌరస్తా, నేతాజీ నగర్ చౌరస్తా, బీ కందిగూడ చౌరస్తా, నిర్మల్ నగర్ చౌరస్తా, సైనిక్పురి చౌరస్తా, చక్రిపురం ఎక్స్ రోడ్ చర్లపల్లి ఎక్స్ రోడ్డు, ఎన్ఎఫ్‌సి చౌరస్తా, అశోక్ నగర్ చౌరస్తా, కుషాయిగూడ వెజిటేబుల్ మార్కెట్, బస్టాండ్ హెచ్ బీ కాలనీ, ఎన్టీఆర్ సర్కిల్ ఎక్స్ రోడ్డు, మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్, నాచారం ఎక్స్ రోడ్డు, హబ్సిగూడ ఎక్స్ రోడ్డు, హెచ్ఎంటి చౌరస్తా, బాబా నగర్ చౌరస్తా వంటి 50 ప్రదేశాలను ఎంపిక చేసి ఫ్లెక్సీలను ఏర్పాటు చేయనున్నట్టు అధికారులు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే రూ.1000 ఫెనాల్టీ విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, తజవాన్ రామకృష్ణ, ఎస్ .ఎఫ్ .ఏ శివ కృష్ణ. కే .లక్ష్మి, శిరీష, ఇన్చార్జ్ ఎస్. ఎఫ్ .ఏ అంజలి పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.

ఆర్‌యూబీ బ్రిడ్జి నిర్మాణం త్వరగా చేపట్టండి

- రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌జైన్‌కు వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి
- ఆర్‌కేపురం ఫ్లైఓవర్‌కు అదనంగా రెండు లైన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తాం
- రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ జైన్





నవతెలంగాణ-నేరేడ్‌మెట్

వాజ్‌పేయి నగర్, గౌతమ్ నగర్‌ల ఆర్‌యూబీ బ్రిడ్జిల నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సౌత్ సెంట్రల్ రైల్వే శాఖ పరిధిలోని సికింద్రాబాద్ రైల్ నిలయంలోని రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ జైన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆర్‌యూబీ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బ్రిడ్జిల నిర్మాణం కోసం రైల్వే అధికారులు సహకారం ఎంతో ఉందన్నారు. అందుకు మల్కాజిగిరి ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిజేస్తున్నానని చెప్పారు. ఆర్.కె పురం ఫ్లై ఓవర్ అదనంగా రెండు లైన్లను నిర్మించాలని, తుర్కపల్లి ఆర్‌యూబీ నిర్మాణం కోసం అన్ని అనుమతులు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా లభించాయని రైల్వే శాఖ పనులు త్వరగా ప్రారంభించాలని, బొల్లారం బజార్ కొత్త బస్తీ ప్రాంతంలో రైల్వే స్థలంలోని నాలా సమస్యను టన్నెల్ విస్తరించి పరిష్కరించాలని రైల్వే జనరల్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు.

ఆలయాలను కూల్చే ఆలోచనను విరమించుకోవాలి

రైల్వే అభివృద్ధి పనుల్లో భాగంగా ఆలయాలను కూల్చే ఆలోచనను రైల్వే అధికారులు విరమించుకోవాలని ఎమ్మెల్యే అధికారులను కోరారు. గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని మిర్జాల గూడలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ టెంపుల్, మల్కాజిగిరిలోని రైల్వే క్వార్టర్స్ దుర్గామాత టెంపుల్ దశాబ్దాలుగా క్రితం ప్రతిష్టించారని, ఈ ఆలయాలను కూల్చేయాలని రైల్వే అధికారులు నోటీసులు జారీ చేయడంతో స్థానిక ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చారని రైల్వే జనరల్ మేనేజర్‌కు తెలిపారు. దశాబ్దాలుగా అక్కడి ప్రజలు నమ్మకంగా అమ్మవార్లను కొలవడం, బోనాల పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నదని, ప్రజల నమ్మకాన్ని, విశ్వాసాన్ని కాపాడాలని, ఆలయాలను కూల్చే ఆలోచన విరమించుకోవాలని కోరారు. వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని కేశవ్‌నగర్‌లో రైల్వే స్థలం ప్రహరీ గోడను ఆనుకుని ఉన్న చిన్నపాటి స్థలంలో స్థానిక పేద మహిళలు కుట్టు మిషన్ ఏర్పాటు చేసుకుని జీవనోపాధి సాగిస్తున్నారని, ఆ స్థలాన్ని ఖాళీ చేయాలని రైల్వే అధికారులు బోర్డు ఏర్పాటు చేశారని, మహిళలకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. అనంతరం రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ జైన్ మాట్లాడుతూ..త్వరలోనే వాజ్‌పేయి నగర్, గౌతమ్ నగర్ ఆర్‌యూబీ పనులు త్వరలోనే ప్రారంభం అవుతాయన్నారు. ఆర్.కే పురం ఫ్లై ఓవర్‌కు అదనంగా రెండు లైన్ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, ఈఆర్ఎస నాయకులు డోలి రమేష్, అనిల్ కిషోర్ గౌడ్, జీ.కే.హనుమంతరావు, చిన్న యాదవ్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళి



నవతెలంగాణ - జవహర్‌నగర్

భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి దేశానికి, కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని జవహర్ నగర్ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్‌రెడ్డిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మన్మోహన్ సింగ్ అకాల మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్త చేస్తూ ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ..ఆయన దేశానికి చేసిన సేవలు అమూల్యమైనవని కొనియాడారు. ఆర్థిక సంస్కరణల ఆద్యుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గొడుగు వేణు, కుతాడి సాయి, పానుగంటి బాబు, ప్రేమల శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యులు శ్వేతా ముఖేష్ నాయకులు మనోధర్ రెడ్డి, బల్లి శ్రీనివాస్, కృష్ణా గౌడ్, మెట్టు వెంకన్న, మంజుల, గజ్వేల్ శంకర్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాప్రాలో..

మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి పట్ల సంతాపం తెలియజేస్తూ శుక్రవారం కాప్రా డివిజన్ మండల ఆఫీస్ దగ్గర మన్మోహన్ సింగ్ చిత్రపటానికి కాప్రా డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొబ్బరినూరి నాగ శేషు, కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణా శివమణి, కాప్రా డివిజన్ కార్యకర్తలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మెన్ మేడ్చల్ విట్టల్ నాయక్, శ్రీకాంత్ రాజన్, మురళి, సతీష్ యాదవ్, శ్యామ్ చారి, జగదీష్ ముదిరాజ్, పవన్ కుమార్, మల్లారెడ్డి, బాబురావు, ప్రశాంత్‌గౌడ్, సత్యనారాయణ, శ్రీహరి, అరుణ్, సంతోష్ చారి, సంతోష్, కాప్రా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..



15 ఏండ్లు ప్రధాని, ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న కాలంలో కేవలం ఒక్క రూపాయి మాత్రమే జీతం తీసుకున్న నిరాడంబర ప్రధాని మన్మోహన్ సింగ్ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీఎస్. బోస్ అన్నారు. మన్మోహన్ సింగ్ (92) ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ మరణించడంతో సీపీఐ కాప్రా సమితి ఆధ్వర్యంలో ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీ.ఎస్. బోస్ మాట్లాడుతూ యూపీఏ హయాంలో పదేళ్ల పాటు మన్మోహన్ సింగ్ ప్రధానిగా సేవలు అందించారాని కొనియాడారు. తాను జీవితాంతం నిరాడంబర జీవితాన్ని గడిపారని, దేశానికి 15 ఏండ్లు ప్రధాని, ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న కాలంలో కేవలం ఒక్క రూపాయి మాత్రమే జీతం తీసుకున్నారని గుర్తు చేశారు. గౌరవప్రదమైన నడవడిక, ప్రజాసేవ పట్ల నిబద్ధత, అపారమైన జ్ఞానం, వినయం మన్మోహన్ సింగ్ చరిత్ర అని కొనియాడారు. ఆర్థిక సంస్కరణలు, రాజకీయ స్థిరత్వం, ప్రతి భారతీయుడి జీవితాన్ని ఉద్ధరించడానికి అంకితభావం, దేశ వారసత్వ మార్గాన్ని చూపారన్నారు. సాంఘిక సంక్షేమంపై దృష్టి సారించి, ప్రపంచ పటంలో భారతదేశ స్థానాన్ని పటిష్టం చేయడంతో ఆర్థిక శ్రేయస్సు కోసం ఆయన మొదట టెక్నోక్రాట్‌గా, తర్వాత ప్రధానిగా ఆయన పదవీకాలం గుర్తుండిపోతుందని తెలిపారు. నాయకుడిగా, డాక్టర్ మన్మోహన్ సింగ్ నిర్ణయాలు భారతీయ సమాజంలోని ప్రతి అంశంపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. రాజకీయ మిత్రులు, ప్రత్యర్థులు మరియు ప్రపంచ నాయకుల నుండి అతను సంపాదించిన విశ్వాసం, గౌరవం అతడిలోతైన ప్రభావానికి నిదర్శనం అన్నారు. రాజనీతిజ్ఞుడు, పండితుడు, నాయకుడు, దూరదృష్టి గలవాడు - భారతదేశం గర్వించదగ్గ కుమారులలో ఒకరు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జీ. దామోదర్ రెడ్డి, సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్ రావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర,ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్,సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు నారా నర్సింహా,సాయి, ప్రసాద్, మురళి, కీర్తన్ తదితరులు పాల్గొన్నారు.

పత్తికుమార్ నివాళి



మాజీ ప్రధానమంత్రి డా. మన్మోహన్ సింగ్ (92) అస్తమయం దేశానికి తీరని లోటు, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని వారి చిత్ర పటానికి నివాళులర్పించిన టీపీసీసీ ఎస్సీసెల్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు పత్తి కుమార్, ఎస్సీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మెన్ వినోద్ సింగ్ వాల్మీకి తదితరులు ఉన్నారు.

నేరేడ్‌మెట్‌లో..



మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు శుక్రవారం నేరేడ్‌మెట్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటని, భారత దేశానికి ఇచ్చిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని, ప్రధానమంత్రిగా ఆయన చూపించిన నిజాయితీ, నైపుణ్యం, సమర్థత దేశాన్ని ఆర్థిక వృద్ధి దిశగా నడిపించాయని తెలిపారు. ఈ కార్యక్రమం చంద్రశేఖర్, వెంకటేష్ యాదవ్,బి కే శ్రీను, చంద్రశేఖర్, ఇందిరా, చెన్నా రెడ్డి, యాది, మహేష్, బబులు, రఘవన్, సంతోష్, శంకర్ రావు, నంద్యాల కృష్ణ, బాలరాజు, దుర్గా రెడ్డి, కొటేశ్వరి, ఆశ, మహాలక్ష్మి పాల్గొన్నారు.

మేడ్చల్‌లో..



మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల మేడ్చల్ మండల కాంగ్రెస్ నాయకులు మేడ్చల్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మన్మోహన్ సింగ్ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్ రావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రమణా రెడ్డి,మున్సిపాలిటీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లవంగు రాకేష్,మర్రి నర్సింహ రెడ్డి,వైస్ చైర్మన్ చీర్ల రమేష్,కౌన్సిలర్లు కొడే మహేష్, రాయ్యపల్లి మల్లేష్ గౌడ్,వీరమల్ల శ్రావణ్ కుమార్ గుప్తా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేగు రాజు, సీనియర్ నాయకులు సింగిరేణి పోచయ్య, నాగభూషణం, ఉదండపురం సత్య నారాయణ, గర్దాస్ నరేందర్,దుర్గం వెంకటేష్ ముదిరాజ్, రాజశేఖర్ రెడ్డి, చెర్వుకొమ్ము శేఖర్ గౌడ్, గర్దాస్ నరేందర్,రామన్నగారి సంతోష్ గౌడ్, ధాత్రిక లింగం వంజరి, దుబ్బ రామస్వామి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చర్లపల్లిలో..

మన్మోహన్ సింగ్‌కు చర్లపల్లి కార్పొరేటర్



బొంతు శ్రీదేవి యాదవ్ ఆధ్వర్యంలో కుషాయిగూడ బస్టాండ్‌లో ఆయన చిత్రపటానికి పూల దండ వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీదేవి యాదవ్ మాట్లాడుతూ.. మన్మోహన్ సింగ్ ఆర్థిక సంస్కరణలు బడుగు బలహీన వర్గాల రిజర్వేషన్లు, పటిష్టమైన విదేశాంగ విధానం, జిడిపి పెరుగుదల, పేదరిక నిర్మూలనకు ఎంతో కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ ప్రెసిడెంట్ సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, బత్తుల శ్రీకాంత్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్ యాదవ్, క్రాంతి,సుజిత్ రెడ్డి, వెంకట్ గౌడ్, హీరాలాల్ నాయక్, సత్యనారాయణ, వెంకటేష్, శిరీష, చరణ్ సాయి, వరలక్ష్మి శ్రీనివాస్, యాదగిరి, కరీం, ఎల్లయ్య, నర్సిరెడ్డి, పాల్గొన్నారు

నాచారంలో ..



నాచారం కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు బండారం శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించారు. అనంతరం శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ.. డాక్టర్ మన్మోహన్ సింగ్ 2004 నుండి 2014 వరకు యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (యూపిఏ) ప్రభుత్వంలో ప్రధాన మంత్రిగా దేశానికి ఎనలేని సేవలు అందించారు. 1991 - 1996 మధ్య పి.వి. నరసింహారావు ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా పనిచేసి, భారత ఆర్థిక వ్యవస్థను స్వేచ్ఛీకరణ దిశగా తీసుకెళ్లిన కీలకమైన సంస్కరణలను అమలు చేశారని తెలిపారు. నాచారం కాంగ్రెస్ పార్టీ తరపున స్మరణార్హమైన శ్రద్ధాంజలి. ఈ కార్యక్రమంలో కృష్ణరెడ్డి, ప్రకాష్ రెడ్డి, మోహన్,రామ్ రెడ్డి, రమేష్ గౌడ్, మహేష్ యాదవ్, నూతులకంటి రాజు, బదరియా, అశ్వధామ రెడ్డి, మేతుక శ్రీనివాస్ రెడ్డి, కృష్ణ యాదవ్, రవి యాదవ్, షఫియాద్, సునీల్ రెడ్డి, సంతోష్ రెడ్డి (రిటైర్డ్ ఆర్మీ), ప్రేమ్‌కుమార్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, క్యూబాన్, గడ్డం శ్రీనివాస్, టోనీ ఫ్రాన్స్,క్రాంతి కుమార్, గొల్లం నరేష్,నరేష్, మధు గౌడ్, చందు నాయక్, రాజశేఖర్, వెంకటేష్, రవి, మల్లికార్జున పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదులో ఉప్పల్ నియోజకవర్గం ముందంజ



నవతెలంగాణ - చర్లపల్లి

బీజేపీ సభ్యత్వ నమోదులో ఉప్పల్ నియోజకవర్గం ముందంజలో ఉందని మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు డా.ఎస్.మల్లారెడ్డి అన్నారు. ఉప్పల్ నియోజకవర్గం ఇన్‌చార్జి పోతగాని గోపాల్‌గౌడ్ ఆధ్వర్యంలో ఉప్పల్‌లోని అన్ని డివిజన్లకు సంభంది ంచిన క్రియాశీలక సభ్యత్వ నమోదు, బూత్ కమిటీ పత్రాలను మల్లారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్, ఎన్నికల సహ ఇన్‌చార్జి రావుల బాలకృష్ణ, ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ బాలచందర్, రాష్ట్ర గిరిజన మోర్చ ప్రధాన కార్యదర్శి రవి నాయక్, వెంకట్రావు, సోమశేఖర్ గౌడ్, మల్కా ప్రకాష్, నవీన్ కుమార్, చంద్రమౌళి, యోగేశ్వర్ రెడ్డి, రాజిరెడ్డి, రఘుపతి గౌడ్, రజనీకాంత్ రెడ్డి, పాల్గొన్నారు.

ముమ్మరంగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను నియోజకవర్గాల వారీగా మంజూరు చేసిన నేపథ్యంలో జీహెచ్ఎంసీ వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు మాత్రమే సర్వే చేయాలని నిర్దేశించిన నేపథ్యంలో జీహెచ్ఎంసీ పరిధిలో 10 లక్షల 70 వేల 446 మంది ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గ్రేటర్ హైదరబాద్‌లో సర్వే చేసేందుకు వార్డు వారీగా టీమ్‌లను ఏర్పాటు చేసి, ఇప్పటి వరకు 883 లాగింగ్ కేటాయించగా ఇప్పటి వరకు 94, వేలపైగా సర్వే పూర్తి చేసినట్టు అధికారులు తెలిపారు. వార్డు వారీగా సర్వే కోసం డిప్యూటీ కమిషనర్ల నేతృత్వంలో జోనల్ కమిషనర్లు పర్యవేక్షణలో సర్వే జరుగుతుందని జీహెచ్ఎంసీ అధికారులు స్పష్టం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

- మల్లాపూర్ ఏఈ నాగరాజు

నవతెలంగాణ - చర్లపల్లి

33/11 కేవీ మల్లాపూర్ విద్యుత్ సబ్ స్టేషన్11కేవీ నరసింహా నగర్ ఫీడర్ పరిధిలోని నరసింహనగర్, శివ హెూటల్, ఏపీ కాలనీ, మీర్ పేట్, సాయిగార్డెన్ పరిధిలలో శనివారం మధ్యాహ్నం 03:00 నుండి 04:00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారు సహకరించాలని మల్లాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ అధికారి కె.నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నాచారం పరిధిలో 33/11 నాచారం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ శాంతి గార్డెన్ ఫీడర్ పరిధిలోని శాంతి గార్డెన్ అపార్ట్మెంట్, ఇందిర నగర్, కాంక్రీట్ ప్లాజా అపార్ట్మెంట్ పరిసర ప్రాంతాలలో శనివారం ఉదయం 11 నుండి 11:30వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని నాచారం విద్యుత్ అధికారి బి.నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు.


ఆటో డ్రైవర్ నిజాయితీ..అభినందించిన ఎస్సై



నవతెలంగాణ - చర్లపల్లి

ఆటో నడిపి జీవనం సాగిస్తున్న ఓ నిరుపేద యువకుడు తన నిజాయితీని చాటుకొని శభాష్ అనిపించుకున్నాడు. సుమారు రూ.20వేల విలువైన మొబైల్‌ను నేరుగా పోలీసులకు అప్పగించి ఆదర్శంగా నిలిచాడు. వివరాల్లోకి వెళితే.. శ్రీనివాస్ అనే ఆటో డ్రైవర్ తన ఆటోలో ప్రయాణించిన గుర్తు తెలియని ప్యాసింజర్ తన మొబైల్ ఫోన్‌ను మర్చిపోయారు. ఇది గమనించిన ఆటో డ్రైవర్ శ్రీనివాస్‌కాప్రా డివిజన్ ఆటో యూనియన్ అధ్యక్షుడు రామాంజనేయులు, దేవరాజ్, నర్సింగ్ నాయక్, అనిల్‌లతో కలిసి చర్లపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్సై హరిందర్‌కు మొబైల్‌ను అందజేశారు. ఎస్ఐ డ్రైవర్ నిజాయితీని అభినందిస్తూ, ఆటో డ్రైవర్లను అభినందించారు.

పని కోసం వెళ్లిన యువతి అదృశ్యం



నవతెలంగాణ - జవహర్ నగర్

పనికి వెళుతున్నాని ఇంటి నుండి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌ఓ సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బీజేఆర్ నగర్‌లో బులుసు పార్వతమ్మ, తన కూతురు భానుప్రియ(18)తో కలిసి నివాసం ఉంటున్నారు. పార్వతమ్మ రోజువారు కూలీ, ఆమె కూతురు అప్పుడప్పుడు తల్లికి చేదోడువాదోడుగా ఉంటూ పనులకు వెళ్తూ ఉండేది. బుధవారం ఎప్పటి మాదిరిగానే ఉదయం పనికి వెళ్తున్నానని తల్లికి చెప్పి ఇంటి నుండి బయలుదేరింది. తిరిగి సాయంత్రం ఇంటికి రాలేదు. దీంతో భానుప్రియ ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా సమాచారం లభించలేదు. ఈ మేరకు పార్వతమ్మ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. గతంలో అరుణ జ్యోతి వొకేషనల్ జూనియర్ కాలేజీలో చదువుతున్నప్పుడు భాను ప్రియకు సన్నిహితంగా ఉండే అరుణ్ అనే యువకుడిపై అనుమానం ఉందని ఫిర్యాదులో తెలిపింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



జవహర్ నగర్ కార్పొరేటర్, మేడ్చల్ జిల్లా జాగృతి మహిళ కన్వీనర్ మేక లలిత యాదవ్ పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్సీ, జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యే మల్లారెడ్డి సమక్షంలో కేకు కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. -నవతెలంగాణ, జవహర్ నగర్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-బాలానగర్

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ.టి.నర్సింహ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్‌కు చెందిన పెయింటర్ కె. ప్రకాష్ చారి (55) తాగుడుకు బానిసై గత కొంత కాలంగా కుటుంబ సభ్యులకు దూరంగా బాలానగర్ డివిజన్ పరిధిలోని ఫిరోజ్ గూడులో ఒంటరిగా ఉంటున్నాడు. బుధవారం రాత్రి అతిగా మద్యం సేవించి గదికి వెళ్లి తలుపు గడియ పెట్టకుండానే చాప మీద నిద్రపోయాడు. తెల్లారిన తర్వాత గురువారం ఇంటి ముందు ఉన్న యజమాని గమనించి, అతన్ని పిలవగా ఎంతకూ పలక పోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఎలాంటి గాయాలు లేక పోవడం, పడుకున్న వ్యక్తి అలాగే మృతి చెందినట్టు ఉండడంతో.. ఏదైనా అనారోగ్య సమస్యతో మృతి చెందాడా? ఇంకేదైనా కారణం ఉందా? అన్న కోణంలో పోలీసులు మృతుడి కూతురు శైలజ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



నవతెలంగాణ-కూకట్‌పల్లి

వైద్య సహాయ నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధి చెక్కును జగదీశ్వర్ గౌడ్ అందజేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ మహంకాళి నగర్‌కు చెందిన కురువ మంజుల వైద్య చికిత్స నిమిత్తం దరఖాస్తు చేసుకోగా.. ఆమెకు మంజూరు అయిన అరవై వేల రూపాయల చెక్కును.. ఆల్విన్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్వారీ శశిధర్‌తో కలిసి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్ గౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డాన్ వెంకట్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ సేవలు మరువలేనివి


జగద్గిరిగుట్టలో..


బాలానగర్‌లో..


దుండిగల్/కుత్బుల్లాపూర్‌లో..


కుత్బుల్లాపూర్‌లో..


బాలానగర్‌లో..


బాలానగర్‌లో..


దేశ ప్రధానిగా,ఆర్థిక మంత్రిగా ఆర్బీఐ గవర్నర్‌గా ఎన్నో కీలక పదవుల్లో విశిష్టమైన సేవలు అందించిన డాక్టర్ మన్మోహన్ సింగ్ అనారోగ్యంతో మృతి చెందడంతో, ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆయన కార్యాలయంలో, మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి, మౌనం పాటించి, నివాళులు అర్పించడం జరిగింది. కూకట్‌పల్లిలో..


ప్రముఖ ఆర్థిక వేత్త, దేశ మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం పట్ల, కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ కు చెందిన మాజీ అధ్యక్షులు ఊట్ల చంద్రారెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి నగర్ రోడ్ నెంబర్ 3 లో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కూకట్‌పల్లిలో..


కేపీహెచ్‌బీలో..

ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

భారతదేశ మాజీ ప్రధాని, ఆర్థికవేత్త, డాక్టర్ మన్మోహన్ సింగ్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్ విచారం వ్యక్తం చేశారు. శుక్రవారం మన్మోహన్ సింగ్ మృతికి సంతాపంగా మాజీ కౌన్సిలర్ గూడ వరమ్మ ఆధ్వర్యంలో.. జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి, మగ్దూం నగర్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో "సంతాప సభ" నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ఆయన హాజరై... చిత్రపటానికి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ అకాల మరణం దేశానికి తీరని లోటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎన్.టి.యు సి.జిల్లా ఉపాధ్యక్షులు ఎం. జనార్ధన్,రేవంత్ రెడ్డి యువసేన సాయి ప్రవీణ్ గౌడ్, మహిళా నాయకురాలు మంగ, సులోచన, లక్ష్మి,కాంగ్రెస్ నాయకులు యాదగిరి, శేఖర్ తదితరులు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో

దుండిగల్/కుత్బుల్లాపూర్: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి తెలిపారు. అనంతనం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన, పార్టీ నాయకులు డాక్టర్ మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు ధమ్మని శ్రవణ్ కుమా ర్, డా.ఆవిజే జేమ్స్, 129 డివిజన్ మాజీ కార్పొరేటర్ పాల కృష్ణ, బహదురుపల్లి మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, సిద్దనోల సంజీవ రెడ్డి, ఎన్ఎంసి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు బేకు శ్రీనివాస్, గణేష్, బుయ్యని శివ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు..

కుత్బుల్లాపూర్ : భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే నివాసం వద్ద మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ... 1982 నుండి 1985 వరకు RBI గవర్నర్, 1991 నుంచి 1996 వరకు భారతదేశ ఆర్థిక మంత్రిగా, 2004 నుంచి 2014 దేశ ప్రధానిగా పనిచేసి భారతదేశ ఆర్థిక వ్యవస్థకు ప్రత్యేక సంస్కరణలు రూపొందించారు. ఈ సంతాప కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మున్సిపాలిటీ మాజీ చైర్మెన్ లక్ష్మారెడ్డి, మాజీ కౌన్సిలర్ ఆరిఫ్ కంటెస్టెంట్ కార్పొరేటర్స్ బండి శ్రీనివాస్ గౌడ్, బాలప్ప, ఇలయ్యగౌడ్, శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బుచ్చిరెడ్డి, బలరాం, చౌదశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సంస్కరణల ఆద్యుడు భారత మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళులు..

బాలానగర్ : భారత దేశ మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ హఠాన్మరణంతో కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని, గొప్ప ఆర్థిక నేత నాయకుడిని కోల్పోయిందని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి అన్నారు. శుక్రవారం బాలానగర్ డివిజన్‌లోని ప్రశాంత్ నగర్ లో ఏర్పాటు చేసిన మన్మోహన్ సింగ్ చిత్రపటానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విచ్చేసి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో దళిత నేత, ఎ బ్లాక్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ ప్రెసిడెంట్ బందీగ నర్సింహ, డిస్ట్రిక్ట్ ఫిషర్ మెన్ కమిటీ వైస్ చైర్మెన్, బాలానగర్ ముదిరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆకుల నరేందర్ ముదిరాజ్, కూకట్‌పల్లి నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సలీం, బాలానగర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్షద్ సోను తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సంస్కరణలతో దేశ భవిష్యత్తును ఉత్తమంగా తీర్చిదిద్దిన పరిపాలనాధ్యక్షుడు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం చాలా బాధాకరం

బాలానగర్: భారత దేశ మాజీ ప్రధాని శ్రీ.డా.మన్మోహన్ సింగ్ (92) మృతి పట్ల సంతాపం తెలుపుతూ.. శుక్రవారం గాంధీ భవన్‌లో వారి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు టి.కుమార్ రావు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం, ప్రధాన కార్యదర్శులు చరణ్ కౌశిక్ యాదవ్, జగదీష్ తదితరులు న్నారు. అనంతరం మీడియా సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం పాల్గొ న్నారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడు తూ ఆర్థిక సంస్కరణలతో దేశ భవిష్యత్తును ఉత్తమంగా తీర్చిదిద్దిన పరిపాలనా దక్షుడు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ గారి మరణం చాలా బాధాకరం అన్నారు. మన్మోహన్ సింగ్ గారి మృతితో భారతదేశం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయిందన్నారు. మన్మోహన్ సింగ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ.. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నామన్నారు.

మాజీ ప్రధాని డా. మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు..

బాలానగర్ : భారతదేశం నేడు ఆర్థికంగా ఇంత పటిష్టంగా ఉండటానికి కారణం నాడు ప్రధానిగా ఆర్థిక మంత్రిగా రిజర్వు బ్యాంకు గవర్నర్గా డాక్టర్ మన్మో హన్ సింగ్ చేపట్టిన ఆర్థిక సంస్కరణలే కారణమని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ పేర్కొన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల విచార వ్యక్తం చేశారు. బాలానగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చిత్రపటానికి స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు వేసి రమేష్ ఘనంగా నివాళులర్పించారు. ధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుని కోరుకుంటున్నట్లు రమేష్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, బ్లాక్ అధ్యక్షురాలు, మార్కెట్ కమిటీ మెంబర్స్, టెంపుల్ కమిటీ మెంబర్స్, బ్లాక్ అధ్యక్షులు, బ్లాక్ అధ్యక్షురాలు, యూత్ కాంగ్రెస్ తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రధానిగా సుదీర్ఘ సేవలు అందించి తన దైన ముద్రవేసిన గొప్ప వ్యక్తి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్..

కేపీహెచ్‌బీ : దేశ ప్రధానిగా సుదీర్ఘ సేవలు అందించి తన దైన ముద్రవేసిన గొప్ప వ్యక్తి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అని జేఎన్‌టీయూహెచ్ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.దిలీప్ అన్నారు. జేఎన్‌టీయూహెచ్ జేఏసీ ఆధ్వర్యం లో.. యూనివర్సిటీలో మన్మోహన్ సింగ్ పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించి అతని ఆత్మకు శాంతి కలగాలని శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి ప్రధాని పీవీ నరసింహరావు కేబినెట్‌లో ఆర్థిక మంత్రిగా పనిచేసిన మన్మోహన్ సింగ్ దేశంలో ఆర్థిక సంస్కరణలు అమలు చేయడంలో, జిడిపి వృద్ధి చెందడంలో కీలక పాత్ర పోషించారన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-దుండిగల్

నేడు టీజీ ఎయిమ్స్ ఫీడర్ మెయింటెనెన్స్ పనుల కారణంగా రాజీవ్ గృహకల్ప ఫీడర్‌లో ఉదయం 11.00 గం నుంచి మధ్యాహ్నం 2 :00 గం వరకు రాజీవ్ గృహకల్ప బ్లాక్స్ సూరారంలో విద్యుత్ అంతరాయం ఉంటుందని.. ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని డిపి పల్లి విద్యుత్ శాఖ ఏఈ ఎస్.సురేందర్ రెడ్డి తెలిపారు.

తప్పిన రోడ్డు ప్రమాదం.. అంతలోనే మూర్ఛ వచ్చి యువకుడు మృతి

నవతెలంగాణ-బాలానగర్

బస్సుకు డివైడర్ మధ్య ఉన్న ఖాళీలోకి ద్విచక్ర వాహనాన్ని నడపడంతో పీట్సొరావడంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాలానగర్ సీఐ టి.నర్సింహరాజు కథనం ప్రకారం సూరారం కృష్ణానగర్‌కు చెందిన నారాయణ్ తివారి (19) డిగ్రీ చదువుతున్నాడు. ఈ మేరకు రాత్రి తల్లి సంజులివాదితో కలిసి బైక్ పై ఐడీపీఎల్ క్రాస్ రోడ్స్‌లోని ఓ జ్యూయెలరీ షాపులో బంగారు ఉంగరం కొనుగోలు చేసుకున్నారు. తిరిగి ఇంటికెళ్తుండగా.. గుడెన్‌మెట్ వద్దకు రాగానే ట్రాఫిక్‌తో వాహనాలు నెమ్మదిగా ముందుకు కదులుతుండగా.. ముందున్న ఆర్టీసీ బస్సు, డివైడర్కు మధ్యలో ఖాళీ ఉండడంతో అందులోకి యువకుడు వాహనాన్ని తీసుకెళ్లాడు. అదుపు తప్పి బస్సు వైపు ఒరిగి తల్లితో సహాపడ్డాడు. స్థానికులు, బస్సు డ్రైవర్ వారిని బయటకు తీశారు. ఎటువంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కొద్దిసేపటి తర్వాత నారాయణ్ తివారికి ఫిట్స్ రాగా తల్లి ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరిం చారు. బాలుడి తండ్రి రవిశంకర్ తివారి ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అ'పూర్వ' విద్యార్థుల కలయిక

- రాజధాని పాఠశాలలో 1983-84.పదో తరగతి విద్యార్థుల సందడి





నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ఎక్కడో పుట్టి...ఎక్కడో పెరిగి.. ఇక్కడే కలిసాము.. చదువులమ్మ చెట్టు నీడలో... అంటూ వరంగల్ జిల్లా చిన్నమదూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో చదివిన 1983 - 84.10వ తరగతి బ్యాచ్ అ'పూర్వ'విద్యార్థుల కలయిక జగద్గిరిగుట్ట పరిధి పాపిరెడ్డినగర్‌లోని రాజధాని పాఠ శాలలో కలిసి సందడిగా'మన బడిలో మళ్లీ ఒకరోజు' వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. రాజధాని పాఠశాల కరస్పాండెంట్ యాదా నరేంద్ర గుప్తా వారి తోటి మిత్రులు, చిన్ననాటి మధురస్మృతులను నెమరేసుకున్నారు. తోటి స్నేహితులు పలు విధాలుగా సామాజిక సేవ కార్య క్రమాలు చేయడంతో పాటు పలు రంగాలలో రాణిస్తు న్నారన్నారు. ఇటువంటి అపూర్వ కలయిక జీవితంలో మరిచిపోలేని మధురానుభూతులని పలువురు సంతోషం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆగయ్య, లక్ష్మణమూర్తి, ఉప్పలయ్య, యాద నరేంద్ర గుప్తా, అబ్బ సాయిలు,విజయ్ కుమార్, పశుపతి, సత్యనారా యణ, వసంత, మహేశ్వరి, సంధ్యారాణి, ఉమారాణి భాగ్యమ్మ, ఎల్లమ్మ,తదితరులు పాల్గొన్నారు. అనంతరం పాఠశాల ఆధ్వర్యంలో వారిని తోటి మిత్రులను శాలువా తో సన్మానిస్తూ.. మేమేంటోలతో సత్కరించారు.

టీఎస్‌యూటీఎఫ్ మహాసభలు విజయవంతం చేయండి

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మేడ్చల్ జిల్లా కోశాధికారి గొడుగు శ్రీనివాస్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర ఆరవ విద్యా, వైజ్ఞానిక మహా సభలకు జిల్లా నుంచి, భారీ సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరు కావాలని.. టీఎస్‌యూటీఎఫ్ మేడ్చల్ జిల్లా కోశా ధికారి గొడుగు శ్రీనివాస్, టీఎస్‌యూటీఎఫ్ కూకట్‌పల్లి అధ్యక్షులు విఠల్ గౌడ్ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, గౌరవ అధ్యక్షులు మస్తాన్ వలిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరం రాష్ట్ర ఆరవ విద్య, వైజ్ఞానిక మహాసభలు నల్లగొండ జిల్లా కేంద్రంలో నేడు, రేపు, (28,29,30) తేదీల్లో మూడు రోజులపాటు నిర్వహిం చడం జరుగుతుందన్నారు. ఈ మహాసభల్లో ప్రభుత్వ విద్యారంగంపై మేధావుల ఆధ్వర్యంలో.. లోతైన చర్చ జరుగుతుందని తెలిపారు. రాబోయే కాలానికి ప్రభుత్వ విద్యా రంగం, ఉపాధ్యాయుల అభ్యున్నతి కొరకు తగిన సూచనలు సలహాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మాత్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉపా ధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.జంగయ్య, చావ రవిలు హాజర వుతారని తెలియజేశారు. అదేవిధంగా భారత ఆర్థిక వ్యవస్థలో మధ్యతరగతి ప్రజలకు ఏం జరుగుతుంది. అనే అంశం పై ప్రొఫెసర్ కె. నాగేశ్వర్. విద్యలో రాజ్యాంగ విలువలు అనే అంశంపై ఆంధ్రజ్యోతి పూర్వ సంపాద కులు డాక్టర్ కే శ్రీనివాస్. జాతీయ విద్యా విధానం- ప్రభుత్వ విద్య పై ప్రభావం అనే అంశంపై టీఎస్‌యూ టీఎఫ్ జాయింట్ సెక్రెటరీ కుమారి అయిషీ గోష్ ప్రసంగం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ ఆధ్వర్యంలో.. సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. జిల్లాలోని ఉపాధ్యాయులందరూ హాజరై మహాసభలను విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు.



మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం మన దేశానికి తీరని లోటని వారి ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం రామ్‌గోపాల్‌పేట్‌లో ఘన నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో సనత్ నగర్ నియోజకవర్గం 'ఏ' బ్లాక్ అధ్యక్షుడు త్రికల మనోజ్ కుమార్ ముదిరాజ్, మల్లెం రమేష్ గారు ఎక్స్ సెక్రెటరీ పి.సి.సి, పాండు గౌడ్, డి.సి.సి జనరల్ సెక్రెటరీ, నారాయణ ముదిరాజ్, చందు ముదిరాజ్, శ్రీశైలం, హర్షిత్ కార్యక్రమం పాల్గొన్నారు. నవతెలంగాణ-బేగంపేట

10

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్

శనివారం | డిసెంబర్ 28, 2024 | www.navatelangana.com

గొప్ప ఆర్థిక సంస్కర్తను కోల్పోయాం

- కార్పొరేటర్ వనం సంగీత



నవతెలంగాణ - బంజారా హిల్స్

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి సోమా జిగూడ డివిజన్ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్ శుక్రవారం పంజాగుట్ట సర్కిల్‌లో పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. భారతదేశం గొప్ప ఆర్థిక సంస్కర్తను, నిమ్న వర్గాలకు సమ న్యాయం జరిగేలా సేవలందించిన మహా నాయకుడుని కోల్పోయామని తెలిపారు. పిల్లి నాగరాజు,పుణ్య భాను ప్రకాష్, విశ్వనాథ్,శరన్,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.



మినీ వాటర్ ప్లాంట్ యజమానులపై
అధికారుల వేధింపులు ఆపాలి

- సీపీఐ(ఎం) వారికి అండగా ఉంటుంది
- పార్టీ జూబ్లీహిల్స్ జోన్ నాయకులు

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

మినీ వాటర్ ప్లాంట్‌ల యజమానులను ఖైరతాబాద్ రెవిన్యూ అధికారులు సీజ్ చేస్తామని బెదిరిస్తూ చేస్తున్న వేధింపులు ఆపాలని సీపీఐ(ఎం) నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం శ్రీరామ్‌నగర్ దగ్గరగంగా న గర్ లోని ఫిరోజ్ ఖాన్ మినీ వాటర్ ప్లాంట్ ను సీజ్ చేయటానికి రెవిన్యూ అధికారులు వచ్చారు. మినీ వాటర్ ప్లాంట్ యజమానులు అందరూ ఒకటై సీపీఐ(ఎం) నాయకులని పిలిచి ఈ అన్యాయాన్ని వివరించారు. టి సాయి శేషగిరిరావు నాయకత్వంలో సీపీఐ(ఎం) నాయ కులు అక్కడికి చేరుకొని అధికారులను ప్రశ్నించారు. చట్ట ప్రకారమే అధికారులు వచ్చినప్పటికీ, చట్టం దృష్టిలో హైదరాబాద్ నగరంలోని అన్ని వాటర్ ప్లాంట్ లు కూడా ఒకటేనని వారు తెలిపారు. అన్ని కూడా మూసి వేయించాలని , అప్పటివరకు బోరబండ, రహమత్ నగర్ డివిజన్‌లలో వాటర్ ప్లాంట్ లు నడుపుకునేందుకు అనుమతివ్వాలని, లేనియెడల సీపీఐ(ఎం) వారికి అండగా ఉంటుందని తెలిపారు. ఈ క్రమంలో వాటర్ ప్లాంట్ యజమానులు సీపీఐ(ఎం) నాయకత్వంతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు . దాంతో అధికారులు ఉన్నతాధికారులకు ఈ విషయం తెలియజేసి తదుపరి చర్యలు తీసుకుంటామని, అప్పటివరకు యధా ప్రకారం వాటర్ ప్లాంట్ లు నడుపుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా సీపీఐ(ఎం) నాయకులు ఆర్ అశోక్, సాయి శేషగిరిరావు, జాకటి స్వామి లు మాట్లాడుతూ, నగరంలో ఎక్కడా వాటర్ ప్లాంట్స్‌ను సీజ్ చేయని అధికారులు కేవలం రహమత్ నగర్ డివిజన్‌లో మాత్రమే ఎందుకు మూసివేయాలని ప్రయత్నిస్తున్నారని ప్రశ్నిం చారు. ఖైరతాబాద్ మండల పరిధిలో వందల సంఖ్యలో మినీ ప్లాంట్లు నడుస్తున్నాయని అవన్నీ పట్టించుకోకుండా ఒక ప్రాంతానికే పరిమితం చేయడం ఏంటని అధికారులను నిలదీశారు. ప్రశ్నించే వారు లేకనే ఈ దందా చేస్తున్నారని, చట్ట విరుద్ధమని అన్నారు. అతి తక్కువ రేటుతో ప్రజలకు మంచినీళ్లు ఇస్తున్నారని, ఒక విధంగా సేవా పరిధిలోకే వీళ్ళని చూడాలని, చట్ట ప్రకారంగా కొంత మొత్తం తీసుకుని వీరందరి వాటర్ ప్లాంట్ లను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. చట్టబద్ధంగా తనిఖీలు కూడా చేసుకోవచ్చని అంతేగాని వారి ఉపాధికి అడ్డు రావద్దని వారి పొట్ట కొట్ట వద్దని, ఆ కుటుంబాలను వీధిన పడకుండా చూడాలని అధికారులను కోరారు. కలెక్టర్ వెంటనే పట్టించుకోవాలని, లేదంటే అవినీతిపరులని అరెస్టు చేయాలని కలెక్టరేట్ ఎదుట త్వరలో ధర్నా చేపడతామని హెచ్చరించారు . తదుపరి సీజ్ చేయటానికి వచ్చిన స్పెషల్ ఆర్ఐ కిరణ్‌కు వీఆర్వో అనిల్‌కు వాటర్ ప్లాంట్ యజమానులు, సీపీఐ(ఎం) నాయకులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నయీమ్ పటేల్, బాలయ్య, లక్ష్మణ్ ,వాటర్ ప్లాంట్ యజమానులు మహేంద్ర చారి ,బీరప్ప ,డేవిడ్ ,సురేష్ యాదవ్ ,సుధీర్, ఫిరోజ్ ఖాన్, నిజాం ,కిరణ్ సాగర్, లక్ష్మీ రెడ్డి, మహమ్మద్ ఫరూక్, నదీమ్, సోహెల్ ఖాన్, నరేష్ ,రమేష్, ప్రదీప్ ,రాజు, శివ, ఆలీం తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వాలి

- ఎంసీసీ ఫిర్యాదులను సమీక్షించిన జలమండలి ఎండీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

బోర్డు దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్‌తో కలిసి ఓ అండ్ ఎం అధికారులతో ఎంసీసీ(మెట్రో కస్టమర్ కేర్) ఫిర్యాదులపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో అధికారులు సొంతంగా ప్రణాళికలు వేసుకుని ప్రజలకు ఇబ్బం దులు రాకుండా చూడాలని సూచించారు. తాగునీటి సరఫరా,



కలుషిత నీరు సమస్యలపై వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మరోవైపు రోడ్లపై సీవరేజీ ఓవర్ ఫ్లో కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. మ్యాన్ హెూళ్లు ఉప్పొంగితే వెంటనే పూడిక తీయాలని వివరించారు. వాటి నుంచి తీసిన వ్యర్థాల్ని (సిల్ట్) వెంటనే అక్కడ్నుంచి తొలగించాలని ఆదేశించారు. ఎక్కడైనా మ్యాన్ హెూళ్లు ధ్వంసమైతే వెంటనే పునర్నిర్మాణం చేపట్టాలని, మ్యాన్ హెూళ్ల కవర్లు కనిపించని స్థితిలో ఉన్నా.. వెంటనే కొత్త మూతలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎంసీసీలో వచ్చిన ఫిర్యాదులు, పరిష్కారం వివరాలపై ఆరా తీశారు. వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరిం చాలని సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న 90 రోజుల డీసిల్టింగ్ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

31న చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి



- సీఐటీయూ జూబ్లీహిల్స్ కన్వీనర్ రాపర్తి అశోక్

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

ఆశా వర్కర్లకు కనీస వేతనాలు రూ. 18 వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జూబ్లీహిల్స్ కన్వీనర్ రాపర్తి అశోక్ డిమాండ్ చేశారు. డిసెంబర్ 31 నిర్వహించనున్న చలో హైదరాబాద్‌కు సంబంధించిన గోడపత్రికను శ్రీరామ్‌నగర్ గవర్నమెంట్ హాస్పిటల్ ముందు శుక్రవారం వారు ఆవిష్కరించారు. అనంతరం సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం గడిచినా ఆశా వర్కర్లకు ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయడం లేదని, ఆశా వర్కర్లను కట్టు బానిసలుగా చేసి పనిచేయించుకుంటున్నారు తప్పితే వారి పనికి తగ్గ ఫలితం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పెట్టినట్టు రూ. 18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ రాష్ట్ర నాయకత్వం రాష్ట్రవ్యాప్తంగా బస్సుజాత నిర్వహిస్తున్నదని తెలిపారు. బస్సు జాత డిసెంబర్ 31వ తేదీ ఇందిరాపార్క్ వద్ద ముగుస్తుందని.. ముగింపు సభకు ఆశా వర్కర్లు, ప్రజలందరూ తరలివచ్చి మద్దతు తెలిపాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు స్రవంతి, శ్రీలత, మమత, జయలక్ష్మి, అశ్విని ,సుజాత, రమాబాయి, క్రాంతి రేఖ తదితరులు పాల్గొన్నారు.



ఇంద్రకీలాద్రిని సందర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ ఇంద్రకీలాద్రి పర్వతంపై ఉన్న కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయల పూజారులు ఎమ్మెల్యేకు వేద మంత్రాలతో ఆశీర్వచనాలు ఇచ్చారు. తీర్థ ప్రసాదాలు అందించారు.

అంతర్జాతీయ న్యాయపరమైన చిక్కులపై అవగాహన తప్పనిసరి

- గెహిస్ ఇమ్మిగ్రేషన్, ఇంటర్నేషనల్ లీగల్ సర్వీసెస్ కార్యాలయం ప్రారంభోత్సవంలో అద్దంకి దయాకర్



నవతెలంగాణ - బంజారాహిల్స్

అంతర్జాతీయ న్యాయపరమైన చిక్కులపై అవగాహన తప్పనిసరి అని గ్రిస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ అద్దంకి దయాకర్ అన్నారు. ఇమ్మిగ్రేషన్ అంతర్జాతీయ చట్టపరమైన విషయాలలో ప్రత్యేకత కలిగిన ప్రముఖ న్యాయ సంస్థ గెహిస్ ఇమ్మిగ్రేషన్, ఇంటర్నేషనల్ లీగల్ సర్వీసెస్, హైదరాబాద్, నాలెడ్జ్ పార్క్‌లో కొత్త బ్రాంచ్ సర్వీసెస్‌ను అద్దంకి దయాకర్, సుధా జైన్ సోషలైట్, నరేష్ ఎం గెహిలు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సంక్లిష్ట ఇమ్మిగ్రేషన్, అంతర్జాతీయ చట్టపరమైన సవాళ్లను ప్రతిబింబిస్తూ చేసే వ్యక్తులు, కుటుంబాలు వ్యాపారాలకు వ్యక్తిగతీకరించిన, సమర్థవంతమైన, అత్యాధునిక న్యాయ సేవలను అందించడంలో తమ సంస్థ ముందుంటుందనీ సంస్థ ప్రతినిధులు తెలిపారు.

అద్దంకి దయాకర్ మాట్లాడుతూ భారత్, అమెరికా మధ్య ఇమ్మిగ్రేషన్ సంబంధిత వ్యవహారాలు, ఇబ్బందులు తొలగించి కుటుంబం, బిజినెస్, వ్యక్తిగతంగా వివిధ రకాల వీసాల సమస్యల పరిష్కారంలో గేహిస్ ఇమ్మిగ్రేషన్ సంస్థ ముందుకు సాగాలన్నారు.ఈ సంస్థ ద్వారా సమస్యలను సత్వరం పరిష్కరిస్తూ అవగాహన కల్పిస్తూ, అంతర్జాతీయ స్థాయిలో న్యాయపరమైన చిక్కులు లేకుండా అపోహలు తొలగించి ప్రజలకు మెరుగైన సేవలందించాలని తెలిపారు. అనంతరం సంస్థ మేనేజింగ్ పార్టనర్ ఎస్ ఎం గేహి మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల్లో భారతీయ కుటుంబాలు చదువు కోసం విద్యార్థులు అత్యధిక సంఖ్యలో వెళుతున్న తరుణంలో వారికి అవగాహన ఎంతో అవసరమన్నారు. భారత్, యునైటెడ్ స్టేట్స్ మధ్య అంతరాన్ని తగ్గిస్తూ,సంస్థ ఎదుగుదల ఆవిష్కరణలు,అవకాశాలు అమెరికాకు అందించడంలో భారత్ ఎపుడు అగ్రగామిగా వుంటుందనీ చదువు, బిజినెస్, గ్రీన్ కార్డ్, వ్యవస్థల బదిలీ, స్పోర్ట్స్ రిలేటెడ్‌కు సంబంధిత హెచ్ 1బీ, ఎల్ఐఏ, ఈబీ5, ఈదీ-1జ, ఈబీ-1సీ, ఈబీ1ఏ వంటి పలు రకాల వీసాలు భారత్ అమెరికా దేశాలమధ్య భవిష్యత్తు, పురోగతికి మంచి తోడ్పాటన్నారు.

సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధి పరస్పరంగా ఇచ్చి పుచ్చుకోవాలి

- వియత్నం హనోయ్ యూనివర్సిటీ ఆఫ్ ఇండస్ట్రీ సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్మెంట్ హెడ్ డా.హంసాంగ్
- కృతిమ మేధతోనే సమాచార భద్రత రూఢీ చేయడమైంది : డా.మిథున్ చక్రవర్తి
- స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలాలో ఘనంగా రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు..





నవతెలంగాణ-ఓయూ

సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధి అనేది పరస్పరము ఇచ్చిపుచ్చుకోవాలని గౌరవ అతిథి డాక్టర్ .న్యూఎన్ హంసంగ్(హెడ్, సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్మెంట్, హనోయ్ యూనివర్సిటీ ఆఫ్ ఇండస్ట్రీ, వియత్నం) అన్నారు. స్టాన్లీ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో 9వ, రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు రీసెర్చ్ ఇంటిలిజెంట్ కంప్యూటర్ ఇన్ ఇంజినీరింగ్ (RICE-2024) శుక్రవారం మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ, హైదరాబాద్ అండ్ యూనివర్సిటీ ఆఫ్ డాన్ బాస్కో ఎల్ సాల్వడార్ సంయుక్తంగా నిర్వహించాయి. సదస్సు ప్రారంభానికి ముందు అతిథులు దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. సదస్సుకు కన్వీనర్ డాక్టర్ ఎం స్వప్న, అసోసియేట్ ప్రొఫెసర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ .న్యూఎన్ హంసంగ్ మాట్లాడుతూ కంప్యూటర్ రంగంలో నేడు కత్రిమ మేధ అనేది ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉందని చెప్పారు. కత్రిమ మేధ వలన పరిష్కరించడానికి వీలు కానీ ఎన్నో సమస్యలను కూడా అతి సులభంగా పరిష్కరించినట్టు తెలిపారు. సాంకేతికత అనేది అన్ని రంగాల అభివృద్ధికి ఎంతో సహకరిస్తుందని చెప్పారు. కత్రిమ మేధ నేడు సాఫ్ట్‌వేర్ రంగమే కాకుండా పారిశ్రామిక, వైద్య రంగాలలో అద్భుతంగా ఫలితాలనిస్తోందని ఈ సందర్భంగా అయిన గుర్తు చేశారు. ఈ అంతర్జాతీయ సదస్సుకు మరొక గౌరవ అతిథిగా హాజరైన డాక్టర్ మిథున్ చక్రవర్తి (లింకన్ యూనివర్సిటీ, మలేషియా) మాట్లాడుతూ గణన శాస్త్రానికి సంబంధించిన పరిశోధనలు ఇంజినీరింగ్ పరిజ్ఞానం పెరగడానికి ఎంతో సహకరిస్తాయని చెప్పారు. కత్రిమ మేధవలన నేడు సమాచార భద్రత అనేది రూఢీ చేయడమైందని చెప్పారు. సమాచారాన్ని సేకరించడం, విశ్లేషించడం మొదలగు ముఖ్యమైన పనులను కృతిమ మేధ ద్వారా ఎంతో సులభంగా చేయగలమని గుర్తు చేశారు.ఈ సదస్సు లో కత్రిమ మేదతో కూడిన అనేక అంశాలపై చర్చలు జరగాలని సూచించారు.సదస్సు ప్రారంభ కార్యక్రమానికి మరొక వక్త గా హాజరైన డాక్టర్ అతుల్ నేగి (హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ) కార్యక్రమం గురించి ప్రసంగించారు. ఈ రెండు రోజుల సదస్సులో చైర్మెన్ బిషప్ డా. ఎం.ఏ. డేనియల్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.కష్టా రావు, మేనేజ్మెంట్ సభ్యులు టి రాకేష్ రెడ్డి, ఆర్ ప్రదీప్ రెడ్డి, ప్రిన్సిపాల్ డా. సత్య ప్రసాద్ లంక,అకాడమిక్స్ డీన్ డా. ఎ.వినయ్ బాబు, డాక్టర్ వి.అనురాధ డైరెక్టర్, ఎ .రమేష్ , అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ , ప్రోగ్రామ్ చైర్ డా. విజయేందర్ కుమార్ సోలంకి, కన్వీనింగ్ టీమ్ డా.ఎం.స్వప్న, డా.శివాని యాదవ్,డా.జి.కార్తిక్, విద్యార్థులు, రీసర్చ్ స్కాలర్స్, ఉపాధ్యాయులు హాజరయ్యారు.ప్రిన్సిపాల్, చైర్ ప్రిన్సిపాల్ అండ్ చైర్, RICE-2024 డా.సత్య ప్రసాద్ లంక, అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ ఎ. రమేష్ ,పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్‌కు ఘనంగా నివాళ్లు





నవతెలంగాణ-ఓయూ

భారత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఆకస్మిక మరణం పట్ల డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి , టీజీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డిలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాల యంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ. భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి, ప్రజాస్వామ్యానికి మన్మోహన్ సింగ్ చేసిన సేవలు అమోఘమని కొనియాడారు. ఆయన ప్రధానమంత్రిగా చేసిన సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లినట్టు గుర్తు చేశారు. టీజీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ మదుస్వభావం, నిష్కళంక తీరు, ప్రజల పట్ల ఆయనకున్న అపారమైన ప్రేమ దేశ ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలుస్తాయన్నారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన కార్యకర్తలు, డిప్యూటీ మేయర్ సహాయ సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

హబ్సిగూడ కాంగ్రెస్ ఆధ్వర్యంలో

మన్మోహన్ సింగ్ మతి పట్ల కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గం ఇన్‌చార్జి పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం హబ్సిగూడా డివిజన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో హబ్సిగూడా విధి నంబర్.8లో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలోకాంగ్రెస్ హబ్సిగూడా సీనియర్ నాయకులు, కంది ఆగి రెడ్డి , సుధాకర్ రెడ్డి, పార్టీ హబ్సిగూడా డివిజన్ అధ్యక్షులు విజయ్ కుమార్, డివిజన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర నాయక్ (ధర్మ), మురళీ కష్ణ ముదిరాజ్, హబ్సిగూడా డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాసు నాయక్ ,రాజన్న, కిషన్ నాయక్ , సుధాకర్ మైనార్టీ నాయకులు జలీల్ పాషా, డివిజన్ సెక్రెటరీ షబ్బీర్, రాఘవేంద్ర,సాయి కిషోర్, సాయి, సుమన్ నాయక్, కళ్యాణ్, పాల్గొన్నారు.



ఓయూలో మన్మోహన్ సింగ్ కి నివాళులు..

మన్మోహన్ సింగ్ కి శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఓయూనాయకులు పరిశోధన విద్యార్థులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కోట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ. "మన్మోహన్ సింగ్ మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది.డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణంతో దేశం ఒక గొప్ప నాయకుడిని కోల్పో యింది.వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ,కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాను.డాక్టర్ మన్మోహన్ సింగ్ జీని తన గౌరవప్రదమైన ప్రవర్తన, ప్రజా సేవ పట్ల నిబద్ధత, ప్రగాఢ జ్ఞానం చరిత్ర ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటుంది. ఒక రాజనీతిజ్ఞుడు, పండితుడు, నాయకుడు, దూరదృష్టి గలవారు. భారతదేశం గర్వించదగిన ప్రముఖులలో ఒకరు. మన్మోహన్ సింగ్ మరణం భారత సమాజానికి తీరని లోటు ఆయన సేవలను గుర్తించి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది" అని కొని యాడారు. పెంచాల సతీష్, రవి నాయక్, మండ్ల రవి, సురేష్ నాయక్, మోహన్ , అశోక్, రాజు, కుమార్, అనిల్ పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ మృతి పట్ల ఎమ్మెల్యే సంతాపం

నవతెలంగాణ-ఓయూ

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల సికింద్రాబాద్ ఎమ్మెల్యే, తీగుల్ల పద్మారావు గౌడ్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. దేశ ఆర్థిక సంస్కరణల విలక్షణ నేతగా, నిబద్ధతతో వ్యవహరించిన మహెూన్నత వ్యక్తిగా మన్మోహన్ సింగ్ భారత చరిత్రలో నిలు స్తారని పద్మారావు గౌడ్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర సాధన ఉద్యమ సందర్భంగా ప్రజల ఆకాంక్షలను గుర్తించి తన మద్దతును తెలిపిన మన్మోహన్ సింగ్ మరణం బాధాకరమని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు.



బేగంపేట : బేగంపేట డివిజన్‌లోని ఓల్డ్ కస్టమ్ బస్తీ కార్యాలయంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డా. కోట నీలిమ నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ మన్మోహన్‌సింగ్ ఆర్థిక సంస్కరణలు దేశ అభివృద్ధికి ఎంతో కీలకమైందని గుర్తుచేశారు. అలాగే, పార్టీ సిద్ధాంతాలపై నిబద్ధతతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని కార్యకర్తలకు సూచించారు.

మన్మోహన్ సింగ్‌కు కంటోన్మెంట్ కాంగ్రెస్ నాయకుల శ్రద్ధాంజలి

నవతెలంగాణ-కంటోన్మెంట్



మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు కాంగ్రెస్ కంటోన్మెంట్ నాయకులు శుక్రవారం నివాళులర్పించారు బోయిన్‌పల్లి చౌరస్తా అంబెద్కర్ విగ్రహం వద్ద మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ మాట్లాడుతూ కేంద్ర ఆర్థికశాఖ మంత్రిగా ఐదేండ్లు, ప్రధానిగా పదేండ్లు పదవీ బాధ్యతలు చేపట్టి ఎన్నో ఆర్థిక సంస్కరణలు అమలు చేశారని, దేశాభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. ప్రపంచంలో భారత ఖ్యాతిని ఇనుమడిం పజేశారన్నారు. మన్మోహన్ సింగ్ అమలు చేసిన ఆర్థిక సంస్కరణ లకు ప్రపంచదేశాలు సైతం ప్రశంసించాయని అన్నారు కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్రి అమరేందర్ రెడ్డి, ప్రభుగుప్త, బల్వంత్ రెడ్డి, ముప్పిడి మధుకర్, అరుణ్ యాదవ్, హరికృష్ణ, సదానంద్, రాజు, క్రాంతి, మధు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఘనంగా అయ్యప్ప పడి పూజ

నవతెలంగాణ-ఓయూ



సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం రాత్రి మోండా మార్కెట్‌లోని టకార బస్తీ నివాసం వద్ద అయ్యప్ప పడి పూజ ఘనంగా నిర్వహించారు. సికింద్రాబాద్‌తో పాటు నగర వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు. మహా పడి వద్ద భజనలు, వివిధ వేషధారులు ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రి హరీశ్‌రావు, శాసనసభ్యులు కే.పీ.వివేకానంద్, ముఠా గోపాల్, నేతలు ఎర్రోళ్ళ శ్రీనివాస్, తలసాని సాయి కిరణ్, జైసింహ, కార్పొరేటర్లు లింగాని ప్రసన్నలక్ష్మి శ్రీనివాస్, కంది శైలజ, రాసురి సునీత, హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీ.ఆర్.ఎస్. యువ నేత తీగుల్ల రామేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన యువ నేతలు కిషోర్ కుమార్, కిరణ్ కుమార్, త్రినేత్ర గౌడ్ లతో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా 34వ మండల పూజ

నవతెలంగాణ-ఓయూ



లాలాపేట్‌లోని శ్రీ శ్రీ లక్ష్మీ గణపతి సాయి అయ్యప్ప దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం దేవస్థానంలో అయ్యప్ప స్వామి 34వ మండల పూజ అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే గణపతి హెూమం, కలశ పూజ, శాస్త్ర నామార్చన, శాస్త్ర ప్రీతి, అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకుడు బండ చంద్రారెడ్డి, దేవాలయ కమిటీ అధ్యక్షులు బుద్ధ బాలరాజ్ రమేష్ గుప్తా, ఎల్.ఎల్.బి శ్రీనివాస్ గౌడ్, బాబా అశోక్, మహేష్ ముదిరాజ్, జగన్మోహన్ రావు, పేపర్ శ్రీనివాస్ గౌడ్, ఉత్సవ కమిటీ మెంబర్లు చాప వెంకటేష్, కేబుల్ శ్రీను మామ, గణేష్ యాదవ్, సదానంద్, సింగం రవి, జాన్, పరశురాం, జగన్ రెడ్డి, ధనరాజ్ భాను గౌడ్, నిఖిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 3 వేల మంది స్వాములు, భక్తులకు అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు.గత 34 సంవత్సరాలు ఇక్కడే నిర్వహిస్తున్న పూజ స్వాముల నియమ, నిష్ఠలతో దీక్ష ప్రశంసనీయం అని పలువురు అభినందించారు.



న్యూ ఇయర్ వేడుకల పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నూతన సంవత్సర వేడుకల కోసం ఆల్వేస్ ఈవెంట్స్, ఎస్వీ ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో ఈ నెల 31న నోవాటెల్ వేదికగా నిర్వహించనున్న గ్రాండ్ సెలబ్రేషన్‌ను సగర్వంగా ప్రకటించాయి. ఈ వేడుకల పోస్టర్‌ను నోవాటెల్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్ర మంలో ప్రముఖ యాంకర్ రవి, నటి సౌమ్య జానుతో పాటు ఈవెంట్ నిర్వాహకులు సుమంత్, వినోద్ సందడి చేశారు. ఈ ఏడాది నూతన సంవత్సర వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వ హించడానికి ఆల్వేస్ ఈవెంట్స్, ఎస్ ప్రొడక్షన్స్ హామీ ఇచ్చాయి. ముఖ్యంగా ఈ వేడుకల్లో టాలీవుడ్ డ్యాన్సింగ్ స్టార్, గ్లామర్ క్వీన్ శ్రీలీల తన స్టెప్పులతో అలరించనుందని నిర్వాహకులు తెలిపారు. లైవ్ మ్యూజిక్, బాలీవుడ్ డీజేలతో.. కలర్‌ఫుల్ లైటింగ్, ఫ్యాషన్ షోలు, డ్యాన్సింగ్ పర్ఫామెన్స్‌తో ఆకట్టుకోనున్నారు. ఈ ఈవెంట్ లో విభిన్న సంగీత కళా ప్రక్రియలను అలరించడానికి మంత్రముగ్ధులను చేసే ప్రత్యేక ప్రదర్శనలు ఉండనున్నట్టు తెలిపారు. శాస్త్రీయ, సమకాలీన శైలులను మిళితం చేసే డైనమిక్ నత్యాలను ఆస్వాదించవచ్చని తెలిపారు. హై ఎనర్జీ బాలీవుడ్ డీజే సెట్‌తో సరికొత్త హిట్‌లకు డ్యాన్స్ చేయడానికి సిద్ధంగా ఉండనున్నట్టు తెలిపారు. చిన్నారులకు వినోదాన్ని పంచేందుకు సరదా కార్యకలా పాలతో ప్రత్యేక కిడ్స్ జోన్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రంగుల మయమైన బాణసంచా ప్రదర్శనతో నూతన సంవత్సరాన్ని స్వాగతించడానికి థ్రిల్లింగ్ కౌంట్‌డౌన్ ఉండనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ కోసం ఆడిపాడుతాం

- కళా నేతలతో మందకృష్ణ మాదిగ



నవతెలంగాణ-బంజారాహిల్స్

హైదరాబాద్‌లో బహుజన యుద్ధనౌక ఏపూరి సోమన్న అధ్యక్షతన కళానేతల రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ హాజరయ్యారు. ప్రజా గాయని విమలక్క, మధుప్రియ, నల్లగొండ గద్దర్, దరువు అంజన్న, వరంగల్ శ్రీనన్న, రేలారే గంగ, మిట్టపల్లి సురేందర్, క్రాంతి దళ్ పృథ్వీరాజ్ యాదవ్, మానుకోట ప్రసాద్, మద్దెల సందీప్, పాటమ్మ రాంబాబు, దరువు ఎల్లన్న, రేలారే ప్రసాద్, ఐలయ్య, యాకన్నలతో పాటు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ ప్రముఖ కళానేతలు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాల సాధనలో భాగంగానే ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్నామని వెల్లడించారు. ఎస్సీ వర్గీకరణ జరిగితే ఏ కులానికి అన్యాయం జరగదు, జనాభా ప్రాతిపదికన ఎస్సీలలో ఉన్న అన్ని కులాలకు రిజర్వేషన్లు లభించి న్యాయం జరుగుతుందన్నారు. ఈ పోరాటం న్యాయమైంది కనుకనే సమాజం మొత్తం మద్దతు ఇచ్చిందన్నారు. కానీ మాలలు తమకున్న రాజకీయ పలు కుబడితో ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవడానికి బలంగా ప్రయత్ని స్తున్నారని అన్నారు. ఆ అడ్డంకులను ఎదుర్కోవడానికి వెయ్యి గొంతులు - లక్ష డప్పులతో మండే మాదిగల గుండె చప్పుళ్ళను వినిపించడానికి శ్రీకారం చుట్టామన్నారు. మరొక్కసారి అన్ని సామాజిక వర్గాలలో ఉన్న కళా నేతలంతా ఎస్సీ వర్గీకరణ ఉద్యమా నికి మద్దతుగా నిలబడాలన్నారు. ఫిబ్రవరి 3న జరుగు వెయ్యి గొంతులు లక్ష డప్పులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంలో కళానేతలు మాట్లాడుతూ.. 'ఎస్సీ వర్గీకరణ న్యాయం కాబట్టే మొదటి నుండి ఎమ్మార్పీఎస్‌కు మద్దతు తెలుపుతున్నామ న్నారు. తెలంగాణ ఉద్యమాన్ని విజయవంతం చేయడానికి ఎంతటి బలమైన పాత్రని కళానేతలు పోషించారో అదే విధంగా ఎస్సీ వర్గీకరణ పోరాటాన్ని విజయానికి చేర్చడానికి కూడా అదే పాత్రను పోషిస్తామని అన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు కోసం మరొక్కసారి గజ్జె కట్టి గళం విప్పి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం నూతన పాటలతో ప్రజల్ని మరింత చైతన్యం చేస్తామన్నారు. అందులో భాగంగా వెయ్యి గొంతులు లక్ష డప్పులు కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రంలోని కళాకారులంతా పాల్గొంటామని తెలిపారు.

అనుకరణ కళలో దిగ్గజం నేరెళ్ళ వేణుమాధవ్



నవతెలంగాణ కల్చరల్

అనుకరణ కళను శాస్త్ర బద్ధం చేసి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన నేరెళ్ల వేణుమాధవ్ అనుకరణ దిగ్గజం అని రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ దేవీ ప్రసాద్ కొనియడారు. శ్రీ త్యాగరాయ గానసభలోని గుండవరపు హనుమంతరావు కళా వేదికపై గాన సభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా విఖ్యాత మిమిక్రీ కళాకారుడు డాక్టర్ నేరెళ్ళ వేణుమాధవ్ యాది లో సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న దేవీ ప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ గడ్డ పై పుట్టిన ఎందరో ప్రతిభావంతులులో నేరెళ్ల వేణుమాధవ్ ప్రముఖులు అన్నారు. ఐక్య రాజ్య సమితిలో మిమిక్రీ కళను ప్రదర్శించి దేశ ఖ్యాతిని నిలిపిన వేణు మాధవ్ నాటి ప్రముఖులు నెహ్రూ రాధా కృష్ణన్ ఇందిరా గాంధీ వంటి వారి సమక్షం లో తన ప్రతిభను ప్రదర్శించి అభినందన అందుకున్నారని గుర్తు చేశారు. అధ్యక్షత వహించిన గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి మాట్లాడుతూ డాక్టర్ రమణ తిరుమల తిరుపతి కార్య నిర్వహణ అధికారిగా వున్న సమయంలో వేణు మాధవ్‌ను గజారోహణతో పౌర సన్మానం చేశారని చెప్పారు . ఆయన తైల వర్ణ చిత్రం గాన సభలో ఎందరో మహానుభావులు చిత్రాలలో భాగంగా ఏర్పాటు చేశామని చెప్పారు. మిమిక్రీ కళాకారుడు సినీ దర్శక నిర్మాతమల్లం రమేష్ మాట్లాడుతూ తెలుగు విశ్వవిద్యాలయంలో మిమిక్రీ కళను శాస్త్ర బద్ధం చేసి కోర్సును ఏర్పాటు చేయటం లో కీలక పాత్ర వేణు మాధవ్ పోషించారని చెప్పారు. మిమిక్రీ కళా కారులు ఆర్‌సీ ఎం రాజుభవిరి శివ శివ ప్రసాద్ షరీఫ్ అంజన్ కుమార్, మహిళా మిమిక్రీ కళాకరిణి ఉదయ శ్రీ తదితరులు మాట్లాడుతూ వేణు మాధవ్ ఎందరికో శిక్షణ ఇచ్చి కళాకారులుగా తయారు చేశారని ఆయన వల్ల ఉపాధి అవకాశాలు ఆ కళాకారులు కి లభించిందని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

నవతెలంగాణ-హయత్‌నగర్



రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాహెబ్ నగర్ కాలనీ, హయత్‌నగర్‌లో నివాసం ఉండే నవీళ్ళ సాయి కుమార్(25)గత కొంతకాలంగా సాహెబ్ నగర్ కాలనీలో ఉంటూ చదువు కుంటూ అప్పుడప్పుడు పెయింటింగ్ పనికి వెళ్తుతుంటాడు. ఈనెల 19న రాత్రి సమయంలో నవీళ్ళ సాయికుమార్ తన స్నేహితుడు మంజునాథ్ ఇద్దరు కలిసి తన బైక్ నెంబర్ టీఎస్ 07కేఏ 6721 అనుదానిపై సామనగర్ నుండి భాగ్యలత వైపు వస్తుండగా సరిగ్గా శాంతినగర్ వద్దకు రాగానే ఎదురుగా టీఎస్ 11 ఈఎం 2210 అనే కారు డ్రైవర్ ఏకుల శ్రీధర్ అతివేగంగా నిర్లక్ష్యంగా అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి నవిల్లా సాయి కుమార్, మంజునాథ్ వెళ్తున్న బైకుకు టక్కర్ ఇవ్వగా ద్విచక్ర వాహణదారులిద్దరు రోడ్డుపై పడిపోగా సాయికుమార్ తలకు తీవ్ర రక్త గాయం కాగా అతనిని వెంటనే చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ 26న తుదిశ్వాస విడిచారు. మంజునాథకు ఎడమ కన్నుపై, రెండు చేతులకు, తలకు ఇతర భాగాలకు రక్త గాయాలయ్యాయి. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్వచ్ఛ సోచ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆరంభం



నవతెలంగాణ-కల్చరల్

రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై శ్రుతి లయ ఆర్ట్స్ అకాడమీ నిర్వహణలో జరిగిన దళిత ఉద్యమ నేత జేబీ రాజు జన్మదిన సందర్భంలో స్వచ్ఛ సోచ్ స్వచ్ఛంధ సేవా సంస్థ లోగోతో పాటు విధి విధానాల గురించి సంపుటిని సమైక్య ఆంధ్ర ప్రదేశ్ పూర్వ మంత్రి డాక్టర్ జె.గీతారెడ్డి, జెబి రాజుతో పాటు ఆవిష్కరించారు. శాసన సభ్యుడు వివేక్, వెన్నెల గద్దర్ తదితరులు పాల్గొన్నారు. సంస్థ అధ్యక్షులు సాజిద్ ఖాన్, ఉప అధ్యక్షులు శివ కుమార్, ప్రధాన కార్యదర్శి వెంకట్ గౌడ్ పాల్గొన్నారు. సంస్థ స్థాపకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరే విధంగా ప్రచారం చేయటంతో పాటు పెద విద్యార్థులకు చదువుకునేందుకు సహాయం అందించటం, అనాథలకు సహకారం వంటి కార్యక్రమలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రెండు నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు పాఠశాల లో చేర్పించటానికి అవసరమైన ఆర్థిక సహాయం అందజేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నవతెలంగాణ-హయత్ నగర్



బ్రాహ్మణపల్లి నుండి తుర్కయంజాల్ రోడ్డు మార్గం మధ్యలో రోడ్డు పక్కన మృతదేహం పడి ఉందని శుక్రవారం 100కు కాల్ రావడంతో హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ పి.రాజు సంఘటన స్థలనికి వెళ్లి చూడగా మృతదేహం సర్వే నెంబర్ 263 వ్యవసాయ భూమి పక్కన కలదు. అట్టి భూమి బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన కొంతం నరసింహారెడ్డి వ్యవసాయ భూమి. మృతదేహాన్ని పరిశీలించి చూడగా మృతదేహం వ్యవసాయ పొలానికి ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ తీగ దగ్గర కింద పడిపోయి చనిపోయినట్లుగా ఉన్నాడు. మృతదేహం యొక్క ఆచూకీ కోసం విచారించగా మృతదేహాన్ని ఎవరు గుర్తిం చలేదు. మృతుడి యొక్క వయసు అందాజ 60 సంవత్సరాలు, ఎత్తు 5.5 ఫీట్లు, చామనఛాయ రంగు కలిగి, తెలుపు రంగు చొక్కా , తెలుపు ఎరుపు రంగు గీతల టవలు కలిగి ఉన్నాడు.కేస్ నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళా అదృశ్యం

నవతెలంగాణ-హయత్‌నగర్



మహిళ అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నంది హిల్స్ కాలనీ, హయత్ నగర్‌కు చెందిన బద్దుల పారిజాత శుక్రవారం ఉదయం తన భర్త బద్దుల సతీష్ "మీ అమ్మ దగ్గరికి వెళ్ళొద్దంటే ఎందుకు వెళుతున్నావు.. నువ్వు ఎందుకు ఊరికి వెళ్లావు.. మీ అమ్మతో నా పిల్లల్ని ఎందుకు ఫోన్‌లో మాట్లాడించావు" అని తిట్టడంతో ఇంట్లో నుండి బయటకు వెళ్లిపోయిందని తన గురించి చుట్టుపక్కల, వాళ్ల బంధువుల దగ్గర వెతకగా ఎటువంటి ఆచూకీ లభించలేదని తన ఫిర్యాదు లో పోలీసులకు తెలిపాడు .కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అంబేద్కర్ ఆలోచనలలో తాత్వికత

నవతెలంగాణ సిటీబ్యూరో

సామాజిక చలనాలను గుర్తించడం, వాటిని అవగాహనలోకి తెచ్చుకోవడం, సమాజ సాహిత్యాల పరస్పర ప్రమేయాలను విశ్లేషించుకోవడం ప్రరవే ఆచరణ. అందులో భాగంగానే గతంలో స్త్రీవాద సిద్దాంతాల మీద ఆదివాసీల స్థితిగతులు- పరిష్కార మార్గాల మీద ప్రసంగాల పరంపరను కొనసాగించినట్లే 22-12-24న అంబేద్కర్ ఆలోచనల తాత్వికత ప్రారంభ ప్రసంగాన్ని కత్తి పద్మారావు ప్రారంభించారు. ఈ ప్రసంగంలో ఖాదర్ మోయునుద్దీన్ అంబేద్కర్ జీవిత విశేషాలను ప్రస్తావిస్తూ అంబేద్కర్ దేశ స్వాతంత్రం కన్నా నా జాతి స్వాతంత్రానికై ముందు ఉంటానని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. రచయిత్రి ఓల్గా అంబేద్కర్ ఆలోచనలు-పరిశీలన-అధ్యయనం- కార్యాచరణ ఒకే దిశగా కొనసాగాయన్నారు. ప్రొఫెసర్ సునీత రాణి అంబేద్కర్ ప్రాసంగికతను ప్రస్తావిస్తూ రెవల్యూషన్ మరియు ఎన్‌కౌంటర్ రెవల్యూషన్ గురించి వివరంగా చెప్పారు. ఇకపై కూడా ఈ అంబేద్కర్ ప్రసంగాల పరంపర మే 18 వరకు ప్రతి ఆదివారం ఉదయం 10 గం. నుండి మధ్యాహ్నం 1గం వరకు కొనసాగుతుంది. ప్రసంగాలలో అంబేద్కర్ ఆలోచనలన్నీ చర్చలోకి వస్తాయి. ఇవి మొత్తంగా 41 ఉపన్యాసాలను 21 వారాల్లో ఆలోచనపరులు అధ్యయనశీలురైన వ్యక్తులు ప్రసంగించనున్నారు. మిత్రులందరినీ ఈ పరంపరలో భాగం కమ్మని కోరుతున్నాము. తద్వారా అంబేద్కర్ పట్ల అవగాహన పెరుగుతుందని ప్రరవే ఆశిస్తున్నది.



'పీవీ నరసింహారావు పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం వాయిదా'

నవతెలంగాణ-హిమాయత్ నగర్

దేశ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఆకస్మిక మరణంతో నేడు (శనివారం) రవీంద్రభారతిలో జరగనున్న పీవీ నరసింహారావు పురస్కారం ప్రధానోత్సవం వాయిదా వేస్తున్నట్లు పీవీ నరసింహారావు మెమోరియల్ ట్రస్ట్ జనరల్ సెక్రెటరీ మాదంశెట్టి అనిల్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మన్మోహన్ సింగ్ సాయంతోనే మెట్రో

- మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి



నవతెలంగాణ సిటీబ్యూరో

ప్రముఖ ఆర్థికవేత్తగా, ఆర్థిక సంస్కరణల పితామహునిగా, ప్రధానమంత్రిగా భారత దేశ ఆర్థిక పురోగతికి డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎనలేని కృషి చేశారని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. "దేశ ఇన్ఫ్రాస్ట్రక్చర్ రంగ అభివృద్ధికి ఒక ట్రిలియన్ డాలర్లు (అప్పట్లో 60 లక్షల కోట్ల రూపాయలు) కావాలని అందులో సగభాగం పబ్లిక్ ప్రయివేటు పార్టనర్ షిప్ పద్ధతిలో ప్రయివేటు కంపెనీల పెట్టుబడుల ద్వారా రావాలని ఆయన అభిమతం. అప్పటికే పీవీ నరసింహా రావు, డాక్టర్ మన్మోహన్ సింగ్ కలిసి ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల ద్వారా మన దేశంలో అధునాతన విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, జాతీయ రహదారులు, టెలీ కమ్యూనికేషన్ వ్యవస్థల వంటి రంగాలలో ప్రపంచ స్థాయి సౌక ర్యాలు అభివృద్ధి చెందుతుండగా, భారతీయ రైల్వేలలో సంస్కర ణలు జరగలేదు.. ప్రయివేటు రంగ పెట్టుబడులు ఆహ్వానించబడలేదు. మెట్రో రైల్ ప్రాజెక్టు అత్యంత ఆర్థిక భారంతో కూడినవి కావడం వల్ల ప్రపంచమంతటా నగరాల అవసరాల దృష్ట్యా ప్రభుత్వ రంగ ప్రాజెక్టులుగానే నిర్మించబడ్డాయి. అటువంటి పరిస్థితులలో హైదరాబాద్ మెట్రోను ప్రధానిగా డాక్టర్ మన్మోహన్ సింగ్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షునిగా డాక్టర్ మాంటెక్ సింగ్ అహ్లువాలియా, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఎస్.జైపాల్ రెడ్డిల ప్రోద్బలంతో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆదేశాలతో మేము హైదరాబాద్ మెట్రోను పీపీపీ విధానంలో రూపొందించగా, డాక్టర్ మన్మోహన్ సింగ్ దీనిని అభినందించారు" అని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలియజేశారు. "కేంద్ర ప్రభుత్వ గ్రాంటుగా రూ. 1,458 కోట్ల వైబిలిటీ గ్యాప్ ఫండింగ్ ని కూడా డాక్టర్ మన్మోహన్ సింగ్ సారథ్యంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. హైదరాబాద్ మెట్రోలో సఫలం అయిన పీపీపీ బిడ్డింగ్ విధానంపై ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ మాంటెక్ సింగ్ అహ్లువాలియాకు తాను ఒక లేఖ ద్వారా వివరించగా, దానిపై డాక్టర్ మన్మో హన్‌సింగ్ హైదరాబాద్ మెట్రో ఒక దిక్సూచిగా నిలుస్తుందని, దేశంలో ఇతర ప్రాజెక్టులు కూడా ఈ విధానాన్ని అనుసరించాలని ఆదేశాలు జారీ చేశారు. మేటాస్ వైఫల్యం ఉదంతంతో అనేక మంది హైదరాబాద్ మెట్రో పై విమర్శలు గుప్పించినా , ఇదే సరైన విధానమని మీరు ఈ పద్ధతినే కొనసాగిస్తూ మరల అంతర్జాతీయ టెండర్లకు వెళ్లండని డాక్టర్ మన్మోహన్ సింగ్ హైదరాబాద్ మెట్రో పీపీపీ విధానానికి మద్దతుగా నిలిచారు. ఆయన ప్రోద్బలం, మద్ద తు, సహాయం లేకుండా ఈ రోజు ప్రపంచ చరిత్రలో ఒక అరుదైన పీపీపీ మెట్రో ప్రాజెక్టుగా హైదరాబాద్ మెట్రో అవతరించేది కాదని, వారికి హైదరాబాదీయులు ఎప్పటికీ రుణపడి ఉంటారు" అని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.

IN THE COURT OF THE HONOURABLE PRINCIPAL DISTRICT JUDGE:VIKARABAD DISTRICT, AT VIKARABAD.
I.A.No.246 of 2024
in
ASSR No.740 of 2024

Between:
1.Smt.Pochamma W/o Lalaiah, aged 86 years, occ: Agriculture,
2.Bakka Narsimulu S/o Lalaiah, aged 57 yrs, Both R/o Kothrepalli village, Vikarabad Mandal & District.
...Petitioners/Appellants.
and
Smt.Rukkamma and others
..Respondents/Respondents.
To
1.Smt.Laxmi W/o Ramulu, aged 61yrs, R/o Kishanbagh, Hyderabad.
..Respondent No.4.
2.Kavya D/o Pundarikakshudu, aged 40 years, occ: Household, R/o Plot No.1268/A, Road No.53/A, Behind Petrol pump, Jubilee Hills, Hyderabad.
...Respondent No.6.

NOTICE

Please take notice that the above named petitioners filed the above I.A.XNo.246/2024 in ASSR No.740/2024 u/s.5 of Limitation Act, and the said I.A. No.246/2024 stands posted to 21.1.2025 for your appearance in the above said court at 10.30A.M. If you fails to appear in person or through your counsel, the matter will be decided in your absence as Ex-parte.

//BY ORDER OF THE COURT//
N.Narotham Reddy,
Advocate
Office at: 1-8-732/27, II Floor, Bachelors Building, Near Moon Café, Old Nallakunta, Hyd. Cell No.: 81436 34151

IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE, SANGAREDDY DIST AT: SANGAREDDY
O.S No. 352 OF 2024

Between :
M/S. SRI SURYA CONSTRUCTIONS Rep. by its authorized signatory Mr. Sri. Veldanda Srikanth Rao and another
...Plaintiff
AND
A. Archana and others
....Defendants

SUMMONS

To,
Sri. RajulaPulla Reddy S/o. B. Bal Reddy, Aged: 45 yrs, , Occ: Not Known to the PlaintiffsR/o. Old MIG-1204, BHEL Colony, Hyderabad,TS
Sir,
Please take Notice that, the Plaintiff has filed above for perpetual injunction against the Defendants in respect of Suit Schedule properties of above suit. The Hon'ble Court has ordered to publish the summonson above named defendant i.e Defendant no.4 to be published in Nava Telangana Telugu Daily News Paper for his appearance on 23-01-2025 at 10:30 AM before the said Hon'ble Court. Hence, if any one has objection make it convenient to appear before the Prl. Junior Civil Judge, Sangareddydist at Sangareddyon the said date and time otherwise, the case will be decided on merits and on the material available, in your absence.

//By Orders of the Court//
B.SRINIVAS
ADVOCATE,
SANGAREDDY
Cell : 9618458785

IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE, SANGAREDDY DIST AT: SANGAREDDY
O.S No.353 OF 2024

Between :
M/S. SRI SURYA CONSTRUCTIONS Rep. by its authorized signatory Mr. Sri. Veldanda Srikanth Rao
...Plaintiff
AND
A.Archana and others
...Defendants

SUMMONS

To,
Sri.RajulaPulla Reddy S/o. B. Bal Reddy Aged: 45 yrs, , Occ: Not Known to the Plaintiffs R/o.Old MIG-1204, BHEL Colony, Hyderabad,TS
Sir,
Please take Notice that, the Plaintiff has filed above for perpetual injunction against the Defendants in respect of Suit Schedule properties of above suit. The Hon'ble Court has ordered to publish the summonson above named defendant i.e Defendant no.4 to be published in Nava Telangana Telugu Daily News Paper for his appearance on 23-01-2025 at 10:30 AM before the said Hon'ble Court. Hence, if any one has objection make it convenient to appear before the Prl. Junior Civil Judge, Sangareddydist at Sangareddy on the said date and time otherwise, the case will be decided on merits and on the material available, in your absence.

//By Orders of the Court//
B.SRINIVAS
ADVOCATE,
SANGAREDDY
Cell : 9618458785

IN THE COURT OF THE VII JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT: AT HYDERABAD
I.A.No. of 2024 In
O.S.No.797 of 2021

Between:
FINVESCO Capital India Pvt. Ltd
...Petitioner/Plaintiff
And
Mr.Tripuraneni Vijaya Narasimhendra. & another
...Respondents/Defendants
1)Mr. Tripuraneni Vijaya Narasimhendra. Sio. Murali Krishna, Aged 34 years (A) H.No.8-1-299/10, Veterinary Colony Shaikpet. Hyderabad - 500 008 (B) H.No.30-204, Rama Colony Near Old Court, Solur, Vijayanagaram-535591 (AP)
2)Mrs.Tripuraneni Krishnamma W/o. Murali Krishna, Aged major (A) H. No.8-1-299/10, Veterinary Colony Shaikpet, Hyderabad-500 008 (B) H.No.30-204, Rama Colony. Near Old Court, Solur, Vijayanagaram-535591 (AP)
Please take notice that the above named plaintiff have filed the above mentioned suit for recovery of money along with interest. The case is stands posted on 30.01.2025 for your appearance as such you are hereby called upon to be present in person or through your counsel before the Honourable Court in Court at 10.30 AM If you fail to attend before the Court on said date, the matter will be heard and decide exparte

// By Order of the Court //
S.VIDYA SAGAR
Advocate
#5-1-444, Jambagh Hyderabad-500095. Phone: 9441009900

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT AND SESSIONS JUDGE, YADADRI-BHUVANAGIRI: AT BHONGIRI
I.A. NO.300 OF 2024
IN
O.S. NO.45 OF 2018

BETWEEN:
Smt Varakantham Sunitha Reddy
...Petitioner/ Plaintiff
AND
M. Raji Reddy ando thers
...Respondents/ Defendant No.1 to 7 & Proposed Defendant no.8 to 11

NOTICE

To
11.Srikanth Tiwari, S/o. Mahesh Kumar Tiwari, Age 29 years, Occ: Business, R/o. H.No.5-5-57/13/J, Durusalam, Goshamahal, Nampally, Begum Bazar, Hyderabad.
That the above case is posted on 27-01-2025 for your appearance and in case, If you the above addressee herein fail to attend before the above said court In the above said case on 27-01-2025 at 10.30AM, the matter will be decided exparte.

(BY THE ORDER OF THE HON'BLE COURT)
G.SREENIVAS REDDY
ADVOCATE:
BHONGIR
Cell: 98484 11034

IN THE COURT OF THE HON'BLE I ADDL. SENIOR CIVIL JUIGE: RANGA REDDY DIST: AT: L.B.NAGAR
O.S.No. 597 of 2024

Between:-
Smt.Burugu srilatha & 3 others.
...Plaintiffs.
AND
Anil Kumar Guje & another.
...Defendants.
To:
All Concerned (defendant No.2).
Please take notice that the above named plaintiffs i.e. Smt. Burugu Srilatha, Smt.Bheemarapu Swarna Latha, Smt.Nallamalli Snehalatha and Smt. Seelam Swathi has filed the a bove said suit for Declaration to declare them as the legalheirs of their deceased mother Smt. Manchu konda Manemma who died on 10-12-2022 in respect of property bearing Municipal No.11-5-58/E, plot No.33(part) in Sy. No.9/2 and 9/3, admeasuring 113.88 Sq.yds. situated at Venkateswara colony, Saroornagar, R.R. Dist. before the above said Hon 'ble Court, and the same is posted to 10-01-20 25 for the appearance of any concerned persons, SO be present before the Hon 'ble Court on 10-01-2025 at 10.30 AM with relevant documentary evidence, Otherwise the matter will be decided by the Hon 'ble Court as per law.

// BY ORDER OFTHE COURT//
M/s M.VEERESHAM,
Advocate.
19-1-658 Doodhbowli, Hyderabad-T.S.
Cell No: 9849834481

IN THE COURT OF THE HON'BLE 1 ST ADDL. JUNIOR CIVIL JUDGE, MEDCHAL MALKAJGIRI DISTRICT: AT: KUKATPALLY.
O.S.NO.636 OF 2024

BETWEEN:
1.Malladi Venkata Sastry S/o Late Malladi Viswanadha Sarma,
2.M.S.A Sirisha W/o.R.Sarat Chandra, D/o.Malladi Venkata Sastry R/o.Plot No.136/A, Old Post Office Lane, Amma Homoeo Care, Santhnagar, Hyderabad, Telangana- 500018
3.Malladi Vishwanadh S/o.Malladi Venkata Sastry, S.no.1 and 3 R/o. H.No.13-1-81/1/a, Mothi Nagar, Behind community hall, Balanagar(M), Hyderabad, Telangana- 500018
... Plaintiffs
AND
1.The Tahsildar Balanagar Mandal FC8X+F78, C22/4 1DA, Balanagar X Roads Balanagar, Hyderabad 500037
2.All Concerned. ...Defendants.
To.
2.All concerned
Whereas, the above-named plaintiffs have instituted the above a suit against you for declaration of the legal heirs of Late Malladi Bhanumathi Sridevi W/o Malladi Venkata Sastry who died on 15.04.2024. You are hereby summoned to appear before the Hon'ble I Addl. Junior Civil Judge, Medchal-Malkajgiri District at Kukatpally on the 20 th day of January 2025 at 10.30 A.M. in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the above suit. Please take notice that in default of your appearance the above matter will be heard & determined in your absence.

(By order of the Hon'ble court)
"SUCHARITHA LAW CHAMBERS"
CH. AVINASH KUMAR
Advocate
#3-4-759, Second floor, adj. to rushil's pharmacy, opp to hp petrol, Barkat Pura Hyderabad-500027, Cell:9700400311



మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ సీఐ సుధాకర్‌ను బాలాపూర్ పోలీస్ స్టేషన్‌లో రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ మాజీ అధికార ప్రతినిధి బొర్ర రవి మాదిగ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత పూల మాలలు వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చింతల చిన్న, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మస్కూరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - బడంగ్‌పేట్

వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ-హయత్‌నగర్

వ్యక్తి అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రవిశంకర్ కాలనీ, హయత్ నగర్‌కు చెందిన గోకల వెంకటేష్‌ను ఈ నెల 25న వాళ్ళ అన్న పోకల గాబ్రెల్ క్రిస్మస్ పండుగకు ఇన్వైట్ చేశారు. ఈ క్రమంలో వెంకటేష్ క్రిస్మస్‌కు తన అన్నవాళ్ల దగ్గరికి వెళ్దాం అని తన భార్య పల్లవితో చెప్పాడు. దానికి తను నేను రాలేను.. నా ఆరోగ్యం బాలేదు, మీరు వెళ్ళండి అని సమాధానం చెప్పింది. దీంతో పోకల వెంకటేష్ మనస్థాపం చెంది ఆఫీస్‌కి వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. ఎంతకీ ఇంటికి తిరిగి రాకపోవడంతో అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రాజకీయాలకు అతీతంగా అండగా ఉంటా



ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ-దిల్‌సుఖ్‌నగర్

రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. అనారోగ్యానికి గురైన ఆర్కేపురం డివిజన్‌కు చెందిన సంతోషి అనే మహిళకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఒక లక్షా 25 వేల రూపాయలు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆ చెక్కును ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి శుక్రవారం లబ్దిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి.. వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రతి పక్షానికి చెందిన ఎమ్మెల్యేగా ప్రజా సమస్యలపై ఒక వైపు ప్రభుత్వంపై పోరాటం చేస్తునే మరో వైపు మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా ప్రయత్నం చేస్తానని భరోసా ఇచ్చారు. అర్హులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్కేపురం డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, డివిజన్ పార్టీ నేతలు వెంకటేష్, వలిగొండ దీపు, శ్రీకాంత్, నవీన్, పాండు తదితరులు పాల్గొన్నారు.

'న్యూ మాస్టర్ మైండ్స్' సాంస్కృతిక దినోత్సవం



వ్యాపారవేత్త కార్వాన్ లక్ష్మారెడ్డి

నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న న్యూ మాస్టర్ మైండ్ జూనియర్ కళాశాలలో ఘనంగా సాంస్కృతిక దినోత్సవ వేడుకలను శుక్రవారం నిర్వహించినట్టు వ్యాపారవేత్త కార్వన్ లక్ష్మారెడ్డి అన్నారు. తర్వాత మాస్టర్ మైండ్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యా అనుభవాన్ని మెరుగుపరచడంలో విద్యార్థులలో కమ్యూనిటీ (టీమ్‌వర్క్) భావాన్ని పెంపొందించడంలో కళాశాలల్లో సాంస్కృతిక దినోత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. వైవిధ్యాన్ని ప్రోత్సహించటానికి సాంస్కృతిక ఉత్సవాలు జరపాలని తెలిపారు. ఈ సాంస్కృతిక ఉత్సవాల వలన విద్యార్థులు విభిన్న నేపథ్యాలను తెలుసుకోవటమే కాకుండా, విభిన్న సంప్రదాయాలు దృక్కోణాల పట్ల అవగాహన గౌరవాన్ని ప్రోత్సహిస్తాయన్నారు. సృజనాత్మకత ప్రతిభను ప్రోత్సహించడంతో విద్యార్థులు సంగీతం, నృత్యం, కళ ఇతర సృజనాత్మక రంగాలలో తమ ప్రతిభను ప్రదర్శించడానికి సాంస్కృతిక ఉత్సవాలు ఒక వేదికను అందిస్తాయని తెలిపారు. కళాశాల సెక్రెటరీ డా. పాండు మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం, పాల్గొనడం ద్వారా జట్టుకృషి(టీం వర్క్) నాయకత్వం లక్షణాలు పెరుగుతాయని విద్యార్థులు ఒకరికి ఒకరు సహకరించడం, సమయాన్ని నిర్వహించడం(టైం మేనేజ్మెంట్) బాధ్యతలను (రెస్పాన్సిబిలిటీ లు) నిర్వర్తించడం నేర్చుకుంటారన్నారు.

కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... సాంస్కృతిక ఉత్సవం జరుపుకోవడం ద్వారా కళాశాలలు విద్యా ప్రయాణాన్ని సుసంపన్నం చేయడమే కాకుండా విభిన్నమైన, పరస్పరం అనుసంధానించబడిన ప్రపంచంలో అభివృద్ధి చెందడానికి విద్యార్థులను సిద్ధం చేస్తాయన్నారు. ఈ వేడుకలలో కళాశాల యాజమాన్యం, చైర్మన్ డాక్టర్ ఎం జగన్ మోహన్ రావు, డాక్టర్ పాండు సెక్రటరీ డైరెక్టర్స్ నాగేంద్ర, లగ్ పతి, నవనీత, డిపార్ట్మెంట్ హెడ్ శ్రీధర్ రెడ్డి, అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణ ఏర్పాటులో విశ్వకర్మల పాత్ర కీలకం'



నవతెలంగాణ-దిల్‌సుఖ్‌నగర్

తెలంగాణ ఏర్పాటులో విశ్వకర్మల పాత్ర కీలకం అని మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. అఖిల భారత విశ్వ కర్మ మహాసభ తెలంగాణ రాష్ట్ర సమావేశం కొత్తపేట బీజేఆర్ భవన్‌లో శుక్రవారం కౌల జగన్నాథం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఈటల రాజేందర్ మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం జీవితాన్ని త్యాగం చేసిన కాసోజు శ్రీకాంత్ కూడా విశ్వకర్మ కు చెందిన యువకుడు అని గుర్తుచేశారు. తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్, మారోజు వీరన్న, కాసోజు శ్రీకాంత్ చారిలు విశ్వకర్మ సామాజిక వర్గం నుంచి వచ్చిన వారేనని వివరించారు. భారత దేశ ప్రధాని మోడీకి గుజరాత్‌లో అతి దగ్గరగా ఉన్న సామాజిక వర్గం ఏదైనా ఉందంటే అది విశ్వకర్మ వారేనని పేర్కొన్నారు. సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఎదగడానికి విశ్వకర్మలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. విశ్వ కర్మలు విడివిడిగా కాకుండా కలివిడిగా కలిసి ఉండాలని సూచించారు. అఖిల భారత విశ్వ కర్మ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కౌల జగన్నాథం మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలు, చట్టసభల్లో కూడా విశ్వకర్మలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అమరుడు తల్లి కాసోజు శంకరమ్మ మాట్లాడుతూ బహుజనుల త్యాగాలతో అగ్రవర్ణాలు అధికారంలోకి వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్, మారోజు వీరన్న, కాసోజు శ్రీకాంత్ చారిల త్యాగాలు వృథా కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామల రంగారెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ భాస్కరా చారి, కార్పొరేటర్లు రాధా దీరజ్ రెడ్డి, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కురుమ సంఘం అధ్యక్షుడిగా గౌర

నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ గ్రామంలో రాష్ట్ర కురుమ సంఘం ఉపాధ్యక్షులు కిస్టమోని సదానందం కురుమ, ఇక్కె సత్యనారాయణ కురుమ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శుక్రవారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా గౌర సాయి కుమార్ కురుమ, ఉపాధ్యక్షులుగా గౌర రాకేష్ కురుమ, కొండ్రు చంద్రయ్య కురుమ, గౌర కొమరయ్య కురుమ, కడారి భిక్షపతి కురుమ, ప్రధాన కార్యదర్శిగా చిన్న రావుల రవీందర్ కురుమ, సహాయ కార్యదర్శులుగా దొడ్డి వెంకటేష్ కురుమ, గౌర శ్రీనివాస్ కురుమ, కోశాధికారిగా గౌర శివ కుమార్ కురుమ, సలహాదారులుగా దడిగే ఐలయ్య కురుమ, దొడ్డి మల్లికార్జున్ కురుమ, గౌర సురేష్ కురుమ, గౌర సత్తయ్య కురుమ, గౌర శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా దాండ్ల మహేందర్ కురుమ, కడారి నరసింహ కురుమ, గౌర కుమార్ కురుమ, దడిగే రాఘవేందర్ కురుమ, గౌర వెంకటేష్ కురుమలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



గొప్ప మానవతా వాది మన్మోహన్ సింగ్





నవతెలంగాణ-ఎల్బీనగర్

ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ చౌరస్తాలోని రాజీవ్ గాంధీ విగ్రహం దగ్గర మాజీ ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మెన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ..భారతదేశాన్ని ఆర్థికంగా గ్లోబల్ స్థాయికి చేర్చిన మహానుభావుడు మన్మోహన్ సింగ్ అని గుర్తుచేశారు. దేశ అభివృద్ధిలో ఆయన అందించిన విశేషమైన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. ఆయన మరణంతో కాంగ్రెస్ పార్టీ ఒక దిశా నిర్దేశకుడిని, ఓ విలక్షణ నేతను కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలను ప్రజలకు హక్కుగా పరిచయం చేసిన ఘనత మన్మోహన్ సింగ్‌కే దక్కుతుందని అన్నారు. గణనీయమైన చట్టాలు అమలు చేశారని గుర్తు చేశారు. విద్యా హక్కు చట్టం, సమాచార హక్కు చట్టం, ఆహార భద్రత చట్టం, ఉపాధి హామీ చట్టం ఈ కీలకమైన చట్టాలు ఆయన ప్రధానమంత్రిగా ఉన్న సమయంలోనే అమల్లోకి వచ్చాయని గుర్తుచేశారు. డా. మన్మోహన్ సింగ్ చిత్తశుద్ధి, ప్రజాసేవ పట్ల అంకితభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని మల్‌రెడ్డి రాంరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని సీనియర్ కాంగ్రెస్ ముద్దగోని రాం మోహన్ గౌడ్, సంకపెల్లి సుదీర్ రెడ్డి, జక్కిడి ప్రభాకర్ రెడ్డి, వజీర్ ప్రకాష్ గౌడ్, రాజ శేఖర్ రెడ్డి, శాలిని, నాయకులు, డివిజన్ అధ్యక్షులు, వివిధ విభాగాల ప్రతినిధులు, చైర్మెన్లు, డైరెక్టర్లు, మహిళా నాయకులు, ఎస్సీ సెల్, ఎస్టీ సెల్, మైనార్టీ సెల్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు, ఇతర కాంగ్రెస్ శ్రేణులు, కార్యకర్తలు సంఖ్యలో పాల్గొన్నారు.

నవతెలంగాణ-దిల్‌సుఖ్‌నగర్



మన్మోహన్ సింగ్ గొప్ప ఆర్థిక వేత్తనే కాకుండా రాజకీయాల్లో కూడా గొప్ప ఆదర్శ రాజకీయ ప్రముఖులు అని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్, ఓల్డ్ మలక్‌పేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహ్మద్ షఖిల్ కొనియాడారు. మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ మలక్‌పేటలోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ మృతి ఒక్క కాంగ్రెస్ పార్టీకే కాకుండా యావత్ భారత దేశానికి తీరని లోటని అన్నారు. మన్మోహన్ సింగ్ రాజకీయ జీవితం ముందు తరాల వారికి ఎంతో మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. నెహ్రూ కుటుంబం తర్వాత ఎక్కువ కాలం ప్రధానంగా పని ఘనత కూడా మన్మోహన్ సింగ్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అక్బర్ బాగ్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్, సైదాబాద్ డివిజన్ అధ్యక్షుడు చక్రపాణి, సీనియర్ కాంగ్రెస్ నేతలు చౌకి రవి కుమార్ పటేల్, విఘ్నేష్ తెలంగాణ రాష్ట్ర దళిత నాయకుడు సుంకుసాల సంపత్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - దిల్‌సుఖ్‌నగర్



గొప్ప మానవతావాది మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అని పీసీసీ ప్రధాన కార్యదర్శి చేకొలేకర్ శ్రీనివాస్ అన్నారు. మన్మోహన్ సింగ్ మృతి పట్ల ఆయన స్పందిస్తూ మన్మోహన్ సింగ్ ముందు తరాల వారికి ఎంతో మార్గదర్శకంగా నిలుస్తారని కొనియాడారు. విద్యా హక్కు చట్టం, సమాచార హక్కు చట్టం, ఆహార భద్రత చట్టం, ఉపాధి హామీ పథకం వంటి ఎన్నో చట్టాలను రూపొందించిన రాజనీతిజ్ఞుడు మన్మోహన్ సింగ్ అన్నారు. దూరదృష్టి ఉన్న గొప్ప ఆర్థిక వేత్త, ఆదర్శ నేత మన్మోహన్ సింగ్ అని కొనియాడారు.

తెలంగాణ ఏర్పాటులో కీలక పాత్ర...



ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పాత్ర చాలా కీలక పాత్ర పోషించారని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కోట్ల శ్రీనివాస్ తెలిపారు. నీతికి నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అన్నారు. భారత దేశ చరిత్రను ప్రపంచ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగిన ఆర్థిక సంస్కరణలు అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆయన మృతితో కాంగ్రెస్ పార్టీతో పాటు భారత దేశం కూడా గొప్ప నాయకుడిని కోల్పోయిందని కోట్ల శ్రీనివాస్ విచారం వ్యక్తం చేశారు.

నవతెలంగాణ-ఎల్బీనగర్

రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు వెల్లంకి ధనరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో భారతదేశ మాజీ ప్రధాని స్వర్గీయ మన్మోహన్ సింగ్‌కు శుక్రవారం ఘన నివాళులర్పించారు. సరూర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోయిని శంకర్ యాదవ్, ఎన్ఎస్‌యుఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు చింతకింది రంజిత్, మహేశ్వరం నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బేర బాలకిషన్, సరూర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ ఇమ్రాన్ అలీ, సరూర్ నగర్ డివిజన్ మండల యువజన కాంగ్రెస్ యూనస్, సరూర్ నగర్ డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అరుణ, సరూర్ నగర్ డివిజన్ మాజీ వార్డ్ మెంబర్లు కందడి జంగారెడ్డి, లోడి నరసింహ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - మీర్ పేట్

భారత దేశ మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణించడంతో మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బాలాపూర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాదరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జటావత్ రవి నాయక్, కార్పొరేటర్ గజ్జల రామచందర్, ఎడ్ల మల్లేష్ ముదిరాజ్, ఓం ప్రకాష్, బాకు జానయ్య, బాలకృష్ణ గౌడ్, స్వామి నాయక్, సిద్దేశ్వర చారి, వీరన్న రాజేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- బడంగ్ పేట్

దేశ మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు అని మేయర్ పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బడంగ్‌పేట్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్, బడంపేట్ కార్పొరేషన్ కో ఆర్డినేట్ బోయపల్లి గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నేనావత్ బాలు నాయక్, పన్నాల రాజేందర్ రెడ్డి, మహేశ్వరం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వల్లపు సుభాన్ యాదవ్, నాయకులు రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, ఎర్ర జైహింద్, మాజీ సర్పంచ్ మర్రి హన్మంత్ రెడ్డి, సీనియర్ నాయకులు కందాడి శ్రీరామ్ రెడ్డి, నవారు మల్లారెడ్డి, బాలింగని జంగయ్య, పేతుళ్ళ ఆనంద్ రెడ్డి, పుట్టగళ్ల జగన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్ గుల్ గ్రామంలో ఆర్థిక సంస్కరణలో



దేశాన్ని ప్రపంచంలో ఆర్థిక శక్తిగా నిలబెట్టిన ఆర్థికవేత్త, గ్రామీణ పేదల జీవితాల్లో ఉపాధి పథకాన్ని ప్రవేశపెట్టిన ధార్మికుడు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంపూర్ణ సహకారం అందించిన మునివర్యులు భారత మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ హఠాత్ మరణం దేశ ప్రజలలో తీరనిలోటని మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ వల్లపు సుభాన్ యాదవ్ తెలిపారు. నాదర్గుల్ చౌరస్తాలో డాక్టర్ మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మర్రి హనుమంత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీరామ్ రెడ్డి, నాయకులు శ్రీధర్ రెడ్డి, ఆనంద్ రెడ్డి, పుట్టగళ్ల జగన్, అశోక్, వెంకటేష్, బంగారు లింగయ్య, స్వామి, మహేందర్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ - హస్తినాపురం



భారత దేశ మాజీ ప్రధాని డా.మన్మోహన్ సింగ్ మృతి చెందిన నేపథ్యంలో హస్తినాపురం డివిజన్ పరిధిలోని వై జంక్షన్ కూడలి వద్ద కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దెంది శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు మెరుగు రమేష్ రెడ్డి, డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్

మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ శ్రీరామ్ కాలనీలో మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా వివర్స్ సెల్ అధ్యక్షులు మసున రవి కుమార్, కౌన్సిలర్ కెంచ లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



స్థానికుల సమాచారం... వెంటనే స్పందించిన సీపీ



- తనిఖీలు ముమ్మరం
- సర్వత్రా హర్షం వ్యక్తం

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజలకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా విజిబుల్ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తున్న రాచకొండ పోలీస్ కమిషనర్ జీ. సుధీర్‌బాబు ప్రజల సమస్యలపై వెంటనే స్పందిస్తున్నారు. సమస్య ఉందంటూ కమిషనర్‌కు సమాచారం ఇస్తే చాలు వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇదే తరహాలో మహేశ్వరం జోన్‌లోని బాలాపూర్, పహాడి షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నిర్మానుష్య ప్రాంతాల్లో సాయంత్రం, రాత్రి వేళలో పోలీస్ పెట్రోలింగ్‌ను పెంచాలంటూ స్థానికులు రాచకొండ కమిషనర్ సుధీర్ బాబును కోరారు. అందుకు సీపీ వెంటనే స్పందించారు. ఆయా ప్రాంతాలలో వాహనాల తనిఖీలు, పెట్రోలింగ్ ముమ్మురంగా చేయాలంటూ క్షేత్రస్థాయిలో పోలీసులకు ఆదేశాలు జారీచేశారు. బాలాపూర్, పహాడి షరీఫ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ఆర్‌సీఐ రోడ్డు, ఏయిర్‌పోర్టు రోడ్డు, దేవతల గుట్ట, బాలాపూర్ పరిసర ప్రాంతాలలో పెట్రోలింగ్ నిర్వహణతో పాటు ఎస్‌వోటీ పోలీస్‌లకు సైతం నిఘా వేయాలని ఆదేశాలు జారీ చేశారు. సీపీ ఆదేశాలతో క్షేత్ర స్థాయిలో అప్రమత్తమైన పోలీసులు విజిబుల్ పోలీస్‌పై దృష్టిపెట్టి సత్వర చర్యలు తీసుకున్నారు. రాచకొండ కమిషనర్ సామాన్యులు సమాచారం ఇస్తే వెంటనే స్పందిచడంపై సర్వత్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాచకొండ సీపీగా సుధీర్‌బాబు బాధ్యతలు చేపట్టిన తర్వాత సీపీని కలిసేందుకు, తమ సమస్యలను చెప్పుకునేందు సులువైందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుండగా అతిపెద్దదైన రాచకొండ కమిషనరేట్‌లో విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్య ఇవ్వడంతో గణనీయంగా రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో నేరాలు తక్కువగా నమోదయ్యాయి.



భార్యంటే చులకనెందుకు..?

భార్యాభర్తలు ఒకరి మాటను మరొకరు గౌరవించుకుంటేనే కుటుంబాన్ని సాఫీగా నడిపించడం సాధ్యం. అయితే కొన్ని కుటుంబాల్లో పరిస్థితులు దీనికి భిన్నంగా ఉంటున్నాయి. అందుకే అనేక సమస్యలు వస్తున్నాయి. ముఖ్యంగా భర్తలు తమ భార్యల మాటలను పెద్దగా పట్టించుకోరు. ఆమేమో అతనే తన ప్రపంచంగా బతుకుతుంటుంది. అలాంటప్పుడు ఇక ఆ కుటుంబంలో ఎదురయ్యే సమస్యలు అన్నీ ఇన్నీ కావు. అలాంటి ఓ సమస్యే ఈ వారం ఐద్వా అదాలత్‌లో...



సునీతకు 28 ఏండ్లు ఉంటాయి. రాహుల్‌తో పెండ్లి జరిగి ఐదేండ్లు అవుతుంది. వీరికి ఒక పాప ఉంది. ఇద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారు. ఆర్థికంగా ఇద్దరికీ ఎలాంటి ఇబ్బందీ లేదు. కుటుంబ పరంగా కూడా ఎలాంటి సమస్యలూ లేవు. అయితే సునీత మాటకు రాహుల్ అస్సలు విలువ ఇవ్వడు. ఏ విషయంలో కూడా ఆమెను లెక్కచేయడు. వాళ్ళ కుటుంబ సభ్యుల ముందు, స్నేహితుల ముందు ఆమెను అవహేళనగా మాట్లాడుతుంటాడు. ఆమె ఏ విషయంలో అయినా సలహా ఇవ్వబోతుంటే 'ఆమెకేం తెలుసని అడుగుతున్నారు' అంటాడు. ఆమె చేసిన వంటకు కూడా కావాలని ఏదో విధంగా వంకలు పెడుతుంటాడు.

'నీకు ఏమీ తెలియదు. డాడీ ఎప్పుడూ ఇలా అంటారు కదా!' అని అందరి ముందు అనేది. పైగా 'సునీత నీకేం తెలియదు నువ్వు నోరుమూసుకో, ఎందుకు ప్రతి దాంట్లో తలదూరుస్తావు' అంటూ వాళ్ళ నాన్నలాగే అనేది. దాంతో చివరకు పాప కూడా రాహుల్‌లా తయారవుతుందనే దిగులు పట్టుకుంది ఆమెకు.

భర్త ఇలా ప్రతి విషయానికి తప్పుబడుతుంటే సునీతకు చులకనగా ఉండేది. ఇదంతా ఆమెకు చాలా ఇబ్బందిగా ఉండేది. దాంతో 'నిజంగా నాకు ఏం తెలియదా? నేను చేస్తున్న ఉద్యోగానికైనా న్యాయం చేస్తున్నానా లేదా?' అనే అనుమానం వచ్చేది. అయితే ఆఫీసులో ఆమెపై ఇప్పటి వరకు ఎవ్వరూ ఫిర్యాదులు చేయలేదు. పైగా సునీతకు ఏ పని ఇచ్చినా బాగా చేస్తుంది అనే పేరు కూడా ఉంది. అయితే పాపకు ఇప్పుడిప్పుడే మాటలు వస్తున్నాయి. రాహుల్ మాటలు వింటుంది కాబట్టి పాప కూడా 'నీకు ఏమీ తెలియదు. డాడీ ఎప్పుడూ ఇలా అంటారు కదా!' అని అందరి ముందు అనేది. పైగా 'సునీత నీకేం తెలియదు నువ్వు నోరుమూసుకో, ఎందుకు ప్రతి దాంట్లో తలదూరుస్తావు' అంటూ వాళ్ళ నాన్నలాగే అనేది.

దాంతో చివరకు పాప కూడా రాహుల్‌లా తయారవుతుందనే దిగులు పట్టుకుంది ఆమెకు.

సునీత ఇంట్లో పని చేస్తూ, ఉద్యోగం చేస్తూ రాహుల్ కంటే కాస్త ఎక్కువే సంపాదిస్తుంది. కనీసం ఒక మనిషికి ఇవ్వాల్సిన గౌరవం కూడా ఆమెకు ఇవ్వడం లేదు. ఇన్నేండ్ల నుండి అతనే తన ప్రపంచంగా బతికిన ఆమె ఇప్పుడు తన పరిస్థితికి తనే జాలి పడుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఐద్వా అదాలత్‌కు వచ్చి 'మేడమ్ ఒకప్పుడు నాపై నాకు నమ్మకం ఉండేది. కానీ ఇప్పుడు ఆ నమ్మకం మొత్తం పోతుంది. పైగా నాపై నాకే జాలేస్తుంది. ఇలాగే ఉంటే నా పరిస్థితి ఏంటో నాకే అర్థం కావడం లేదు' అంటూ కన్నీరు పెట్టుకుంది.

ఆమె చెప్పింది మొత్తం విని రాహుల్‌ని పిలిపించి మాట్లాడితే 'సునీత నాకంటే మంచి ఉద్యోగం చేస్తుంది. నా కంటే ఎక్కువ సంపాదిస్తుంది. నా కంటే ఆమెకు తెలివి ఎక్కువ. ఎవరితో ఎప్పుడు ఎలా మాట్లాడాలో ఆమెకు బాగా తెలుసు. అందుకే మా కుటుంబ సభ్యులు, నా స్నేహితులు ఆమెను ప్రతి విషయంలో సలహాలు అడుగుతుంటారు. మా వాళ్లయితే నా కంటే ఎక్కువగా ఆమెనే ప్రేమగా చూసుకుంటారు. నేను కూడా సునీతను 'నువ్వు చాలా తెలివైన దానివి, ఏ పని అయినా సులువుగా చేయగలవు' అని అంటే నన్నెక్కడ తక్కువగా చూస్తుందో అని అందరి ముందు అలా హేళన చేసి మాట్లాడుతుంటాను.

నేనేమన్నా సునీత పెద్దగా పట్టించుకోదు. నాతో ప్రేమగానే ఉంటుంది. ఈ లోకంలో ఆమెకు నాకంటే ఏదీ ఎక్కువ కాదు. ఆమె అలాగే ఉండాలి. నేను ఆమెను అందరి ముందు మెచ్చుకోవడం ఆమెకు ఇష్టం. కానీ నేను ఎప్పుడూ ఆ పని చేయలేదు. సునీత చెప్పినట్లుగానే నేను ఎప్పుడూ ఆమెను గౌరవించలేదు. దానికి కారణం నాలో ఉన్న అభద్రతా భావమే. అయితే ఆమె అంటే నాకు చాలా ఇష్టం. కానీ ఇంత చిన్న విషయానికి మీ వరకు వస్తుందని అనుకోలేదు' అంటూ చెప్పుకొచ్చాడు.

అతని మాటలు విన్న తర్వాత 'రాహుల్ మీరు తప్పుగా ఆలోచిస్తున్నారు. ఏ భార్యా తన భర్తను తక్కువ చేయాలని చూడదు. కానీ మీరు మీ ప్రవర్తనతో ఆమెపై ఆమెకున్న నమ్మకాన్ని చంపేస్తున్నారు. అలా భార్యను తక్కువ చేసి మాట్లాడడం సరైనది కాదు. పైగా మీ పాప ముందు కూడా అలాగే అంటున్నారు. దీని వల్ల తర్వాత కాలంలో చాలా ఇబ్బందులు ఎదురవుతాయి. ఆమెకు మీరంటే ప్రాణమని మీరే చెబుతున్నారు. ఇక మీకెందుకు అంత అభద్రతా భావం. మీరు ప్రేమగా దగ్గరకు తీసుకుంటే ఆమె ఎప్పటికీ మిమ్మల్ని తక్కువ చేసి మాట్లాడదు. కనీసం ఇప్పుడు కూడా ఆమె మీ గురించి మా దగ్గర తక్కువగా ఏమీ చెప్పలేదు. కేవలం తను పడుతున్న బాధను మాత్రమే చెప్పింది. భార్యాభర్తలు ఒకరినొకరు గౌరవించుకోవాలి. ఒకరిలో ఉన్న టాలెంట్‌ను మరొకరు గుర్తించి గొప్పగా చెప్పుకోవడంలో తప్పేంలేదు.

మీరు ప్రేమగా దగ్గరకు తీసుకుంటే ఆమె ఎప్పటికీ మిమ్మల్ని తక్కువ చేసి మాట్లాడదు. కనీసం ఇప్పుడు కూడా ఆమె మీ గురించి మా దగ్గర తక్కువగా ఏమీ చెప్పలేదు. కేవలం తను పడుతున్న బాధను మాత్రమే చెప్పింది. భార్యాభర్తలు ఒకరినొకరు గౌరవించుకోవాలి. ఒకరిలో ఉన్న టాలెంట్‌ను మరొకరు గుర్తించి గొప్పగా చెప్పుకోవడంలో తప్పేంలేదు.

అనవసరంగా ఏవేవో ఊహించుకొని మంచి జీవితాన్ని పాడుచేసుకోవద్దు. మిమ్మల్ని ఎంతో ప్రేమించే భార్య దొరకడం మీ అదృష్టం. పైగా మీ ఇంట్లో వాళ్లందరినీ ఆమె ఎంతో ప్రేమగా చూసుకుంటుంది. ఇక ఇంతకు మించి మీకేం కావాలి. సంతోషంగా ఉండాల్సింది పోయి మీ చేతులారా మీరే సమస్యలు తెచ్చిపెట్టుకుంటున్నారు. మీలోని అభద్రతా భావాన్ని పక్కనపెట్టి మీ భార్యను గౌరవించండి. అప్పుడు మీపై మీకు మరింత ప్రేమ కలుగుతుంది. మీ బంధువులు కూడా మిమ్మల్ని ఎంతో గౌరవిస్తారు' అని చెప్పాము.

'మీరు చెప్పింది నిజమే మేడం. అనవసరంగా నేనే ఏవేవో ఊహించుకొని ఇన్ని రోజులు ఇలా ప్రవర్తించాను. దీని వల్ల ఇద్దరం సంతోషంగా ఉన్నదీ లేదు. ఇప్పటి నుండి మీరు చెప్పినట్టే ఉంటాను. సునీతను ఇబ్బంది పెట్టకుండా చూసుకుంటాను. ఆమెను చులకన చేసి మాట్లాడను. నేను చేసిన పొరపాటు ఏంటో నాకు తెలిసొచ్చింది. నా వల్ల నా భార్య ఎంత బాధపడుతుందో అర్థమయ్యేలా చెప్పినందుకు మీకు ధన్యవాదాలు' అని చెప్పి సునీతకు సారీ చెప్పి తీసుకెళ్లాడు.

ఐద్వా అదాలత్
సెల్: 9490098024

- వై వరలక్ష్మి
9948794051

ట్యాన్ తగ్గాలంటే...

వాతావరణంలో మార్పులు, దుమ్ము, దూళి, నిత్యం ఎండలో తిరగాల్సి రావడం, రాత్రీ పగలూ తేడా తెలియకుండా లైట్ల కాంతిలో పనిచేయాల్సి రావడం వల్ల ముఖం నిర్జీవంగా మారుతుంది. ముఖం ట్యాన్ పట్టి.. కాంతివిహీనంగా మారుతుంది. దీనిని వదలించుకోవడానికి, ముఖాన్ని కాంతివంతంగా మార్చుకోవడానికి.. క్రీమ్‌లు వాడటం, ఫేషియల్స్ చేయించుకుంటూ ఉంటారు. కానీ, తేనెతో పాటు సహజ పదార్థాలతో ఈజీగా ట్యాన్,



నలుపుదనం వదిలించుకోవచ్చు. అవేంటో చూద్దాం...

పెరుగుతో

- రెండు టేబుల్ స్పూన్ల పెరుగు, టేబుల్ స్పూను తేనె తీసుకుని బాగా కలపాలి.
- ఈ మిశ్రమాన్ని ముఖానికి ప్యాక్‌లా వేసుకోవాలి.
- పదిహేను నిమిషాల తర్వాత కడగాలి.

పసుపుతో

- టీ స్పూను తేనెలో అర టీస్పూను పసుపు వేసి బాగా కలిపి ముఖానికి రాసుకోవాలి
- ఇరవై నిమిషాల తర్వాత కడిగేయాలి.
- పై రెండు ప్యాక్‌లను వారానికి మూడు సార్లు వేయడం వల్ల చర్మం మృదువుగా మారడమేగాక, ఆరోగ్యంగా ఉంటుంది.

సహజసిద్ధ నిగారింపు

- రెండు టేబుల్ స్పూన్ల బియ్యప్పిండిలో టీస్పూను తేనె, టీస్పూను రోజ్ వాటర్ వేసి చక్కగా కలపాలి.
- ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసుకోవాలి.
- పదిహేను నిమిషాలపాటు అలాగే ఉండనివ్వాలి.
- బాగా ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి.
- ఈ ప్యాక్‌ను వారానికి ఒకసారి వేసుకోవడం వల్ల ముఖం మీద పేరుకు పోయిన ట్యాన్ తగ్గుముఖం పడుతుంది.
- రోజ్ వాటర్ ముఖానికి సహజసిద్ధ నిగారింపుని ఇస్తే, తేనె చర్మానికి తేమనందిస్తుంది.

పతనం దిశలోనే రూపాయి

ముంబయి : ప్రపంచ మార్కెట్‌లో రూపాయి మారకం విలువ ఇప్పటికే భారీగా పడిపోగా.. మరింత అగాథంలోకి జారుకుని నూతన కనిష్టాన్ని చవి చూసింది. గురువారం అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ 23 పైసలు క్షీణించి 85.50 కనిష్ఠ స్థాయికి దిగజారింది. భారత కరెన్సీ చరిత్రలోనే ఇది మరో అత్యంత కనిష్టం. ఇంటర్ బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో రూపాయి విలువ 85.31 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో ఏకంగా 53 పైసలు క్షీణించి 85.80 రికార్డ్ కనిష్ఠ స్థాయిని తాకింది. 2023 ఫిబ్రవరి 2న రూపాయి ఒక్కపూటలోనే రికార్డ్ స్థాయిలో 68 పైసల విలువ కోల్పోయింది. ఆ తర్వాత అత్యధికంగా తొలిసారి ఇప్పుడే నష్టపోయింది. డిసెంబర్ నెల చివరి రోజులు కావడంతో ఫారెక్స్ ట్రేడర్లు తమ చెల్లింపుల డిమాండ్‌ను చేరుకోవడానికి డాలర్ల కొనుగోళ్లకు ఎగబడుతున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో చోటు చేసుకుంటున్న అత్యంత బలహీనమైన గణంకాలు, స్టాక్ మార్కెట్ల వరుస పతనం, విదేశీ సంస్థాగత పెట్టుబడులు తరలిపోవడం, పేలవ ఎగుమతుల తీరు, దిగుమతులు పెరగడం తదితర అంశాలు రూపాయి విలువను రోజురోజుకు పడిపోయేలా చేస్తోన్నాయి.

పెండింగ్ బిల్లులివ్వండి..

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేసి అప్పుల్లో తమల్ని ఆదుకోవాలని మాజీ సర్పంచులు రాష్ట్ర ప్రభుత్వాన్ని వేడుకున్నారు. సర్పంచుల సంఘాల జేఏసీ పిలుపులో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లోని లంగర్‌హౌస్‌లో గల బాపూఘాట్ వద్ద మాజీ సర్పంచులు నిరసన కార్యక్రమం చేపట్టారు. గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్ మాట్లాడుతూ..మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం ఊర్లలో అప్పులు చేసి అభివృద్ధి పనులు చేసిన మాజీ సర్పంచుల పట్ల సర్కారు వివక్ష తగదన్నారు. అప్పుల బాధ తాళలేక కొందరు మాజీ సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారనీ, మరికొందరు వేధింపులు తాళలేక ఊరిడ్చి పట్టణాల్లో ఎవ్వరికీ కనపడకుండా బతకాల్సిన దుస్థితి వచ్చిందని వాపోయారు. బిల్లులు విడుదల చేయాలని రాష్ట్రమంతటా గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేసి నిరసన తెలిపామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా మాజీ సర్పంచులకు చెల్లించాల్సిన బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. బాపూఘాట్ వద్ద చేపట్టిన నిరసనలో జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్‌రెడ్డి, కేశబోయిన మల్లయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, రాష్ట్ర నాయకులు గణేశ్, నవీన్‌కుమార్, పల్లె వెంకటేశం, ప్రణీత్‌చంద్, బాషబోయిన ఉప్పలయ్య, రమేశ్, పూర్ణచందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు ప్రాజెక్టులో కదలిక

(మొదటిపేజీ తరువాయి)

విమర్శలు సైతం వచ్చాయి. ఈనేపథ్యంలో నీటిపారుదల శాఖ అధికారులు మరోసారి అంచనాల వ్యవహారంపై సమీక్ష చేశారని తెలిసింది. ప్యాకేజీలు, కంపెనీల వారీగా పనులు, నిధులకు సంబంధించి సమీక్ష చేశారని సమాచారం. పూర్తిస్థాయిలో మరోసారి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమక్షంలో సమీక్ష చేయనున్నట్టు తెలిసింది.

నవభారత శిల్పిని కోల్పోయాం

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆర్థిక సంక్షోభం నుంచి నవభారత దేశాన్ని నిర్మించిన మహా నాయకుడు, మాజీ ప్రధానిని ఈ దేశం కోల్పోయిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ఆయన మరణం పట్ల విచారం వ్యక్తం చేశారు. వివాదాలు, విమర్శలకు తావు లేకుండా రాజకీయ ప్రజా జీవితంలో గౌరవ మర్యాదలు ఎలా పాటించాలో తన ప్రవర్తన ద్వారా చూపారని భట్టి తెలిపారు. మన్మోహన్ సింగ్ గొప్ప ఆర్థికవేత్త, మహానాయకుడు, సంస్కరణవాది అన్నింటికీ మించి గొప్ప మానవతావాది అని తన సందేశంలో తెలిపారు.

టెట్ అభ్యర్థులు 'మెహందీ' వేసుకురావొద్దు

(మొదటిపేజీ తరువాయి)

పొందుపర్చింది. వచ్చేనెల రెండు నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానం (సీబీఆర్టీ)లో రాతపరీక్షలు జరుగుతాయి. వచ్చేనెల ఎనిమిది, తొమ్మిది, పది, 18 తేదీల్లో పేపర్-1, అదేనెల రెండు, ఐదు, 11, 12, 19, 20 తేదీల్లో పేపర్-2 పరీక్షలను నిర్వహిస్తారు. ప్రతిరోజూ రెండు విడతల్లో ఈ పరీక్షలను నిర్వహిస్తారు. మొదటి విడత ఉదయం తొమ్మిది నుంచి 11.30 గంటల వరకు, రెండో విడత మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతుంది. అభ్యర్థులు చేతులపై మెహందీ (గోరింటాకు) వేసుకుని పరీక్షకు హాజరు కావొద్దని విద్యాశాఖ అధికారులు సూచించారు. బయోమెట్రిక్ హాజరు విధానం అమల్లో ఉంటుంది. పరీక్ష ప్రారంభానికి రెండు గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతిస్తారు. మొదటి విడత పరీక్షకు ఉదయం 7.30 గంటల నుంచి, రెండో విడతకు మధ్యాహ్నం 12.30 గంటల నుంచి అభ్యర్థులకు పరీక్షా కేంద్రాల్లోకి ఉంటుంది. మొదటి విడతకు ఉదయం 8.45 గంటలకు, రెండో విడతకు మధ్యాహ్నం 1.45 గంటలకు అంటే పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందే పరీక్షా కేంద్రాల గేట్లు మూసివేస్తామని అధికారులు స్పష్టం చేశారు. అభ్యర్థులు బ్లాక్/బ్లూ పెన్ను, హాల్‌టికెట్‌తోపాటు ఫొటో గుర్తింపు కార్డు (ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు, పాన్, ఓటరు గుర్తింపు)ను వెంట తెచ్చుకోవాలని సూచించారు. అభ్యర్థులు క్యాలికులేటింగ్ పరికరాలు, లాగరిథమ్ టేబుళ్లు, క్యాలిక్యులేటర్, పేజర్, సెల్‌ఫోన్లు (స్విచ్ఛాఫ్ చేసి కూడా), స్మార్ట్ వాచ్‌లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు వంటివి పరీక్షా కేంద్రాల్లోకి తీసుకురావడానికి అనుమతి లేదని విద్యాశాఖ తెలిపింది. సాంకేతిక కారణాలతో వచ్చేనెల 11న మొదటి విడత, 20న జరిగే మొదటి, రెండో విడతల హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచలేదని పేర్కొంది. శనివారం వారి హాల్‌టికెట్లను అందుబాటులో ఉంచుతామని స్పష్టం చేసింది.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

(మొదటిపేజీ తరువాయి)



పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను కేంద్ర హోం మంత్రి అవమానించారన్నారు. అమిత్ షా మాటల్లో అహంకారం, మనువాద దృక్కోణం దాగి ఉన్నాయన్నారు. అమిత్ షా వెంటనే దేశ ప్రజలకు, పార్లమెంటుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కార్మికులు పనిచేసే అన్ని కేంద్రాల్లో నిరసనలకు పిలుపునిచ్చినట్టు తెలిపారు. అమిత్ షా వాఖ్యలను ప్రధాని ఖండించకపోగా సమర్థించే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. రాజ్యాంగాన్ని ఒప్పుకోని మనువాదుల వారసత్వ పార్టీ బీజేపీ అని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని పూర్తిగా రూపుమాపే పద్ధతిలో పనిచేస్తోందని ఆరోపించారు. కార్మిక హక్కులను పూర్తిగా కాలరాస్తున్నదన్నారు. వచ్చే సంవత్సరం ఏప్రిల్ నుంచి కార్మిక చట్టాలన్నింటినీ నాలుగు లేబర్ కోడ్‌లుగా అమలు చేసే ప్రయత్నంలో ఉందన్నారు. దేశంలో ఉద్యోగాలు లేక యువత, గిట్టుబాటు ధరల్లేక రైతు, వేతనాల కోసం కార్మికులు అనేక ఉద్యమాలు నిర్వహిస్తున్న క్రమంలో అమిత్ షా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం.. ప్రజా ఉద్యమాలను పక్కదారి పట్టించడం కోసమేనని అన్నారు. సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్ మాట్లాడుతూ.. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాతకు అవమానం జరిగిందన్నారు. అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో ఉద్యమం ఉధృతమవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, రాష్ట్ర నాయకులు సోమన్న, నగర అధ్యక్షులు కుమారస్వామి, నాయకులు సి.మల్లేష్, డీఎల్.మోహన్, జి.రాములు, ఎం.సత్యనారాయణ, మహేందర్, మల్లయ్య, జగదీశ్వర చారి పాల్గొన్నారు.

మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తొలగించాలని సీఐటీయూ జిల్లా నాయకులు కూకటికారి బుచ్చయ్య, జన్నారం మండల కన్వీనర్ అంబటి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో అమిత్ షా దిష్టిబొమ్మ దహనం చేశారు. రాజాపూర్ మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు.

సంగారెడ్డిలో ఐబీ నుంచి న్యూ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బీరం మల్లేశం మాట్లాడుతూ.. కోట్లాది మంది దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల ప్రజల మనోభావాలను అవమానపరిచేలా అమిత్ షా వ్యాఖ్యానించారని అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. సిద్దిపేటలో కొత్త బస్టాండ్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కొండపాక మండలం వెలికట్ట చౌరస్తా వద్ద అమిత్ షా దిష్టిబొమ్మ దహనం చేశారు.

చితికిపోతున్న సంఘటిత రంగం

(మొదటిపేజీ తరువాయి)

ఉదారవాద విధానాలే ఈ నిరుద్యోగానికి ప్రధాన కారణం.

ప్రభుత్వ రంగ సంస్థల్లో...

మోడీ హయాంలో ఉపాధి రేటు 42.8 శాతం నుండి 37.4 శాతానికి పడిపోయింది. యువతలో నిరుద్యోగ రేటు 2016-17లో 29 శాతం ఉంటే 2022-23లో 45.4 శాతం ఉంది. మోడీ హయాంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు తగ్గిపోయాయి. యూపీఏ-2 పాలనలో 2013లో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో (సీపీఎస్‌ఈ) 17.3 లక్షలు, 2014లో 16.9 లక్షల మంది పని చేస్తే మోడీ పాలనలో ఆ సంఖ్య 2019లో 15.1 లక్షలు, 2020లో 14.7 లక్షలు, 2021లో 13.7 లక్షలకు పడిపోయింది. 2022లో 14.6 లక్షలకు పెరిగినా ఇప్పటికీ కోవిడ్‌కు ముందున్న స్థాయి కంటే తక్కువగానే ఉంది. అదే సమయంలో సీపీఎస్‌ఈలలో కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య పెరుగుతోంది. 2013లో 16.8 శాతం, 2014లో 18.3 శాతంగా ఉన్న కాంట్రాక్ట్ కార్మికులు 2020, 2021, 2022లో వరుసగా 34 శాతం, 35 శాతం, 35.6 శాతానికి పెరిగారు. ప్రభుత్వంలో కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఖ్య తొమ్మిదేండ్లలో రెట్టింపు అయింది. సీపీఎస్‌ఈలలో దినసరి వేతన కార్మికుల సంఖ్య కూడా పెరుగుతూనే ఉంది. ఈ ధోరణి కార్మికుల కొనుగోలు శక్తిపై ప్రతికూల ప్రభావం చూపుతోంది.

విద్యా రంగంలో...

ఇక విద్యా రంగంలో పరిస్థితులను పరిశీలిస్తే...మోడీ హయాంలో బోధన, బోధనేతర సిబ్బంది సంఖ్య ఎదుగూ బొదుగూ లేకుండా ఉంది. దశాబ్ద కాలంలో బోధనా సిబ్బంది సంఖ్య 2.1 శాతం, బోధనేతర సిబ్బంది సంఖ్య 2.8 శాతం మాత్రమే పెరిగింది. ఉన్నత విద్యలో ప్రయివేటీకరణ ఊపందుకుంటోంది. ప్రయివేటు కళాశాలల సంఖ్య పెరుగుతోంది. అవి విధించే ఫీజులు విద్యార్థులపై పెనుభారం మోపుతున్నాయి. బోధనా సిబ్బందికి తక్కువ జీతాలు అందిస్తూ వారి శ్రమను ప్రయివేటు యాజమాన్యాలు దోచుకుంటున్నాయి.

ముస్తాబైన నల్లగొండ

(మొదటిపేజీ తరువాయి)

ఆయిష్ ఘోష్ ప్రసంగించనున్నారు. సాయంత్రం 6 గంటలకు సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. దీనికి సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ హాజరవుతారు. 29, 30 తేదీల్లో ప్రతినిధుల మహాసభ ఉంటుంది. అనంతరం నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక ఉంటుంది. అదేవిధంగా ఈ మహాసభలో ప్రత్యేకంగా 8 స్టాళ్ల ద్వారా చిత్ర ప్రదర్శనలు, బోధన అంశాలతో వైజ్ఞానిక ప్రదర్శనలు జరగనున్నాయి.

జియో మరో షాక్

న్యూఢిల్లీ : ఈ ఏడాది జులైలో 25 శాతం వరకు టారిఫ్ ధరలను పెంచిన రిలయన్స్ జియో మరోమారు వినియోగదారులకు షాక్ ఇచ్చింది. రోజువారీ డేటా పరిమితి అయిపోయినప్పుడు.. రూ.19, రూ.29 డేటా వోచర్లతో రీచార్జి చేసుకుంటే.. వాటి గడువు ఇక కేవలం ఒకే రోజు ఉంటుందని వెల్లడించింది. ఇంతక్రితం ప్లాన్ గడువు ముగిసే వారకు ఈ డేటాను ఉపయోగించుకునే వీలుండేది. తాజా సవరణతో అనేక మంది వినియోగదారులు తమ డేటా విలువను అన్యాయంగా కోల్పోనున్నారు.

పీఎస్‌బీలకు రూ.1.5 లక్షల కోట్ల లాభాలు

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు రూ.1.5 లక్షల కోట్ల లాభాలు సాధించొచ్చని ఆర్‌బిఐ అంచనా. తగ్గుతున్న మొండి బాకీలు, రెండంకెల స్థాయిలో రుణాల జారీ బ్యాంక్‌లకు లాభాలకు మద్దతును అందించనుంది. ప్రస్తుత ఆర్థిక సంవ త్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబ ర్‌తో ముగిసిన ప్రథమార్థం (హెచ్1) లో 25 శాతం వృద్ధితో రూ.85,520 కోట్ల లాభాలు ఆర్జించాయి. ఇంతక్రితం ఏడాది హెచ్1లో రూ.68,500 కోట్ల లాభాలు నమోదు చేశాయి. 2023- 24లో రూ.1.41 లక్షల కోట్ల నికర లాభాలు సాధించాయి.

కరిగిపోతున్న విదేశీ మారకం నిల్వలు

(మొదటిపేజీ తరువాయి)

ఏడు నెలల కనిష్టానికి పడిపోయినట్లయ్యిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) శుక్రవారం ఓ రిపోర్ట్‌లో తెలిపింది. ఒక్క నెలలోనే ఒకవారంలో అత్యధికంగా ఫారెక్స్ నిల్వలు పతనం కావడం ఇదే తొలిసారి. అంతకు ముందు రెండు వారాల్లో ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు 5.2 బిలియన్ డాలర్లు క్షీణించాయి. అమెరికా డాలర్‌తో రూపాయి మారకం విలువ 85 దిగువకు పడిపోవడంతో విదేశీ మారకం నిల్వలపై ఒత్తిడి పెరిగింది.

అమెరికా అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ ఎన్నికైనప్పటి నుంచి భారత స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడుల భారీగా తరలిపోవడంతో పాటుగా సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో జీడీపీ వృద్ధి దాదాపు రెండేండ్ల కనిష్టానికి దిగజారడం, రూపాయి విలువ పడిపోవడం విదేశీ మారకం నిల్వలు కరిగిపోవడానికి ప్రధాన కారణాలుగా ఉన్నాయి.

డిసెంబర్ 13తో ముగిసిన వారానికి భారత్ ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు 1.988 బిలియన్ డాలర్లు పతనమై 652.869 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఈ ఏడాది సెప్టెంబర్ నెలాఖరులో ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు 704.885 బిలియన్ డాలర్లతో జీవిత కాల గరిష్టాన్ని తాకాయి. కేవలం గడిచిన మూడు నెలల్లోనే రూ.5.20 లక్షల కోట్ల విలువ చేసే 61 బిలియన్ డాలర్ల విదేశీ మారకం నిల్వలు కరిగిపోవడం ఆందోళనకరం. ఈ నెల 20 నాటి వారంలో విదేశీ కరెన్సీ ఆస్తులు 6.014 బిలియన్ డాలర్లు కోల్పోయి 556.562 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. బంగారం రిజర్వులు 2.33 బిలియన్ డాలర్లు పతనమై 65.726 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్)లో భారత్ రిజర్వ్ నిల్వలు 23 మిలియన్ల డాలర్లు తగ్గి 4.217 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకున్నాయి. పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఆర్బీఐ వద్ద విదేశీ మారకం నిల్వలు భారీగా క్షీణించనున్నాయి. దీంతో విదేశీ రుణాలు, వాణిజ్య చెల్లింపులకు కటకట ఏర్పాడనుంది.

బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో వేదిక మారినా.. భారత బ్యాటర్ల వ్యథ మారటం లేదు. మెల్‌బోర్న్‌లో ఆసీస్ బ్యాటర్లు పరుగుల వరద పారించిన చోట.. టీమ్ ఇండియా స్టార్స్ చేతులెత్తేశారు. ఆసీస్ స్కోరులో సగమైనా చేయకముందే.. బ్యాటింగ్ లైనప్‌లో సగం మంది పెవిలియన్‌కు చేరారు. యశస్వి జైస్వాల్ (82) అర్థ సెంచరీతో కదం తొక్కినా.. భారత్ ఇంకా ఫాలోఆన్ ప్రమాదంలోనే కొనసాగుతుంది. నేడు మూడో రోజు ఆటలో లోయర్ ఆర్డర్ బ్యాటర్లు బాక్సింగ్ డే గతిని నిర్దేశించనున్నారు!.

పరుగుల వేటలో అదే వ్యథ


రోహిత్ శర్మ (3)
విరాట్ కోహ్లి (36)

- భారత బ్యాటర్లు విఫలం
- రాణించిన జైస్వాల్
- భారత్ తొలి ఇన్నింగ్స్ 164/5
- ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 474/10

నవతెలంగాణ-మెల్‌బోర్న్

బాక్సింగ్ డే టెస్టులో ఆతిథ్య ఆస్ట్రేలియా ఆధిపత్యం కొనసాగుతోంది. అటు బ్యాట్‌తో, అటు బంతితో టీమ్ ఇండియాను కంగారూలు కంగారు పెట్టారు. పేసర్లు పాట్ కమిన్స్ (2/57), స్కాట్ బొలాండ్ (2/24) నిప్పులు చెరగటంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో కష్టాల్లో కూరుకుంది. 46 ఓవర్లలోనే ఐదు వికెట్లు కోల్పోయి 164 పరుగులు చేసింది. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (82, 118 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్) అర్థ సెంచరీతో కదం తొక్కాడు. విరాట్ కోహ్లి (36, 86 బంతుల్లో 4 ఫోర్లు), కెఎల్ రాహుల్ (24, 42 బంతుల్లో 3 ఫోర్లు) మంచి ఆరంభాలను సద్వినియోగం చేసుకోలేదు. కెప్టెన్ రోహిత్ శర్మ (3), ఆకాశ్ దీప్ (0) విఫలం అయ్యారు. అంతకుముందు, స్టీవ్ స్మిత్ (140, 197 బంతుల్లో 13 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగగా, కెప్టెన్ పాట్ కమిన్స్ (49, 63 బంతుల్లో 7 ఫోర్లు) మెరుపు ఇన్నింగ్స్‌తో రాణించాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 474 పరుగుల భారీ స్కోరు సాధించింది. జశ్‌ప్రీత్ బుమ్రా (4/99) నాలుగు వికెట్లు పడగొట్టగా.. రవీంద్ర జడేజా (3/78), ఆకాశ్ దీప్ (2/94) రాణించారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ మరో 310 పరుగుల వెనుకంజలో నిలిచింది.


జైస్వాల్ 82

జైస్వాల్ జోరు :


బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు సత్ఫలితం ఇవ్వలేదు. రాహుల్‌ను మూడో స్థానానికి నెట్టిన రోహిత్ శర్మ.. యశస్వి జైస్వాల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను ఆరంభించాడు. కానీ పాట్ కమిన్స్ ఓవర్లో ఫుల్ షాట్‌ను సాఫ్ట్‌గా ఆడిన హిట్‌మ్యాన్.. బొలాండ్‌కు సులువైన క్యాచ్‌తో నిష్క్రమించాడు. ఆసీస్ కొండంత తొలి ఇన్నింగ్స్‌ను సమం చేసే దారిలో ఇన్నింగ్స్ 12వ బంతికే తొలి వికెట్ పడింది. కెఎల్ రాహుల్ (24), యశస్వి జైస్వాల్ రెండో వికెట్‌కు మంచి భాగస్వామ్యం అందించారు. 13 ఓవర్ల పాటు క్రీజులో నిలిచిన ఈ జోడీ ఆశలు రేపింది. కానీ పాట్ కమిన్స్ సూపర్ బంతితో రాహుల్ వికెట్‌ను గాల్లోకి లేపాడు. 51 పరుగుల వద్ద భారత్ రెండో వికెట్ కోల్పోయింది. ఈ సమయంలో యశస్వితో జత కట్టిన విరాట్ కోహ్లి (36) కీలక భాగస్వామ్యం నిర్మించాడు. జైస్వాల్ కాస్త దూకుడుగా పరుగులు రాబట్టగా.. విరాట్ కోహ్లి ఆచితూచి ఆడాడు. ఆఫ్ స్టంప్‌కు ఆవలగా వెళ్లిన బంతులను సహనంతో వదిలేసిన విరాట్ కోహ్లి.. క్రీజులో ఎక్కువ సేపు నిలవాలనే తపనతో కనిపించాడు. ఏడు ఫోర్లతో 81 బంతుల్లో అర్థ సెంచరీ సాధించిన యశస్వి జైస్వాల్ మరో భారీ ఇన్నింగ్స్ బాదేలా కదం తొక్కాడు. కోహ్లి, యశస్వి జోడీ మూడో వికెట్‌కు 102 పరుగులు జోడించింది. మరికొద్దిసేపట్లో రెండో రోజు ఆట ముగుస్తుందనగా భారత ఇన్నింగ్స్‌కు భారీ కుదుపు. యశస్వి జైస్వాల్ సింగిల్‌కు ప్రయత్నించగా.. కోహ్లి స్పందించలేదు. దీంతో జైస్వాల్ రనౌట్‌గా నిష్క్రమించాడు. అప్పటికి భారత్ స్కోరు 41 ఓవర్లలో 153 పరుగులు. ఓ దశలో 152/2తో మెరుగ్గా సాగుతున్న భారత్.. 13 పరుగుల వ్యవధిలో మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. యశస్వి రనౌట్ కాగా.. కోహ్లి బలహీనతను బొలాండ్ సొమ్ము చేసుకున్నాడు. నైట్‌వాచ్‌మన్ ఆకాశ్ దీప్ (0) 13 బంతుల్లోనే పెవిలియన్‌కు చేరాడు. దీంతో 164/5తో భారత్ ఇన్నింగ్స్ కుదేలైంది. రిషబ్ పంత్ (6 నాటౌట్), రవీంద్ర జడేజా (4 నాటౌట్) అజేయంగా క్రీజులో నిలిచారు.

స్మిత్ శతకం :

స్టీవ్ స్మిత్ (140), పాట్ కమిన్స్ (49) ఆసీస్‌కు భారీ స్కోరు అందించారు. బ్రిస్బేన్‌లో ఫామ్‌లోకి వచ్చిన స్మిత్.. మెల్‌బోర్న్‌లో శతకంతో మెరిశాడు. భారత బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్న స్మిత్ 167 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లతో మెరుపు సెంచరీ బాదాడు. పాట్ కమిన్స్ సైతం ధాటిగా ఆడటంతో ఈ జోడీ ఏడో వికెట్‌కు 112 పరుగుల సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పింది. కమిన్స్ అవుటైనా.. స్టార్క్ (15)తో కలిసి స్మిత్ జోరు కొనసాగించాడు. టెయిలెండర్లు సైతం రాణించటంతో ఆస్ట్రేలియా 122.4 ఓవర్లలో 10 వికెట్లకు 474 పరుగుల భారీ స్కోరు సాధించింది. భారత బౌలర్లలో బుమ్రా నాలుగు వికెట్లు పడగొట్టగా.. రవీంద్ర జడేజా (3/78), ఆకాశ్ దీప్ (2/94) రాణించారు. మహ్మద్ సిరాజ్ (0/122) 23 ఓవర్లలో 5.30 ఎకానమీతో పరుగులు ఇచ్చి బ్యాటర్లపై బుమ్రా, ఆకాశ్ పెంచిన ఒత్తిడిని వృథా చేశాడు!.

ఫాలో ఆన్ గండం? :

మెల్‌బోర్న్‌లో టీమ్ ఇండియా ఫాలో ఆన్ ప్రమాదంలో పడింది. తొలి ఇన్నింగ్స్‌లో 474 పరుగులు చేసిన ఆసీస్.. మరోసారి బ్యాట్ పట్టాలనే ఆలోచనలో లేరు!. ప్రస్తుతం భారత్ స్కోరు 164 పరుగులు. ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌కు 310 పరుగుల వెనుకంజలో నిలిచారు. ఫాలో ఆన్ మార్క్ దాటేందుకు కనీసం 275 పరుగులు చేయాలి. ఆ మార్క్‌కు భారత్ మరో 111 పరుగుల దూరంలో కొనసాగుతోంది. పంత్, జడేజాలకు తోడు ఆల్‌రౌండర్లు నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్‌లు బ్యాటింగ్‌కు రావాల్సి ఉంది. ఈ నలుగురు బ్యాటర్లు మంచి ఫామ్‌లో ఉన్నారు. అంచనాల మేరకు ఆడితే భారత్ మంచి స్కోరు చేయగలదు.


స్మిత్ (140)

స్కోరు వివరాలు :

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : కాన్‌స్టాస్ (ఎల్బీ) జడేజా 60, ఖవాజా (సి) రాహుల్ (బి) బుమ్రా 57, లబుషేన్ (సి) కోహ్లి (బి) సుందర్ 72, స్మిత్ (బి) ఆకాశ్ 140, హెడ్ (బి) బుమ్రా 0, మార్ష్ (సి) పంత్ (బి) బుమ్రా 4, అలెక్స్ (సి) పంత్ (బి) ఆకాశ్ 31, కమిన్స్ (సి) నితీశ్ (బి) జడేజా 49, లయాన్ (ఎల్బీ) బుమ్రా 13, బొలాండ్ నాటౌట్ 6, ఎక్స్‌ట్రాలు : 27, **మొత్తం :(122.4 ఓవర్లలో ఆలౌట్) 474.**

వికెట్ల పతనం : 1-89, 2-154, 3-237, 4-240, 5-246, 6-299, 7-411, 8-455, 9-455, 10-474.

బౌలింగ్ : జశ్‌ప్రీత్ బుమ్రా 28.4-9-99-4, మహ్మద్ సిరాజ్ 23-3-122-0, ఆకాశ్ దీప్ 26-8-94-2, రవీంద్ర జడేజా 23-4-78-3, నితీశ్ కుమార్ రెడ్డి 7-0-21-0, వాషింగ్టన్ సుందర్ 15-2-49-1.

భారత్ తొలి ఇన్నింగ్స్ : జైస్వాల్ (రనౌట్) 82, రోహిత్ శర్మ (సి) బొలాండ్ (బి) కమిన్స్ 3, రాహుల్ (బి) కమిన్స్ 24, విరాట్ కోహ్లి (సి) అలెక్స్ (బి) బొలాండ్ 36, ఆకాశ్ దీప్ (సి) లయాన్ (బి) బొలాండ్ 0, రిషబ్ పంత్ నాటౌట్ 6, రవీంద్ర జడేజా నాటౌట్ 4, ఎక్స్‌ట్రాలు : 9, **మొత్తం :(46 ఓవర్లలో 5 వికెట్లకు) 164.**

వికెట్ల పతనం : 1-8, 2-51, 3-153, 4-154, 5-159.

బౌలింగ్ : మిచెల్ స్టార్క్ 13-0-48-0, పాట్ కమిన్స్ 13-2-57-2, స్కాట్ బొలాండ్ 12-3-24-2, నాథన్ లయాన్ 5-1-18-0, మిచెల్ మార్ష్ 3-0-15-0.

అమ్మాయిలు క్లీన్‌స్వీప్

విండీస్‌పై 3-0తో వన్డే సిరీస్ వశం



వదోదర (గుజరాత్) : వెస్టిండీస్‌పై వన్డే సిరీస్‌ను 3-0తో సొంతం చేసుకుని 2024ను అమ్మాయిలు ఘనంగా ముగించారు. శుక్రవారం వడోదరలో జరిగిన ఆఖరు వన్డేలో భారత మహిళలు 5 వికెట్ల తేడాతో ఏకపక్ష విజయం సాధించారు. 163 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని హర్మన్‌ప్రీత్ సేన 28.2 ఓవర్లలోనే ఛేదించింది. మరో 130 బంతులు మిగిలి ఉండగానే లాంఛనం ముగించి సిరీస్ విజయాన్ని సొంతం చేసుకుంది. ఛేదనలో దీప్తి శర్మ (39 నాటౌట్, 48 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), హర్మన్‌ప్రీత్ కౌర్ (32, 22 బంతుల్లో 7 ఫోర్లు), జెమీమా రొడ్రిగస్ (29, 45 బంతుల్లో 1 ఫోర్), రిచా ఘోష్ (23 నాటౌట్, 11 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు) రాణించారు. స్మృతీ మంధాన (4), ప్రతికా రావల్ (18) నిరాశపరిచారు. ఆఖర్లో మూడు సిక్సర్లు బాదిన రిచా ఘోష్.. తనదైన శైలిలో లాంఛనం పూర్తి చేసింది. అంతకుముందు, దీప్తి శర్మ (6/31) ఆరు వికెట్ల మాయజాలంతో వెస్టిండీస్ అమ్మాయిలు విలవిల్లాడారు. పేసర్ రేణుక సింగ్ (4/29) సైతం నిప్పులు చెరుగగా వెస్టిండీస్ 38.5 ఓవర్లలో 162 పరుగులకు ఆలౌట్ అయ్యింది. హెన్రీ (61, 72 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), కాంప్‌బెల్ (46, 62 బంతుల్లో 7 ఫోర్లు) రాణించటంతో విండీస్ గౌరవప్రద స్కోరు సాధించింది. 3-0తో వన్డే సిరీస్ భారత్ వశం కాగా.. దీప్తి శర్మ ఆల్‌రౌండ్ షోతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచింది. పది వికెట్లతో మెరిసిన రేణుక సింగ్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు అందుకుంది.

సచిన్‌కు ఎంసీసీ గౌరవ సభ్యత్వం



మెల్‌బోర్న్ : ప్రపంచ క్రికెట్ దిగ్గజం, మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్‌కు మరో గౌరవం దక్కింది. మెల్‌బోర్న్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) భారత లెజెండ్‌కు గౌరవ సభ్యత్వం అందించింది. ఈ మేరకు ఎంసీసీ ఆహ్వానాన్ని సచిన్ సుముఖత వ్యక్తం చేసినట్టు శు క్రవారం సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. ' ఓ దిగ్గజానికి గౌరవం. భారత మాజీ కెప్టెన్ సచిన్ టెండూల్కర్ ఎంసీసీ గౌరవ క్రికెట్ సభ్యత్వాన్ని అంగీకరించినట్టు తెలియజేసేందుకు సంతోషిస్తున్నాం. క్రికెట్‌కు సచిన్ అందించిన విశేష సేవలను ఎంసీసీ గౌరవిస్తుంది' అని ఎంసీసీ 'ఎక్స్' ఖాతాలో వెల్లడించింది. సచిన్ టెండూల్కర్‌కు మెల్‌బోర్న్‌లో మంచి రికార్డుంది. ఐదు టెస్టుల్లో 44.90 సగటుతో 449 పరుగులు సాధించాడు. 2012లో సచిన్‌ను ఆసీస్ ప్రభుత్వం 'ఆర్డర్ ఆఫ్ ఆస్ట్రేలియా' పురస్కారంతో సత్కరించింది. మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ వ్యవహారాలను ఎంసీసీ పర్యవేక్షిస్తుంది.

నేటి నుంచి సీఎం కప్ పోటీలు

నవతెలంగాణ-హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ 2024 పోటీలు నేటి నుంచి ఆరంభం కానున్నాయి. మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ కాలధర్మం చేయటంతో దేశవ్యాప్తంగా సంతాప దినాలు ప్రకటించారు. దీంతో సీఎం కప్ పోటీల ఆరంభ వేడుకలను రద్దు చేశారు. 36 క్రీడాంశాల్లో నేటి నుంచి ఆటల పోటీలు ఆరంభం కానున్నాయి. పోటీలను అత్యంత సాధారణ వాతావరణంలో నిర్వహించేలా శాట్ యంత్రాంగం అధికారులను సూచనలు చేసింది. జనవరి 2న సీఎం కప్ పోటీలు ముగియనున్నాయి. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు చేరుకున్న క్రీడాకారుల వసతి, భోజనం ఏర్పాట్లను శాట్ చైర్మెన్ కే. శివసేనా రెడ్డి పరిశీలించారు.

ఫైనల్లో హర్యానా స్టీలర్స్

పుణె (మహారాష్ట్ర) : ప్రొ కబడ్డీ లీగ్‌లో హర్యానా స్టీలర్స్ వరుసగా రెండో సీజన్లో ఫైనల్‌కు చేరుకుంది. శుక్రవారం పుణెలో జరిగిన పీకెఎల్ 11 సెమీఫైనల్లో యూపీ యోధాస్‌పై 28-25తో హర్యానా స్టీలర్స్ గెలుపొందింది. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన సెమీ సమరంలో హర్యానా స్టీలర్స్ 3 పాయింట్ల తేడాతో టైటిల్ పోరుకు చేరుకుంది. ప్రథమార్థంలో 12-11తో పైచేయి సాధించిన స్టీలర్స్.. ద్వితీయార్థంలో 16-14తో ఆధిక్యం నిలుపుకుంది. యూపీ యోధాస్ రెయిడర్ గగన్ గౌడ (10) మెరిసినా నిరాశ తప్పలేదు. హర్యానా స్టీలర్స్ ఆటగాళ్లలో శివమ్ (7), వినయ్ (6), రాహుల్ (5), సంజయ్ (3) సమిష్టిగా రాణించారు.


మీనాక్షి చౌదరి, వెంకటేష్, ఐశ్వర్య రాజేష్

మొదలైన 'పొంగల్' పాట సందడి

వెంకటేష్, మీనాక్షిచౌదరి, ఐశ్వర్య రాజేష్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం "సంక్రాంతికి వస్తున్నాం'. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మిస్తోంది. మొదటి రెండు పాటలకు చార్ట్‌బస్టర్ రెస్పాన్స్ వచ్చింది. ఫస్ట్ సింగల్ 'గోదారి గట్టు' గ్లోబల్ టాప్ 20 వీడియోస్ లిస్టులో ప్రవేశించగా, సెకండ్ సింగిల్ 'మీను' కూడా అన్ని మ్యూజిక్ చార్టులలో అగ్రస్థానంలో ఉంది.

తాజాగా మేకర్స్ థర్డ్ సింగల్ 'పొంగల్..' సాంగ్ అప్డేట్ ఇచ్చారు. ఈనెల 30న ఈ సాంగ్‌ని రిలీజ్ చేయనున్నారు. సాంగ్ అనౌన్స్ మెంట్ పోస్టర్ హీరో వెంకటేష్, హీరోయిన్స్ మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ కలర్ ఫుల్, సిగ్నేచర్ డ్యాన్స్ మూమెంట్ తో కనిపిస్తూ సర్‌ప్రైజ్ చేస్తున్నారు.

ఈ సాంగ్ కోసం భీమ్స్ సిసిరోలియో సంక్రాంతి ఫెస్టివల్ వైబ్‌ని హైలైట్ చేసే మరో అద్భుతమైన నెంబర్‌ని కంపోజ్ చేశారు. వెంకటేష్ స్వయంగా ఈ పాట పాడటం బిగ్గెస్ట్ ఎట్రాక్షన్. ఈ ఎనర్జిటిక్, కలర్‌ఫుల్ నెంబర్‌కు భాను మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. ఈ సాంగ్ సినిమా మెయిన్ హైలెట్‌లలో ఒకటిగా ఉంటుంది.

ఈ చిత్రంలో వెంకటేష్ ఎక్స్ పోలీస్ పాత్రలో, ఐశ్వర్య రాజేష్ అతని భార్యగా, మీనాక్షి చౌదరి ఎక్స్ లవర్‌గా కనిపించనున్నారు. ఈ సినిమా జనవరి 14న సంక్రాంతి కానుకగా విడుదల కానుంది అది చిత్ర బృందం తెలిపింది.

ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: అనిల్ రావిపూడి, సమర్పణ: దిల్ రాజు, నిర్మాత: శిరీష్, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, డీవోపీ: సమీర్ రెడ్డి, ప్రొడక్షన్ డిజైనర్: ఏ.ఎస్.ప్రకాష్, ఎడిటర్: తమ్మిరాజు, యాక్షన్ డైరెక్టర్: వి.వెంకట్.

కలల నేపథ్యంలో డ్రీమ్ క్యాచర్




ప్రశాంత్ కృష్ణ, అనీషా ధామ, శ్రీనివాస్ రామిరెడ్డి, ఐశ్వర్య హోలక్కల్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్న సినిమా 'డ్రీమ్ క్యాచర్'.

ఈ చిత్రాన్ని సీయెల్ మోషన్ పిక్చర్స్ బ్యానర్ పై దర్శకుడు సందీప్ కాకుల రూపొందిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా జనవరి 3న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.

ఈ నేపథ్యంలో శుక్రవారం ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. హీరో ప్రశాంత్ కృష్ణ మాట్లాడుతూ, 'సైకలాజికల్ థ్రిల్లర్‌గా సరికొత్త ఎక్స్‌పీరియన్స్‌ను ఈ సినిమా మీ అందరికీ ఇస్తుంది. ట్రైలర్ చూశాక అడివిశేష్, రానాలా నేను ఉన్నానంటూ కామెంట్స్ వస్తున్నాయి. వాళ్లు గొప్ప యాక్టర్స్, సెల్ఫ్ మేడ్ స్టార్స్. అలాంటి టాలెంటెడ్ ప్యాషనేట్ యాక్టర్స్‌తో నన్ను పోల్చడం సంతోషంగా ఉంది' అని తెలిపారు.

'సినిమా చేయాలనేది నా డ్రీమ్. కలల మీద సినిమా చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచనతో ఈ 'డ్రీమ్ క్యాచర్' మూవీ మొదలైంది. ఇన్‌సెప్షన్ లాంటి హాలీవుడ్ మూవీస్ నాకు స్ఫూర్తిగా నిలిచాయి. ఒక హాలీవుడ్ స్థాయి అటెంప్ట్ చేయాలని అనుకున్నాను. మనకున్న రిసోర్సెస్‌లో మొత్తం హైదరాబాద్‌లోనే సినిమా రూపొందించాను. ట్రైలర్, పోస్టర్స్ చూసి ఈ మూవీ ఎక్కడ షూటింగ్ చేశారని అడుగుతున్నారు. మేము ఎక్కడికీ వెళ్లలేదు. హైదరాబాద్‌లోనే షూట్ చేశాం. కలల నేపథ్యంగా ఇలాంటి సినిమా ఇప్పటిదాకా తెలుగులో రాలేదని చెప్పగలను. గంటన్నర నిడివితో సినిమా ఉంటుంది. పాటలు, ఫైట్స్ ఉండవు. అవి లేకుండా కేవలం కథ మీదనే మూవీ వెళ్తుంది' అని డైరెక్టర్ సందీప్ కాకుల చెప్పారు.


త్రిష, అజిత్

'విడాముయర్చి' సంక్రాంతి కానుకగా విడుదల

అజిత్‌కుమార్, లైకా ప్రొడక్షన్స్ కలయికలో మగిళ్ తిరుమేని దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'విడాముయర్చి'. ఈ సినిమా సంక్రాంతికి విడుదలవుతున్న సంగతి తెలిసిందే. అనౌన్స్‌మెంట్ రోజు నుంచి భారీ అంచనాలతో తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం అభిమానులు, సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. రీసెంట్‌గా విడుదలైన ఈ సినిమా టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. సినిమాపై అంచనాలు మరింతగా పెరిగాయి. ఈ అంచనాలను నెక్ట్స్ లెవెల్‌కు తీసుకెళుతూ మేకర్స్ ఈ మూవీ నుంచి 'సవదీకా' అనే ఫాస్ట్ బీట్ ఎనర్జిటిక్ సాంగ్‌ను మేకర్స్ శుక్రవారం విడుదల చేశారు. అనిరుద్ రవిచందర్ తనదైన శైలిలో మరో సూపర్బ్ ట్యూన్‌తో ఈ సాంగ్‌ను కంపోజ్ చేశారు. ఆంథోని దాసన్ పాడిన ఈ పాటను అరివు రాశారు.

స్టార్ హీరోలతో భారీ బడ్జెట్ చిత్రాలను, వైవిధ్యమైన చిత్రాలతో యంగ్ టాలెంట్‌ను ఎంకరేజ్ చేస్తూ సినిమాలను నిర్మిస్తోన్న ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై జి.కె.ఎం.తమిళ్ కుమరన్ నేతృత్వంలో సుభాస్కరన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. అర్జున్, త్రిష ప్రధాన పాత్రల్లో నటించారు. ఇంకా ఈ చిత్రంలో ఆరవ్, రెజీనా కసండ్ర, నిఖిల్ నాయర్ తదితరులు ఇతర పాత్రల్లో మెప్పించనున్నారు.

కోలీవుడ్ రాక్ స్టార్ అనిరుద్ సంగీతాన్ని అందిస్తుండగా, ఓం ప్రకాష్ ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్‌గా, ఎన్.బి.శ్రీకాంత్ ఎడిటర్‌గా, మిలాన్ ఆర్ట్ డైరెక్టర్‌గా వర్క్ చేశారు. ఇంకా ఈ చిత్రానికి సుందర్ స్టంట్స్‌ను కంపోజ్ చేయగా, అను వర్ధన్ కాస్ట్యూమ్స్ డిజైనర్‌గా పని చేశారు. సుబ్రమణియన్ నారాయణన్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా, జె.గిరినాథన్, కె.జయశీలన్ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్‌గా వర్క్ చేశారు. ఈ సినిమా శాటిలైట్ హక్కులను సన్ టీవీ సొంతం చేసుకోగా, ఓటీటీ హక్కులను నెట్‌ఫ్లిక్స్ దక్కించుకుంది. సోనీ మ్యూజిక్ ద్వారా ఆడియో విడుదలవుతుంది అని చిత్ర యూనిట్ తెలిపింది.

నవచిత్రం

ఒకడి ఇగో కోసం పరిశ్రమ తలవంచింది


తమ్మారెడ్డి భరద్వాజ

"ఇప్పుడు సినీ ఇండస్ట్రీ అంతా వెళ్లి సీఎం ముందు చేతులు కట్టుకుని నిలబడాల్సిన అవసరం ఏమొచ్చింది' అని అంటూ దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ ఘాటుగా స్పందించారు.

సినిమా ఇండస్ట్రీ పెద్దలు గురువారం సీఎం రేవంత్ రెడ్డిని కలవడంపై ఆయన ఈ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం తెలుగు చిత్ర పరిశ్రమలో ఏర్పడిన పరిణామాలపై ఆయన ఓ వీడియోను విడుదల చేశారు.

'సంధ్య థియేటర్ ఘటనలో తప్పయితే జరిగింది. ఈ తప్పు జరిగిన తర్వాత దానిని కవర్ చేయడానికి మళ్లీ కొన్ని అబద్ధాలు ఆడటంతో గవర్నమెంట్ కూడా దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం, అలాగే బన్నీ కూడా అదే రీతిలో తీసుకోవడంతో పెద్ద వివాదంగా మారిపోయింది.

ఫైనల్‌గా ఇండస్ట్రీ పెద్దలందరూ సీఎం దగ్గరకు వెళ్లాల్సి వచ్చింది. దీనిని కాంప్రమైజ్ అనాలో, లేక తలవంపులు అనాలో.. ఏమనాలో నాకు తెలియదు.

ఒక్క మనిషి కోసం, ఒకే ఒక్కడి కోసం, ఒకడి ఇగో కోసం ఇంతమంది తలవంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. సినిమా వాళ్లను ఫ్యాన్స్ దేవుళ్లుగా చూస్తారు. దానికి అనుగుణంగా హీరోలు ఎక్కడికి వెళ్లినా నాలుగు కారుల్లో వెళ్లాలి. రోడ్ షో చేయాలని భావిస్తున్నారు. అలా కాకుండా సైలెంట్‌గా వెళ్లి సినిమా చూసి వచ్చేస్తే, సంధ్య థియేటర్‌లాంటి ఘటనలు జరగడానికి ఆస్కారం తక్కువ ఉంటుంది. అభిమానులు, ప్రజా శ్రేయస్సు గురించి కూడా హీరోలు ఆలోచించాలి. హీరోలు ఎంత అడిగితే అంత ఇవ్వడానికి నిర్మాతలు పోటీపడుతున్నారు. టికెట్ రేట్లు పెంచి ప్రజల మీద ఆ భారం వేస్తున్నారు. హీరోలందరూ ఒక్క విషయం తెలుసుకోవాలి. కలెక్షన్స్‌పరంగా కాదు పెర్ఫార్మెన్స్ పరంగా తెలుగువారికి గర్వకారణంగా నిలవాలి' అని తమ్మారెడ్డి భరద్వాజ తీవ్రంగా స్పందించారు.


రవితేజ మహాదాస్యం, అనన్య నాగళ్ల

ప్రేక్షకులు ప్రశంసిస్తున్నారు

వెన్నెల కిషోర్, అనన్య నాగళ్ల, రవితేజ మహాదాస్యం ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. రైటర్ మోహన్ రచన, దర్శకత్వం వహించారు. లాస్యారెడ్డి సమర్పణలో శ్రీ గణపతి సినిమాస్ బ్యానర్‌పై వెన్నపూస రమణారెడ్డి నిర్మించారు.

'క, పొలిమేర 2, కమిటీ కుర్రోళ్లు' చిత్రాలతో విజయాలు అందుకున్న వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని విడుదల చేశారు. ఈనెల 25న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం అందరినీ అలరించి సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది.

ఈ సందర్భంగా మేకర్స్ సక్సెస్ మీట్ నిర్వహించారు.

హీరోయిన్ అనన్య నాగళ్ల మాటాడుతూ, 'మా సినిమాకి చాలా మంచి రెస్పాన్స్ వస్తోంది. సినిమాతో పాటు నా పాత్రకు కూడా అద్భుతమైన రెస్పాన్స్ రావడం చాలా ఆనందంగా ఉంది. మంచి థ్రిల్ ఇచ్చే ఫిల్మ్ ఇది. చూసిన ప్రేక్షకులు సీట్ ఎడ్జ్ థ్రిల్లర్ అంటున్నారు' అని అన్నారు.

'సినిమాని సపోర్ట్ చేసిన ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. ఒక మంచి సినిమా తీశారు, మంచి ప్రయత్నం చేశారు అని ప్రేక్షకులు చెబుతున్నారు. సినిమా చూసిన ఆడియన్స్ స్క్రీన్ ప్లే చాలా అద్భుతంగా ఉంది, చివరి 40 నిమిషాలు కట్టిపడేస్తుంది, సీట్ ఎడ్జ్ థ్రిల్లర్ అని ప్రశంసలు కురిపించడం ఆనందంగా ఉంది. ఈ శని, ఆదివారం కూడా ఈ సినిమాని ఇలానే సపోర్ట్ చేసి ఇంకా మంచి నెంబర్స్ మాకు ఇచ్చి ఒక సక్సెస్‌ఫుల్ ప్రాజెక్ట్‌తో బయటికి వచ్చేలా మమ్మల్ని ఆశీర్వదిస్తారని కోరుకుంటున్నాం' అని వంశీ నందిపాటి చెప్పారు. నిర్మాత వెన్నపూస రమణారెడ్డి మాట్లాడుతూ,'మొదటి ప్రయత్నంలోనే సక్సెస్ సాధించానని అనుకుంటున్నాను. మేము ఊహించిన దాని కంటే రెస్పాన్స్ చాలా బెటర్‌గా ఉంది. అన్నింటికి మించి ప్రేక్షకులు సినిమా బాగుందని ప్రశంసించడం సంతోషంగా ఉంది' అని తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

మన్మోహన్ సింగ్‌కు ప్రపంచ నేతల సంతాపం





న్యూఢిల్లీ : మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మృతిపై ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. రష్యా, అమెరికా, చైనా, కెనడా, ఫ్రాన్స్, రష్యా మలేషియా, శ్రీలంక, బంగ్లాదేశ్, ఇరాన్ తదితర దేశాల నుంచి సంతాపాలు వెల్లువెత్తాయి. రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్ మన్మోహన్‌ను అత్యుత్తమ రాజనీతిజ్ఞుడిగా ప్రశంసించారు. భారత ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహించడం లోనూ, ప్రపంచ వేదికపై భారత ప్రయోజనాలను ప్రస్తావించడంలోనూ మన్మోహన్ చాలా సాధించారని పుతిన్ పేర్కొన్నారు. 'భారత్-రష్యాల మధ్య స్నేహపూర్వక సంబంధాలను బలోపేతం చేసి వాటిని ప్రత్యేక, విశేషమైన, వ్యూహాత్మక భాగస్వామం స్థాయికి పెంచడానికి మన్మోహన్ వ్యక్తిగత సహకారం అందించారు' అని తెలిపారు. 'ఈ అద్భుతమైన వ్యక్తితో వివిధ సందర్భాల్లో అనేక సార్లు మాట్లాడాను' అని పుతిన్ గుర్తు చేసుకున్నారు.

మన్మోహన్ సింగ్ మృతి పట్ల చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ శుక్రవారం ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసింది. భారత్-చైనా సంబంధాలకు సింగ్ సానుకూల సహకారం అందించారని పేర్కొంది. మన్మోహన్ సింగ్‌ను భారత ప్రజలు విస్తృతంగా గౌరవించే 'అత్యుత్తమ నాయకులు' అని భారత్‌లో చైనా రాయబారి జు ఫీహోంగ్ అభివర్ణించారు.

అమెరికా-భారత్ వ్యూహాత్మక భాగస్వామ్యం కోసం కృషి చేసిన 'గొప్ప ఛాంపియన్లలో మన్మోహన్ సింగ్ ఒకరు' అని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్ పేర్కొన్నారు. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను మార్చివేసిన పౌర అణు సహకార ఒప్పందానికి పునాది వేసిన ఘనత మన్మోహన్‌దేనని తెలిపారు. భారత దేశ అభివృద్ధిని ప్రోత్సహించిన ఆర్థిక సంస్కరణల విషయంలో మన్మోహన్ ఎప్పటికీ గుర్తుంచుకోబడతారని తెలిపారు. అలాగే, భారత్ ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయిందని ఫ్రాన్స్ అధ్యక్షులు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ తన సంతాప సందేశంలో తెలిపారు. మన్మోహన్‌ను ఫ్రాన్స్‌కు నిజమైన స్నేహితుడిగా కితాబిచ్చారు. భారత్‌లో జర్మనీ రాయబారి ఫిలిప్ అకెర్మూన్ తన సంతాప సందేశంలో 'ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని నూతన శిఖరాలకు చేర్చడంలో మన్మోహన్ సింగ్‌ది కీలక పాత్ర' అని పేర్కొన్నారు.

జపాన్ ప్రధాని ఇషిబా షిగేరు తన సంతాప సందేశంలో 'ప్రస్తుత జపాన్-భారత్ సంబంధాల అభివృద్ధికి పునాదిని నిర్మించడంలో సింగ్ కృషి అద్భుతమైనది' అని పేర్కొన్నారు. ఆస్ట్రేలియా కూడా మన్మోహన్ సింగ్ మృతిపై సంతాప సందేశం పంపింది. ఆర్థిక సంస్కరణల్లో ఆయన చేసిన కృషిని ప్రశంసించింది. మన్మోహన్ సింగ్ సంస్కరణలు భారతదేశాన్ని మార్చాయని, సంకెళ్లు లేని ఆర్థిక వ్యవస్థను తయారు చేసిందని ఐఎంఎఫ్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గీతా గోపినాథ్ సంతాపం తెలిపారు.

భారత సరిహద్దు దేశాలైన పాకిస్థాన్, బంగ్లాదేశ్, భూటన్, మాల్దీవులు, శ్రీలంక, నేపాల్ నాయకులు కూడా మన్మోహన్ సింగ్ మృతిపై సంతాప సందేశం విడుదల చేశారు.


పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఎం ఇషాక్ దార్ తన సందేశంలో మన్మోహన్ సింగ్‌ను విశిష్ట ఆర్థికవేత్త, రాజకీయ నాయకుడిగా అభివర్ణించారు. వివేకం, సున్నిత ప్రవర్తనకు మన్మోహన్ గుర్తిండిపోతారని తెలిపారు.


బ్రిక్స్ వంటి సంకీర్ణాలకు మన్మోహన్ సింగ్ అందించిన సహకారాన్ని శ్రీలంక అధ్యక్షుడు అనూర కుమార దిసనాయకే తన సందేశంలో గుర్తు చేసుకున్నారు. "శ్రీలంక ప్రజల తరపున, నా తరపున భారత్‌కు, మన్మోహన్ సింగ్ కుటుంబానికి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అసంఖ్యాక అభిమానులకు నా హృదయపూర్వక సానుభూతిని తెలియజేస్తున్నాను. ఆయన దార్శనికత కలిగిన నాయకుడు. ఆయన ప్రభావం దేశ సరిహద్దులను అధిగమించింది. 2004 నుండి 2014 వరకు ప్రధానమంత్రిగా, విద్యా హక్కు చట్టం, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వంటి ఆయన విధానాలు ఈక్విటీ, కలుపుకుపోవడం పట్ల ఆయన దృఢమైన నిబద్ధతను ప్రతిబింబించాయి" అని అన్నారు.

బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వంలో చీఫ్ అడ్వైజర్ ముహమ్మద్ యూనస్ మన్మోహన్ సింగ్ మృతి పట్ల సంతాపాన్ని తెలిపారు. మన్మోహన్ సింగ్ గొప్ప వినయం కలిగిన వ్యక్తిగా, దూరదృష్టి గల నాయకుడిగా, రాజనీతిజ్ఞుడిగా, దేశ ప్రజల సంక్షేమానికి భరోసా ఇవ్వడంలో అచంచలమైన నిబద్ధతకు పేరుగాంచిన వ్యక్తిగా అభివర్ణించారు. మన్మోహన్ మృతిపై ఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయం సంతాపం తెలిపింది. ఆఫ్ఘనిస్తాన్ మాజీ అధ్యక్షుడు హమీద్ కర్జాయ్ తన సంతాప సందేశంలో భారత్ తన అత్యంత ప్రసిద్ధ కుమారుల్లో ఒకరిని కోల్పోయిందని తెలిపారు.

అమరావతి రైల్వేలైన్‌కు 534.23 ఎకరాలు

భూ సేకరణకు నోటిఫికేషన్ విడుదల





అమరావతి : అమరావతి రాజధానిలో కీలకమైన రైల్వే ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నోటిఫికేషన్ జారీచేసింది. నంబూరు నుండి ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం వరకూ 56.53 కిలోమీటర్ల పరిధిలో కొత్త బిజి (బ్రాడ్ గేజ్) లైన్ ఏర్పాటు చేసేందుకు మొత్తం 534.23 ఎకరాలు అవసరమని అధికారులు పేర్కొన్నారు. దీనిలో గుంటూరు జిల్లాలో 199.71 ఎకరాలు, ఎన్‌టిఆర్ జిల్లాలో 334.52 ఎకరాలు సేకరించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ మేరకు 1989 రైల్వే చట్టంలోని 20ఎ ప్రకారం పబ్లిక్ నోటీసు జారీచేస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా నందిగామ డివిజన్ పరిధిలోని కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో ఎనిమిది గ్రామాల పరిధిలో భూమిని సేకరించనున్నట్లు నోటిఫికేషన్‌లో తెలిపారు. 2018లో సవరించిన ఎపి భూసేకరణ చట్టం (ఆంధ్రప్రదేశ్) ప్రకారం ఈ భూములు సేకరించనున్నట్లు పేర్కొన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా పరిటాల, గొట్టుముక్కల, జుజ్జూరు, గూడెం మాధవరం, చెన్నారావుపాలెం, పెద్దాపురం, అల్లూరు, నరసింహారావుపాలెం పరిధిలో భూములు సేకరించనున్నారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం కొప్పురావూరు, పెదకాకాని, తాడికొండ మండలంలోని మోతడక, తాడికొండ, కంతేరు గ్రామాలు, తుళ్లూరు మండలంలోని పెదపరిమి, వడ్డమాను గ్రామాల్లో 199.71 ఎకరాలను రైల్వే ప్రాజెక్టుకు భూసేకరణ చేయనున్నారు. దీనిపై అభ్యంతరాలు ఉన్న వ్యక్తులు ప్రకటన వచ్చినప్పటి నుండి 30 రోజుల్లో తెలపాలని, వాటిని అధికారులు పరిశీలించిన అనంతరం స్వయంగా లేదా న్యాయవాది ద్వారా అభ్యంతరాలను ప్రత్యక్షంగా చెప్పేందుకు అవకాశం కల్పిస్తామని గుంటూరు జిల్లా అధికారులు పేర్కొన్నారు. దాన్ని ఆమోదించాలా, లేదా తిరస్కరించాలా అనేది జిల్లా అధికారుల నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. అయితే అమరావతి రాజధానికి సంబంధించిన ప్రాజెక్టని చెబుతున్నా కొత్తగా ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం అమరావతి వెలుపలి వైపు నుండి ఈ లైను వెళ్తోంది. సికింద్రాబాద్ విజయవాడ రైల్వేలైనుపై ఎర్రుపాలెం నుండి అమరావతి లైను ప్రారంభం అవుతుంది. ఈలైను గుంటూరు విజయవాడ మధ్యలో నంబూరు వద్ద కలుస్తుంది. కొత్తగా నిర్మించే లైనులో ఎర్రుపాలెం, పెద్దాపురం, చిన్నారావుపాలెం, గొట్టుముక్కల, పరిటాల, కొత్తపేట, వడ్డమాను, పెదపరిమి, తాడికొండ, కొప్పురావురుల్లో మొత్తంగా తొమ్మిది స్టేషన్లు నిర్మించనున్నారు. వీటన్నిటిలో పెద్దపరిమి, వడ్డమాను మధ్యలో నిర్మించే అమరావతి స్టేషన్‌ను అతిపెద్దగా నిర్మించనున్నారు. ఈ లైనులో భాగంగా గుంటూరు జిల్లాలోని వడ్డమాను రెవెన్యూ, ఎన్‌టిఆర్ జిల్లాలోని కొత్తపేట రెవెన్యూ గ్రామాల మధ్యలో కృష్ణానదిపై సుమారు మూడు కిలోమీటర్ల దూరం వంతెన నిర్మించనున్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు మొత్తాన్ని రైల్వే శాఖ పూర్తిగా భరిస్తుంది. 2017-18 మధ్యలో తొలిసారి ఆమోదం వచ్చిన సమయంలో రాష్ట్ర వాటా భరించాల్సి ఉంటుందని రైల్వేశాఖ తెలిపింది. దీనికి అప్పటి టిడిపి ప్రభుత్వం సిద్ధమైంది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అంత ఖర్చు తాము చేయలేమని తెలిపింది. దీంతో పనులు నిలిచిపోయాయి. 2024లో మరలా టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు మళ్లీ మొదలయ్యాయి. సుమారు రూ.2,640 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు ఈ ఏడాది జూన్‌లో కేంద్రం ఆమోదం తెలిపింది. దీనిపై రెండు రోజుల క్రితం గుంటూరు, ఎన్‌టిఆర్ జిల్లాల్లో నోటిఫికేషన్ జారీచేశాయి.

ప్రత్యామ్నాయం అవసరం

- రీసైక్లింగ్ టెక్నాలజీని అప్‌గ్రేడ్ చేయాలి
- క్లిష్టమైన ఖనిజాల అవసరంపై నిపుణులు, విశ్లేషకులు



న్యూఢిల్లీ : దేశంలోని క్లిష్టమైన ఖనిజాల విషయంలో ప్రత్యామ్నాయ మార్గాలు అవసరమని నిపుణులు, విశ్లేషకులు నొక్కి చెప్తున్నారు. ఇందుకు రీసైక్లింగ్ టెక్నాలజీని అప్‌గ్రేడ్ చేయాలని అంటున్నారు. కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ.. కీలకమైన మినరల్ డొమైన్‌లో సహకారం కోసం గతనెల 13న ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ (ఐఈఏ)తో అవగాహన ఒప్పందం (ఎంఓయూ)పై సంతకం చేసింది. భారతదేశపు మైనింగ్ పద్ధతులను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మార్చటం, కీలకమైన ఖనిజ వనరుల నిర్వహణ, వినూత్న వెలికితీత పద్ధతుల్లో విజ్ఞానం, సాంకేతికత బదిలీ, నైపుణ్యాభివృద్ధిని పంచుకోవటాన్ని మెరుగు పర్చటాన్ని లక్ష్యంగా పెట్టుకున్నది. అదనంగా, డేటా సేకరణ, మోడలింగ్, వనరుల విశ్లేషణ ద్వారా క్లిష్టమైన మినరల్ రీసైక్లింగ్ విధానాలలో దాని సముచిత సామర్థ్యాలను పెంపొందించటంలో భారత్‌కు ఇది ఒక ముఖ్యమైన మైలురాయిగా విశ్లేషకులు చెప్తున్నారు.మేలో ఐఈఏ తన రెండో వార్షిక గ్లోబల్ క్రిటికల్ మినరల్స్ ఔట్‌లుక్ రిపోర్టును ప్రచురించింది. దీనిలో క్లిష్టమైన ఖనిజాలకు, ముఖ్యంగా లిథియంకు బలమైన డిమాండ్ వృద్ధిని హైలెట్ చేసింది. ఇది నికెల్, కోబాల్ట్, గ్రాఫైట్ తర్వాత డిమాండ్‌లో 30 శాతం పెరుగుదలను చూసింది. చైనా, ఆస్ట్రేలియా, లాటిన్ అమెరికా వంటి నిర్దిష్ట భౌగోళిక సరిహద్దులలో మైనింగ్, ఈ పదార్థాల అధిక సాంద్రత విషయంలో మరింత ఆందోళనను వ్యక్తం చేసింది. కారణం.. ఈ ప్రాంతాలలో అంతరాయాలు క్లిష్టమైన ఖనిజాలలో కొరత, ధరల హెచ్చుతగ్గులకు కారణం కావచ్చు. ఐఈఏ ఇంకో నివేదిక ప్రకారం.. డెడికేటెడ్ రీసైక్లింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ఏర్పాటు చేయటంతో 2050 చివరి నాటికి రాగి, కోబాల్ట్‌ల కోసం కొత్త మైనింగ్ కార్యకలాపాల అవసరాలను 40 శాతం, లిథియం, నికెల్ 25 శాతం తగ్గించొచ్చు. కీలకమైన ఖనిజాల రీసైక్లింగ్ విలువ 2050 నాటికి పెరిగి 200 బిలియన్ డాలర్లకు చేరుకుంటుంది. అనేక ఏండ్లుగా, భారత్.. క్లిష్టమైన ఖనిజాల కోసం దిగుమతులపై ఆధారపడింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో లిథియం, గ్రాఫైట్, కోబాల్ట్, నికెల్‌ను దిగుమతి చేసుకోవటానికి రూ.34,000 కోట్లు ఖర్చు చేసింది. భారత కీలకమైన ఖనిజ దిగుమతుల్లో 56.3 శాతం వాటాతో చైనా ఆధిపత్యం ఉన్నది. ఇలాంటి తరుణంలో చైనాతో మోడీ సర్కారు అనుసరించే విధానం ఎంతో కీలకమని విశ్లేషకులు చెప్తున్నారు.

ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయాలపై భారత్ దృష్టి పెట్టింది. రీసైక్లింగ్ టెక్నాలజీలలో పెట్టుబడులను ఆకర్షించటానికి ఉత్పత్తి-సంబంధిత ప్రోత్సాహక పథకాన్ని ప్రవేశపెట్టాలని గనుల మంత్రిత్వ శాఖ యోచిస్తున్నది. ఈ ఏడాది బడ్జెట్‌లో.. కేంద్రం కీలకమైన ఖనిజ మిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. భారత్.. అధిక దిగుమతిపై ఆధారపడటం, పరిమిత సాంకేతిక పరిజ్ఞానం వంటివి బలమైన దేశీయ అభివృద్ధికి ఆటంకం కలిగించాయన్నది నిపుణులు, విశ్లేషకుల వాదన. 2047 నాటికి కోబాల్ట్ డిమాండ్ 5914 టన్నులకు, మాలిబ్డినం 2309 టన్నులకు, నికెల్ 26,203 టన్నులకు, లిథియం 20,845 టన్నులకు, గ్రాఫైట్ 2,17,884 టన్నులకు, సిలికాన్ 7,19,719 టన్నులకు పెరుగుతుందని అంచనా. క్లిష్టమైన ఖనిజాల కోసం పెరుగుతున్న అవసరాన్ని తీర్చటానికి భారత్ తన రీసైక్లింగ్ టెక్నాలజీలను అప్‌గ్రేడ్ చేయటంతో వ్యూహాత్మకంగా వ్యవహరించాలని నిపుణులు సూచిస్తున్నారు.

బాలికపై సామూహిక లైంగికదాడి



విజయవాడ : ఎనిమిదో తరగతి బాలికపై దుండగులు సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. ఈ సంఘటన కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని ఇనకుదురుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచిలీపట్నం వెంకటేశ్వర థియేటర్ సెంటర్ సమీపంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న బాలిక తల్లిదండ్రులతో కలిసి కాసానిగూడెంలో నివాసముంటోంది. శుక్రవారం రాత్రి 7.30 గంటల సమయంలో సమీపంలోని చిల్లర దుకాణానికి బాలిక వెళుతుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు అడ్డుకున్నారు. బలవంతంగా పట్టుకుని కాళ్లు, చేతులు కట్టేసి, నోటిని మూసి బైక్‌పై నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. వారితోపాటు మరో దుండగుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఏడ్చుకుంటూ ఇంటికి వస్తున్న బాలికను బంధువులు, తల్లిదండ్రులు విచారించగా జరిగిన అఘాయిత్యం గురించి తెలిపింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సుజుకి మాజీ ఛైర్మెన్ ఒసాము సుజుకి కన్నుమూత



న్యూఢిల్లీ : ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ సుజుకి మోటార్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ ఒసాము సుజుకి డిసెంబర్ 25న కన్నుమూశారు. 94 ఏళ్ల వయస్సులో ఆయన లింఫోమాతో మరణించారని ఆ కంపెనీ శుక్రవారం అధికారికంగా వెల్లడించింది. దాదాపు 40 సంవత్సరాలకు పైగా సుజుకి మోటార్ కార్ప్‌కు నాయకత్వం వహిం చారు. 91వ ఏట 2021 సంవత్సరంలో ఒసాము పదవీ విరమణ ప్రకటించారు. జపాన్‌లోని గెరోలో 1930 జనవరి 30న జన్మిం చిన ఒసాము.. సుజుకి వ్యవస్థాపక కుటుం బంలో వివాహం చేసుకున్న తర్వాత 1958లో ఆటోమేకర్‌లో చేరారు. తన భార్య ఇంటిపేరును తీసుకొని, ప్రపం చవ్యాప్తంగా చిన్న కార్లు, మోటార్ సైకిళ్లను పరిచయం చేశారు.

బరి తెగించిన ఇజ్రాయిల్

- యెమెన్‌లో దాడి నుంచి తృటిలో తప్పించుకున్న డబ్ల్యూహెచ్‌ఓ చీఫ్



సానా : హౌతి రెబెల్స్ అధీనంలో వున్న రాజధాని సానాను, పలు ఓడరేవు కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్ గురువారం ముమ్మర దాడులకు తెగబడింది. సానాలో విమానం ఎక్కేందుకు వెళుతున్న డబ్ల్యుహెచ్‌ఓ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అదనామ్ గెబ్రెయెసెస్ ఈ దాడుల నుంచి తృటిలో తప్పించుకున్నారు. ఆయన సిబ్బందిలో ఒకరు గాయపడ్డారు. ఈ దాడిలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్, డిపార్చర్ లాంజ్, రన్‌వేలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, అక్కడకు కొద్ది మీటర్ల దూరంలోనే తాము వున్నామని గెబ్రెయెసెస్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. తాను, యూఎన్ సహచరులు సురక్షితంగా వున్నామని చెప్పారు. ఇక్కడ నుంచి వెళ్ళాలంటే ముందుగా విమానాశ్రయానికి మరమ్మత్తులు చేయాల్సిన అవసరం వుందని, అందుకోసం ఇక్కడ వేచివుండక తప్పదన్నారు. విమానాశ్రయం నుంచి వెంటనే వారి బృందం వెళ్ళిపోయింది. కాగా, బాంబు దాడుల గురించి ఆయన నేరుగా ఎలాంటి ప్రస్తావన చేయలేదు. కాగా గాయపడిన వ్యక్తి ఐక్యరాజ్య సమితి మానవతా వ్యవహారాల విభాగానికి చెందిన సిబ్బంది అని ఆయనకు చికిత్స అందుతోందని ఐక్యరాజ్యసమితి ప్రతినిధి స్టీఫెన్ ట్రెంబ్లే చెప్పారు. విమానాశ్రయంపై జరిగిన ఈ దాడిలో ముగ్గురు మరణించగా, పలువురు గాయపడ్డారు. డబ్ల్యూహెచ్‌ఓ చీఫ్ లేదా వారి ప్రతినిధి బృందం యెమెన్‌లో వున్నట్టు తమకు తెలియదని ఇజ్రాయిల్ ఆర్మీ మీడియాకు తెలిపింది. ఇరాన్ మద్దతు గల హౌతిలు ఉపయోగించే మౌలిక వసతులపై దాడి చేస్తున్నట్టు మిలటరీ ఒక ప్రకటనలో తెలిపింది. హమాస్, హిజ్బుల్లా, అసద్ ప్రభుత్వం వీరందరికీ ఏమయిందో హౌతీలు తెలుసుకోవాలని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు వ్యాఖ్యానించారు.

యూఎన్ ఖండన

యెమెన్‌పై దాడులను ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ ఖండించారు. గురువారం నాటి దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ఈ మేరకు గుటెరస్ ఒక ప్రకటన జారీ చేశారు. అంతర్జాతీయ, మానవతా చట్టాలను గౌరవించాల్సిన అవసరం వుందని పేర్కొన్నారు. ఘర్షణలు కొనసాగుతున్న ఏరియాల్లో కీలకమైన మౌలిక సదుపాయాలను పరిరక్షించాలని అంతర్జాతీయ చట్టాలు పేర్కొంటున్నాయి. ఇటువంటి దాడుల వల్ల ప్రజలపై తీవ్ర ప్రభావమే కాకుండా మానవతా సాయానికి కూడా తీవ్ర ఆటంకం కలుగుతుందని ఆయన హెచ్చరించారు. డబ్ల్యూహెచ్‌ఓ చీఫ్ కూడా మానవతా సాయం అందచేసే కార్యక్రమం కోసమే యెమెన్‌కు వచ్చారన్నారు.

భటిండాలో బస్సు ప్రమాదం

- ఎనిమిది మంది మృతి



భటిండా : భటిండాకు వెళుతుండగా శుక్రవారం జరిగిన ఒక ప్రయివేట్ బస్సు ప్రమాదంలో 8మంది మరణించగా పలువురు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. బ్రిడ్జి రెయిలింగ్‌ను ఢీ కొని బస్సు కొద్ది అడుగుల కిందన గల కాల్వలోకి పడిపోయిందని ఆ సమయంలో బస్సులో 45మందికి పైగా ప్రయాణికులు వున్నారని చెప్పారు. భటిండాలోని జీవన్ సింగ్వాలా గ్రామంలో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు వచ్చి ప్రయాణికులకు సాయమందించారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు, జిల్లా యంత్రాంగం వచ్చి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని ఆస్పత్రిలో చేర్చారు. ప్రమాదానికి గల కారణం నిర్ధారించాల్సి వుందని, అయితే ఆ సమయంలో వాతావరణం కూడా సరిగా లేదని అధికారులు తెలిపారు.

ఖర్చు మీరే భరించాలి

- సముద్రమట్టం పెరుగుదల రక్షణ చర్యలపై కేంద్రం



న్యూఢిల్లీ : సముద్ర మట్టం పెరుగుదల కారణంగా చోటుచేసుకునే విపత్తులను ఎదుర్కొ,నేందుకు చేపట్టే రక్షణ చర్యలకు అయ్యే ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని కేంద్రం స్పష్టంచేసింది. ఇటీవల ముగిసిన పార్లమెంటు సమావేశాల్లో ఈ విషయమై అడిగిన ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు ఇచ్చిన జవాబు చర్చనీయాంశంగా మారింది. కేంద్ర ప్రభుత్వం ఇదే వైఖరిని కొనసాగిస్తే రాష్ట్ర ప్రభుత్వాలకు పెనుభారంగా మారుతుందన్న అభిప్రాయం పర్యావరణ వేత్తల్లో వ్యక్తమవుతోంది. కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ రాతపూర్వకంగా ఇచ్చిన జవాబులో ప్రాధాన్యతలు, వనరులను బట్టి సమస్యలకు పరిష్కారాలను, అవసరమైన వ్యూహాలను అమలు చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తరపున నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చి (ఎన్‌సిసిఆర్) అవసరమైన సాంకేతిక మద్దతు అందజేస్తుందని ఆయన చెప్పారు. దేశ వ్యాప్తంగా సముద్రమట్టాల పెరుగుదల గురించి తమ మంత్రిత్వ శాఖ అధికారికంగా ఎటువంటి అధ్యయనం చేయించలేదని, అయితే, వివిధ ఇతర వనరుల ద్వారా సమాచారాన్ని సేకరిస్తున్నామని ఆయన తెలిపారు.

రాష్ట్రంలో ఎక్కడెక్కడ...?

సముద్రమట్టం పెరుగుదల నుండి తప్పనిసరిగా రక్షణ చర్యలు తీసుకోవాల్సిన కొన్ని ప్రాంతాలను ఇప్పటికే గుర్తించినట్లు ఆ జవాబులో పేర్కొనడం విశేషం. ఈ జాబితాలో షార్‌కు కేంద్రం తొలి ప్రాధాన్యత ఇచ్చింది. నీటిమట్టం పెరుగుదల, తీరప్రాంత కోత నుండి షార్‌కు చెందిన వ్యూహాత్మక మౌలికసదుపాయాలను కాపాడుకోవాలని పేర్కొంది. సముద్ర తీరాన్నే ఉన్న ఒఎన్‌జిసి కూడా ముంపు, కోత ప్రమాదాన్ని ఎదుర్కొంటోందని పేర్కొంది. తీరాన్ని ఆనుకునే ఒఎన్‌జిసి ఏర్పాటు చేసిన సదుపాయాలను పరిరక్షించుకోవాలని సూచించింది.

విద్యుత్ ప్రయివేటీకరణను ఆపండి

- బిజిలీ పంచాయతీ డిమాండ్

చండీగఢ్ : విద్యుత్ ప్రయివేటీకరణను ఆపాలని నేషనల్ కోర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజనీర్స్ (ఎన్‌సీసీఓఈఈ) ఆధ్వర్యంలో జరిగిన ఒక బిజిలీ పంచాయితీ డిమాండ్ చేసింది. చండీగఢ్ కేంద్రపాలిత ప్రాంత విద్యుత్ విభాగాన్ని ప్రయివేటీకరించడానికి వ్యతిరేకంగా ఈ బిజిలి పంచాయతీని నిర్వహించారు. హర్యానా, పంజాబ్‌తో పాటు హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకాశ్మీర్ నుంచి వందలాది మంది విద్యుత్ ఉద్యోగులు ఈ పంచాయతీలో పాల్గొన్నారు. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని ఈ పంచాయితీలో తీర్మానం చేశారు. అలాగే విరామం ఎరుగని పోరాటాలకు ఈ పంచాయతీలో ప్రణాళిక రూపొందించారు. ఈ నెల 31న మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకూ విద్యుత్ ఉద్యోగులు విధులను బహిష్కరించి అన్ని రాష్ట్ర రాజధానుల్లోనూ రాజ్‌భవన్‌లకు ర్యాలీగా వెళ్లనున్నారు.

కాగా, ఈ పంచాయతీ సందర్భంగా విద్యుత్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ ర్యాలీలో మహిళలు, చిన్నారులు, కార్మికులు, వినియోగదారులు, నిర్వాసితుల సంక్షేమ సంఘాల సభ్యులు, రైతు సంఘాలు, గ్రామ పోరాట కమిటీలు, వివిధ రాజకీయ పార్టీలు కలిసికట్టుగా పాల్గొని విద్యుత్ ప్రయివేటీకరణను వ్యతిరేకించారు.

ఈ బిజిలీ పంచాయితీలో ఇఇఎఫ్ఐ ఉపాధ్యక్షులు, ఎఐఎస్‌జీఈఎఫ్ ప్రధాన కార్యదర్శి సుభాష్ లాంబ, ఈఈఎఫ్ఐ కార్యదర్శి సుదీప్ దుత్తా, కిసాన్‌సభ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్, ఎఐపీఈఎఫ్ ఛైర్మెన్ శైలేందర్ దుబే, చండీగఢ్ మేయర్ కుల్దీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమెరికా జాతీయ భద్రతా సలహాదారు సులివాన్‌తో జై శంకర్ భేటీ

శాన్‌ఫ్రాన్సిస్కో : అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సులివాన్‌తో విదేశాంగ మంత్రి జై శంకర్ శుక్రవారం వైట్‌హౌస్‌లో భేటీ అయ్యారు. భారత్, అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యం పురోగతిపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. ప్రస్తుత ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలను కూడా వారు చర్చించారు. అమెరికాలో అధికార పర్యటనలో వున్న జై శంకర్ అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్, ఇతర సీనియర్ నేతలతో సమావేశమై పలు అంశాలపై చర్చలు జరపనున్నారు. త్వరలో బాధ్యతలు స్వీకరించనున్న ట్రంప్ ప్రభుత్వ సీనియర్ నాయకత్వాన్ని కూడా జై శంకర్ కలుసుకుంటారని భావిస్తున్నారు.

దక్షిణ కొరియా తాత్కాలిక అధ్యక్షుడిని అభిశంసించిన పార్లమెంట్

సియోల్ : తాత్కాలిక అధ్యక్షుడు హన్ డక్ సూను అభిశంసించేందుకు దక్షిణ కొరియా పార్లమెంట్‌లో మెజారిటీ సభ్యులు శుక్రవారం ఓటు వేశారు. దేశంలో మార్షల్ లా విధించినందుకు ఈ నెల 14న అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌ను అభిశంసించినప్పటి నుండి ప్రధాని హన్ తాత్కాలిక అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. తాజాగా హన్ అభిశంసనకు గురవడంతో ఆర్థిక మంత్రి చోయి సంగ్ మోక్‌ను తాత్కాలిక అధ్యక్ష బాధ్యతలు చేపడతారని భావిస్తున్నారు. 300మంది సభ్యులు గల పార్లమెంట్‌లో 192మంది ఎంపీలు హన్‌ను అభిశంసించేందుకు అనుకూలంగా ఓటు వేశారు. పార్లమెంట్ అభిశంసించిన తర్వాత యూన్ సస్పెండ్ కావడంతో హన్ బాధ్యతలు చేపట్టారు. అయితే ప్రతిపక్ష ఎంపీలు హన్‌ను ప్రధానిగా కూడా తొలగించాలని కోరుతున్నారు. యూన్ అభిశంసన ప్రక్రియను పూర్తి చేయాలని, ఆయనకు న్యాయం జరిగేలా చూడాలని చేస్తున్న డిమాండ్లను హన్ తిరస్కరిస్తున్నారని వారు విమర్శిస్తున్నారు. తాత్కాలిక అధ్యక్షుడిని అభిశంసించడంకూడా దక్షిణ కొరియా చరిత్రలో ఇదే మొదటిసారి.